ఆంధ్ర సచిత్ర వారపత్రిక



25-2-'59

25 నయాపైసలు

ANDHRA PATRIKA




"మిధునం"

—ఫిలడేల్ఫియా మ్యూజియంలోని ఒరిస్సా శిల్పం]


జ్వరముపడ్డ తరువాత ఆరోగ్యము త్వరగా కోలుకొనుటకు

డ్యూరోల్ — బి-కాంప్లెక్స్ విటమినులు మరియు గ్లిసరోఫోస్ఫేట్లు సమృద్ధిగాగల దివ్యమైన టానిక్కు



జ్వరముపడ్డవారు నీర్సముగా ఉండుటకు కారణము వారి దేహము నుండి ముఖ్యమైన విటమినులు మరియు ఖనిజలవణములు పోవుటయే అని డాక్టర్లకు తెలియును. జ్వరముపడ్డ తరువాత నీర్సముపోయి ఆరోగ్యమును త్వరగా కోలుకొనుటకు డాక్టర్లు డ్యూరోల్‌ను వాడమంటారు. డ్యూరోల్. డ్యూమెక్స్ వారిచే శాస్త్రరీత్యా తయారుచేయబడిన టానిక్కు. దానిలో చేర్చబడే బి-కాంప్లెక్స్ విటమినులు ఆకలిని వృద్ధి పొందిస్తాయి మరియు ఆహారమును జీర్ణము చేయుటలో సహాయపడతాయి. అంతేకాక, జ్వరము పోయిన తరువాత శక్తి ఉత్సాహములను తిరిగి పొందుటకు యివి ఎంతో ముఖ్యమైనవి. డ్యూరోల్‌లో సోడియము, పొటాసియము మరియు కేల్సియముల యొక్క గ్లిసరోఫోస్ఫేట్లు కూడ కావలసినన్ని ఉన్నాయి. ఈ గ్లిసరోఫోస్ఫేట్ల ద్వారా, దేహమునకు ఎంతో ముఖ్యమైన ఫోస్ఫరస్ పదార్థము చేకూరుతుంది.

పైన చెప్పిన పోషకాంశములన్నియు ఉండుటవలననే డ్యూరోల్ జ్వరముపడ్డ తరువాత పూర్తి ఆరోగ్యమును కోలుకొనుటకు దివ్యమైనది. పైగా, అది జబ్బులు రాకుండా కాపాడుకొనుటకు దేహములో గల సహజ శక్తులను బలపరుస్తుంది. జనబాహుళ్యము కొనగలిగే ధరలలో శ్రేష్ఠమైన మందులను తయారుచేయు డ్యూమెక్స్ వారిదే డ్యూరోల్ అని జ్ఞాపకముంచుకోండి.



డ్యూమెక్స్ ప్రైవేట్ లిమిటెడ్
వేవెల్ హౌస్, బెల్లార్డ్ ఎస్టేట్,
బొంబాయి 1

సంవత్సర చందా
రు. 13—0—0
విడిప్రతిక 25 న.పై

Founder: K. NAGESWARA RAO

విలంబి మాఘం బహుళ ద్వితీయ బుధవారం


సంపుటము 58
సంచిక 22
25-2-59

విషయానుక్రమణిక

ముఖచిత్రం:

శారదా ఫిలిమ్స్‌వారి 'జయభేరి'లో

అంజలీదేవి



రాజధాని కబుర్లు

పరిషత్తు ప్రదర్శనలు - సమీక్ష

పోటీల నిర్వహణకు కొన్ని నియమాలుంటాయి. ఈ నియమాలకు ప్రాతిపదికగా కొన్ని సిద్ధాంతాలుంటాయి. భూతకాలంలోని కొన్ని పరిణామాలాధారంగా ఏర్పడిన ఈ సిద్ధాంతాలకు భవిష్యత్తు అర్థంకాదు. సక్రమంగా నిర్వహింపబడిన పరిస్థితుల్లో కూడా, పోటీలు అభివృద్ధి నిరోధకాలుగా ఉంటాయి.

ఆంధ్ర నాటక కళాపరిషత్తు కార్యక్రమాలను నిర్వహిస్తున్న పెద్దల సహృదయతని ప్రశ్నించడం కష్టం. కాని ఏటేటా పరిషత్తు నిర్వహిస్తున్న పోటీలను చూస్తూంటే, ఈ పోటీల సత్ఫలితాలేమిటో అర్థంకాదు. ప్రతి సంవత్సరం పోటీలు సక్రమంగానే జరుగుతున్నాయని అనడానికి వీలేదు.

ఫిబ్రవరి నాల్గవ తేదీ ఉదయం ప్రారంభమై, ఏడవ తేదీ రాత్రితో అంతమయ్యాయి పరిషత్తు ప్రత్యేక సమావేశాలు. ఎప్పటిలాగే ఈమారు కూడా 'నాట్యగోష్ఠి' కాని నాట్యగోష్ఠి ఒకటి ఏర్పాటుచేయబడింది కార్యక్రమంలో; ఆరు నాటకాలు ప్రదర్శించబడాయి. ఎనిమిది నాటికలు ప్రదర్శించబడాయి. నాల్గవ తేదీ పొద్దున్నే బయలుదేరి 'నీవా! నీవా!' అంటూ బ్రతిమాలుకొని పరిషత్తు కార్యకర్తలు కొనితెచ్చిన న్యాయమూర్తులు ఈ పోటీలలో బహుమానార్హములైన అంశాలివి అని నిర్ణయించారు. బహుమతి ప్రదాన నాటక ప్రదర్శనం ఏడవ తేదీ రాత్రి జరిగింది. ప్రదర్శనానంతరం కార్యకర్తలు పరిషత్తును నిద్రపుచ్చారు. తాము నిద్రపోయారు.

పరిషత్తు కార్యక్రమాలను తిలకించడానికి బొంబాయినుంచివచ్చాడు, గుజరాతీ విద్వాంసుడు శ్రీ అన్నా మెహతా. 'ఆ నాటకాలన్నీ సరేగాని ఇది ఒక ప్రదర్శనం' అన్నాడు పరిషత్తు బహుమతి బహుమతి ప్రదానోత్సవాన్ని తిలకిస్తూ. 'నవ్వన్నావు కాబట్టి సరిపోయింది: మావాళ్ళు అంగీకరించవచ్చు' అన్నాను.

ఈ సంవత్సరం పరిషత్తుపోటీలో న్యాయమూర్తులనిర్ణయాలు సమంజసంగా లేవని నేను సూచించడంలేదు. పరిషత్తులో ప్రదర్శించబడిన నాటికలు, నాటకాలు అన్నీ నేను చూడలేకపోయాను. చూడక వ్యాఖ్యానించడానికి నాకు అర్హత లేదు; కాని అనర్హులు కొందరికి బహుమానాలు లభ్యమైన విషయం సత్యం. దీనికిగాను న్యాయమూర్తులను నిందించడం అసమంజసం. పోటీలు నడిపే విధానమే లోపభూయిష్టమైనప్పుడు, నియమాలకు కట్టుబడి న్యాయమూర్తులు చేసిన నిర్ణయాలు విమర్శింపదగినవి కావు. కాని అర్హులు కొందరికి బహుమతులు లభించకుండా పోయినాయి. ఈ అన్యాయాన్ని సహించడం ఎలా? సహిస్తే, ఏమిటి మన భవిష్యత్తు?



కూచిపూడినాట్యం పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కుమారి కిళాంబి రాజకుమారి

* * *

నేరము—శిక్ష

ప్రఖ్యాత రష్యన్ రచయిత డోస్టవిస్కీ రచన: "క్రైమ్ అండ్ పనిష్మెంట్" దీన్ని ఆధారంగా చేసుకుని, శ్రీ శివం చేసిన తెలుగు అనుసరణ: "నేరము-శిక్ష" అనుసరణగా ఈ నాటకాన్ని పరిశీలించడానికి, మూలాన్ని చదవని నాకు అర్హత లేదు. ఎంతకాలం క్రిందటో వెలువడ్డ మూలానికి అనుసరణకి 1959 వ సంవత్సరంలో బహుమతి రావడం, 1959 లో వెలువడుతూన్న తెలుగు రచనలస్థాయిపై వ్యాఖ్యానం. ఈ నాటకం బహుమతికి అన్నివిధాల అర్హమైనదవడంలో సందేహం లేదు.

నాటకానికి వస్తువు సంఘర్షణ. వ్యక్తుల అభిప్రాయాల, మనస్తత్వాల సంఘర్షణ కావచ్చు. వ్యక్తిలోని విభిన్న దృక్పథాల సంఘర్షణ కావచ్చు. సమాజం అసమర్థులతో నిండివున్నప్పుడు, వ్యక్తుల మనస్సుల్లో సంఘర్షణలుండవు. సమాజంలోని మనుష్యులు ఆలోచనాపరులు, మేధావులు అయినప్పుడు ఆంతరంగిక సంఘర్షణకు ప్రాధాన్యము తప్పదు. మన నాటకాలలో ఆంతరంగిక సంఘర్షణ కనపడదు. మన సమాజంలో వ్యక్తులు అవివేకులు అనుకోడంకంటె, నాటకాలు మన సమాజాన్ని ప్రతిబింబించలేక పోతున్నాయనుకోడం మేలు. "నేరము-శిక్ష" రచనకు బహుమతినిచ్చినపరిషత్తు న్యాయనిర్ణేతలను అభినందిస్తున్నాను.

"నేరము-శిక్ష"లో సి. ఐ. డి. ఇన్‌స్పెక్టరు పాత్రకు బహుమతినిచ్చారు న్యాయనిర్ణేతలు. నటన అంటే అరవసం,



నాటికలలో ఉత్తమనటుడు:
సి. హెచ్. శ్రీరాములు



'పీలునామా'లో బి. ఆనంద
మోహన్: (ప్రత్యేక బహుమతి)



ఉత్తమ నాటిక రచయిత:
భమిడిపాటి రాధాకృష్ణ

★ రాజధాని కబుర్లు ★

కాలక్షేపం కాదు. ఎగిరి గంతులెయ్యటం కాదు. క్షణక్షణమూ "ఇది రంగస్థలం" అని గుర్తుంచుకొని, సంభాషణలు నాటక ధోరణిలో చెప్పడం కాదు. 'క్లైమాక్స్', 'క్రైసిస్' అనేవి రచనలో ఉండాలి. అవి నటనలో ప్రతిబింబించ బడాలి. రచనలో లేని నాటక లక్షణాలను అరుపులు, గోడల ద్వారా ప్రదర్శనలో చూపించడానికి నాటక సంస్థలు యత్నించే ఈ రోజుల్లో, 'నేరమూ—శిక్ష' సాక్షిగా జరిగిపోయిన ఒక చక్కటి ప్రదర్శనంగా కనిపించింది.

ఈ చక్కటి ప్రదర్శనానికి పాత్రల నర్థం చేసుకొని నటించిన నటీనటులను అభినందించాలి. ముఖ్యంగా 'విద్యార్థి' పాత్రధారి శ్రీమూర్తి. బోనులో ఉన్న సింహం కట్టుబాట్లు సహించలేక, ఎదుర్కొనే శక్తి లేక, ఓటమిని అంగీకరించలేక అటు ఇటు తిరుగాడినట్లు తిరిగాడు అతడు రంగస్థలం పైన. రంగస్థలం పైన ప్రతీ కదలికకీ అర్థం ఉండాలి. కాని 'విద్యార్థి' మనస్సులో తుఫానుని ఆ నటన కాక మరేది చక్కగా ప్రతిబింబిస్తుంది? ఇంకే విధంగా— మనుష్యులనుంచి పారిపోయి దేముడి నీడలో మొహం దాచుకున్నట్లు, అతనివద్దనుంచి పారిపోయి మొహం దాచుకున్న స్త్రీ పాత్రధారిణి. అతన్ని, అతని తపనను అర్థం చేసుకోలేక, అతన్ని విడువలేక బాధపడిన అతని తల్లి, అతని తల్లిగా శ్రీమతి నిర్మల నటనను ఏ విధంగా వర్ణించడం? ఏ విధంగా అభినందించడం?

నాటకంలో లోపాలు లేవని అనను. అనుసరణగా పరిశీలించడానికి మూలంతో పరిచయం లేని నాకు హక్కు కలదని భావించలేను. ప్రదర్శనలో చిన్న చిన్న లోపాలు లేవని అనను. కాని పాత్రధారులందరూ చక్కగా నటించారు; సహజంగా నటించారు. సి. ఐ. డి. ఇన్స్పెక్టర్ గా శ్రీ రామచంద్ర కాశ్యప ఆ బహుమతికి అన్ని విధాల అర్హుడు. కాని ఆ నాటకంలో దాదాపు ప్రతీ పాత్రకీ ఒక బహుమతి ఇవ్వచ్చు. ముఖ్యంగా రాజు (విద్యార్థి) పాత్రధారి శ్రీ మూర్తికి.



నాటికలలో ఉత్తమనటి:
కుమారి వి. లక్ష్మి



ఉత్తమ హాస్యనటుడు:
ఎ. పి. వెంకటేశ్వరరావు

నేను ప్రదర్శనలన్నీ చూడలేదు కనుక న్యాయమూర్తుల నిర్ణయాలలోని సామంజస్యాన్ని ప్రశ్నించను. కాని— నేను న్యాయమూర్తినైతే ఆ ప్రదర్శనకు ప్రత్యేక బహుమతి నిచ్చేవాడిని. దాదాపు ప్రతిపాత్రధారికీ బహుమతి నిచ్చేవాడిని. శ్రీ కాశ్యపతో బాటు శ్రీమూర్తిని ఉత్తమ నటుడుగా నిర్ణయించే వాణ్ణి. కల్పన పాత్రధారిణికి, శ్రీమతి నిర్మలకి ప్రత్యేక బహుమతుల నిచ్చేవాణ్ణి.

ఆ నాటకంలో ప్రతిబింబితమైన నటనా పద్ధతి అభినందనీయం. తెలుగు నాటకరంగానికి భవిష్యత్తు ఉంటే—ప్రదర్శకులు ఈ పద్ధతి ననుసరిస్తారు.

'నేరము—శిక్ష' నాటక పరిశీలను ముగించేముందు మరో రెండు విషయాలు వ్రాసి ముగిస్తాను. ఒకటి—కల్పన వేశ్యావృత్తి వల్ల జీవిస్తూందన్న విషయం సూచన ప్రాయంగా కథ నడిపించడానికి వదిలివేయడంలో సొగసు. రెండు—నాటకం తుదిని రాజు 'మహాజనులారా!' అని సంఘాన్ని పిలవడంలో లోపం. ఆ ఒక్కమాట రెండుగంటల ప్రదర్శన విలువను తగ్గించింది.

*   *   *   *   *

భమిడిపాటి రాధాకృష్ణ

ఉత్తమ నాటికకు బహుమానం శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ రచించిన 'దంత వేదాంతాలు'కు లభించింది. శ్రీ రాధాకృష్ణ కీ॥ శే॥ భమిడిపాటి కామేశ్వరరావుగారి కుమారుడు. ఆయన ఆస్తికి వారసుడౌనో కాదో తెలియదు కాని, ఆయన హాస్యరచనా శక్తికి వారసుడు అతని నాటికను ఉత్తమ నాటికగా న్యాయ నిర్ణేతలు నిర్ణయించడంలో ఔచిత్యం ఉంది.

ప్రదర్శించబడిన నాటికలన్నీ చూడలేకపోయిన కారణంచేత ఈ నాటిక ఉత్తమ నాటిక అని నేను చెప్పలేను. నేను చూసిన నాటికలలో ఇదే ఉత్తమమైనదనడంలో సందేహం లేదు.

'దంత వేదాంతం' హాస్య ప్రధాననాటిక. శీర్షిక రచయితకి పదాల కూర్పు మీదగల మమకారానికి సూచన. కీ॥ శే॥ కామేశ్వరరావుగారు ఒక్కొక్కప్పుడు శబ్దాడంబరం ద్వారా సృష్టించిన హాస్యం యొక్క పోకడలు శ్రీ రాధాకృష్ణ హాస్యంలో కూడా కనపడతాయి. కాని శ్రీ రాధాకృష్ణ సంభాషణలలో నవ్యత ఉంది అప్రధానమైన హాస్యం ఉంది. సంఘటనల సంఘర్షణవల్ల హాస్యం సృష్టించగల శక్తి శ్రీ రాధాకృష్ణలో కనపిస్తుంది. ఇంగ్లీషులో ఫార్సం 'ఫార్స్' అని అంటామే అది 'దంత వేదాంతం'లో కనుపించి, అద్భుతంగానే ఆనందం కనిపిస్తుంది.

శ్రీ రాధాకృష్ణదే నాటకం 'ఇదేమిటి?' పరిషత్తులో ప్రదర్శించబడింది. ఈ నాటకంలో ప్రధాన పాత్రధారి శ్రీ వెంకటేశ్వరరావుకి ఉత్తమ హాస్యనటుడి బహుమానం వచ్చింది. అతడు ఉత్తమ హాస్యనటుడే కాదు; ఉత్తమనటుడు. ఈ పరిషత్తు ప్రదర్శనల్లో హాస్యనటులెవరూ రాణించకపోయి ఇతనితో పోటీకి ఎవరూ రాలేదు. ఎవరు పోటీకి వచ్చినా, తట్టుకోగల సమర్థుడాతడు. 'దంత వేదాంతం' లోను 'ఇదేమిటి?' లోను నటీనటులందరూ చక్కగా నటించారు.

'ఇదేమిటి?' నాటకం ప్రేక్షకుల ఆదరణను సంపాదించుకుంది. సంభాషణలు చక్కగా ఉన్నాయి. కాని నాటకంగా ఇతివృత్తంలో 'యూనిటీ' లేదు. మొదటి దృశ్యాన్ని తొలగిస్తే, ప్రహసనం నాటకంగా నాటకం విషాదాంతమయ్యేది. నాటకరచనకు కారణం ఏమైనా, ప్రేక్షకుల సానుభూతి ఒక పాత్రపై వెలకొన్న తర్వాత మధ్యలో, మరో పాత్ర ప్రధానస్థానం ఆక్రమిస్తుంది. ఆ పాత్ర విజయంతో నాటకం అంతం చేస్తే బాగుండేది. కాని ప్రారంభాన్ని దృష్టిలో ఉంచుకొని రచయిత, ప్రధానపాత్రకీ ప్రేక్షకులకీ అన్యాయం చేశారు.

పరిషత్తు కార్యక్రమాలు నాలుగు దినాలు జరిగాయి. ఈ నాలుగు దినాల కార్యక్రమంలో పేర్కొనవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. కాని స్థలాభావంవల్ల అన్ని అంశాలను పేర్కొనడం అసాధ్యం ఐంది. ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

బాలల సంఘం

[సభ్యత్వపు దరఖాస్తు]

GROUP
A లేక B

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో) ....

పుట్టినతేదీ, నెల, సంవత్సరం : జులై 1 నాటికి వయస్సు ....

తండ్రి, లేక. సంరక్షకుని పూర్తి పేరు : ....

ఊరిపేరు, జిల్లా, తాలూకా, పోస్టు [వీధి: నెంబరు] ....

* చదువుతున్న తరగతి, లేక, ఫారము ; ....

పాఠశాల పేరు : ....

ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) ;

ఆర్యా :

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొనప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

[తేదీ : -1959]

(సంతకము)

* మరొ : ఏ పాఠశాలలోనూ గాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు. 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి.

సంచిక: 25-2-59 | ఈ దరఖాస్తు 23-2-59 నాటికి మాకు చేరాలి |

న్యూఢిల్లీ లేఖ

శ్రీకృష్ణ



ప్రభుత్వంపై లోక్ సభ స్పీకర్ విమర్శ

ప్రధానమంత్రి పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెసు కొత్త అధ్యక్షురాలు కూడా పత్రికా విలేఖరుల సమావేశంలో మాటాడారు. "చట్టము, ప్రజాస్వామ్యము" అనే విషయమై గోష్ఠి జరిగింది. భారతజాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు వార్షికోత్సవం జరుపుకున్నది. ఇవీ ఇటీవల జరిగిన విశేషాలు. ఈ సమయంలోనే పార్లమెంటు బడ్జెట్ సమావేశం ప్రారంభమైంది.

పత్రికా విలేఖరుల సమావేశంలో ప్రధానమంత్రి అందరికీ అన్ని సమాధానాలూ ఇచ్చి బాగా నిర్వహించుకొచ్చారు. తమ కుమార్తె కాంగ్రెసు అధ్యక్షురాలుగా ఎన్నిక కావటం, ఎమ్. వో. మత్తయ్ రాజీనామా, మౌలానా అజాద్ స్వీయచరిత్రలో భారత విభజన ప్రసక్తి మొదలైన విషయాలనుగూర్చి ఆయన మాట్లాడినదాంట్లో ఎంతో హుందాతనం కనిపించింది. కాని ఆనాటి సమావేశంలో రెండు విషయాలు మాత్రం చిరాకు పుట్టించాయి. ఒకటి—పత్రికలు ప్రధానమంత్రిని కాకపోయినా ఆయన విధానాలను కొన్నిటిని అదేపనిగా విమర్శించి వేస్తున్నాయి. ఢిల్లీ, హిందూస్థాన్ టైమ్సుపత్రిక నాగపూర్ తీర్మానాలదృష్ట్యా ప్రధాని పత్రికా విలేఖరులతో మాటాడిన అంశాలను విమర్శిస్తూ సంపాదకీయం రాసింది.

రెండు:-ప్రధానమంత్రితో గోష్ఠికి వచ్చే పత్రికా విలేఖరులలో ఈ మధ్య "కుర్రకారు" విలేఖరులు ఎక్కువైపోతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ విలేఖరులు, దేశవ్యాప్త ప్రచారంగల పత్రికల విలేఖరులు సాధారణంగా ప్రశ్నలే అడగటంలేదు. కొందరు పత్రికా విలేఖరులు అడిగే ప్రశ్నలు తమలోనే మరొకరి తరఫున అడుగుతున్నట్లుగా ఉంటున్నాయి.

పత్రికా విలేఖరుల సమావేశాలు అమెరికన్ సంప్రదాయం. అమెరికాలో సంప్రదాయంప్రకారం విలేఖరి వృత్తిలోని నాయకుడు ఆ సమావేశాలను అదుపులో పెట్టి క్రమబద్ధంచేసాడు. ఈ సమావేశాల ప్రయోజనాలను, మర్యాదలను భారత రాజధానిలోని విలేఖరులు అర్థంచేసుకుని పాటించటానికి ఇంకా కొంతకాలం పడుతుంది.

* * *

తీవ్రవాదుల స్వర్గం

కాంగ్రెసు కొత్త అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా గాంధీకూడా పత్రికా విలేఖరులతో గోష్ఠి జరిపారు. తన ఎన్నిక కాంగ్రెసులోని తీవ్రవాదుల విజయానికి సూచన అని వ్యాపించిన వదంతిని ఆమె కొట్టిపారేశారు. ఈ వదంతిపై వచ్చిన ప్రశ్నలు, సమాధానాలు ఇలా ఉన్నాయి:

ప్రశ్న:-తీవ్రవాదుల విషయంలో మీ వైఖరి ఏమిటి?

జవాబు:—ఏ పనీచేసి చూపకుండా ఊరికే కబురు చెప్పటం నాకు గిట్టదు. తీవ్రవాదులు మొదట నా దగ్గిరికి వచ్చి, వారి ప్రణాళికను చూపించినప్పుడు అది బాగానే ఉందనీ, దాన్ని ఆచరణలో పెట్టవలసిందనీ చెప్పాను. వారు ఏదో ఒకటి చేసి సాధించేదాకా నేను వారి వర్గంలో చేరనని కూడా చెప్పాను. దానికి వారొప్పుకుని, నా పేరు చేర్చబోమని వాగ్దానం చేశారు. అయితే నేను అస్సాంలో పర్యటనకు వెళ్ళిన సమయంలో నేను కూడా వారివర్గంలో చేరినట్లు పత్రికలలో పడింది.

తీవ్రవాదులువారం ప్రకటించిన ప్రణాళిక తీవ్రవాదులు కాక తదితరులు తీవ్రంగా పని చేసేందుకే ఉద్దేశింపబడింది.

* * *

"చట్టము, ప్రజాస్వామ్యము" అనే విషయమై జరిగిన గోష్ఠిలో స్పీకరు శ్రీ అనంతశయనం అయ్యంగార్ పాల్గొన్నారు. అసాధారణ పరిస్థితులలో ఉపయోగించవలసిన అధికారాలను ప్రభుత్వం సాధారణ పరిస్థితుల్లోనే ఉపయోగిస్తోందని ఆయన విమర్శించారు. పార్లమెంటు వ్యవహారాల శాఖమంత్రికూడా సూటిగా కాకపోయినా ఘాటుగానే విమర్శించారు. అధికారంలో ఉన్న పక్షం కేవలం సంఖ్యాబలం ఆసరా చూసుకుని శాసనాల మీద శాసనాలు చేస్తున్నదని ఆయన అన్నారు.

"దేశమంతటికీ వర్తించే శాసనాలు కొన్ని కొన్ని అప్పుడప్పుడు ఇద్దరు సభ్యుల ఆమోదంతోనే చెలామణీ కావటం జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇది చాలా విచిత్రమైన సంగతి," అని ఆయనఅన్నారు. కనీసం 50 మంది సభ్యులైనా హాజరై కోరమ్ ఏర్పడేందుకుగాను తాను అనేక సార్లు బెల్ మ్రోగించవలసి వచ్చిందని ఆయన వెల్లడించారు.

కోరమ్ లేకపోవటానికి బాధ్యత ప్రజాస్వామ్యానిది, పార్లమెంటరీ వ్యవస్థది కాదని స్పీకరు కూడాఒప్పుకుంటారు. దాని బాధ్యత ఒకే ఒక వ్యక్తిది. ఆ వ్యక్తి పార్లమెంటు వ్యవహారాల మంత్రి. ఈయన్ని ముఖ్య సచేతక్ అంటారు.

మే రచించిన "పార్లమెంటరీ ప్రాక్టీస్" గ్రంథంలో సచేతక్ విధులనుగూర్చి ఇలా ఉంది:

"పార్లమెంటరీ వ్యవహారాలు సమర్థంగా, సజావుగా జరగటం, జరక్కపోవటం సచేతక్ (హ్విప్) ని బట్టి ఉంటుంది. ప్రభుత్వపు ముఖ్య సచేతక్ సమావేశకాలవ్యవధిని నిర్ణయిస్తాడు. సభవారు నిర్వర్తించవలసిన కార్యక్రమాన్ని గూర్చి సభ్యులకు ఎప్పటికప్పుడు అతడు ఇతర సచేతక్‌ల సహాయంతో తెలియజేస్తూ ఉంటాడు. సభ్యులు తగినంతమంది హాజరయ్యేట్లు చూస్తూ ఉంటాడు."

కనక పార్లమెంటరీ పద్ధతిలో ఏమీ తప్పులేదు. సచేతక్‌లు తమ బాధ్యతలను గురించి శ్రద్ధతీసుకుంటే సభ్యులు ఎందుకు హాజరు కారు?

స్పీకరు తమ ప్రసంగంలో ఇంకోముక్క అన్నారు. అన్యాయమైన శాసనాల్ని ధిక్కరించటానికి ఎవరికైనా హక్కుందిట. దీనికి రెండభ్యంతరాలు: ఒకటి—ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నుకోబడిన పార్లమెంటు అన్యాయమైన శాసనాలు చేస్తుందని ఎలా అనుకోగలము? రెండు—ఫలానా శాసనం అన్యాయమని నిశ్చయించేది ఎవరు? వ్యాపారస్థులూ, పారిశ్రామికులూ తమపై పన్నులు విధించే శాసనాలన్నీ అన్యాయమైనవేనని భావిస్తారు. కనుక వారు ఆ శాసనాలను ఉల్లంఘించవచ్చునని మనం అనగలమా? అసలు ఈవిధంగా ఒక శాసనం అన్యాయమైందని తోచినప్పుడల్లా దాన్ని ధిక్కరించటం రైటేననే భావం ప్రజల్లో ఉండటం వలనే మనదేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం వాటిల్లుతోందని జస్టిస్ శాస్త్రి అన్నమాట అక్షరాలా నిజం. "చట్టబద్ధ పరిపాలనం చట్టాన్ని ప్రజలు గౌరవించినప్పుడే కదా సాధ్యమయ్యేది?" అని కూడా ఆయన అన్నారు. అన్యాయమని అనిపించిన శాసనాలను మార్చటానికి రాజ్యాంగ విహితమైన కొన్ని పద్ధతులు ప్రజాస్వామ్య విధానంలో నిర్దేశించబడి ఉన్నాయి. కాంగ్రెసు శాసనోల్లంఘన సిద్ధాంతంవలన దేశానికెంత అపకారం జరిగిందో పునఃపరిశీలనం చేయవలసినరోజు ఎప్పుడో వస్తుంది.

* * *

పత్రికలలో పడిన వార్తల ప్రకారం: "రష్యా, భారతదేశాలలో టూరిస్టు రాకపోకలను ప్రోత్సహించేందుకుగాను ఉభయ దేశాలూ ఒక ఒడంబడిక చేసుకోవాలని రష్యా భారతదేశానికి సూచన చేసింది. ఈ సూచనను అంగీకరిస్తే, సోవియట్ యూనియన్‌ను చూడబోయే యాత్రికులకు వందేసి కానుల చొప్పున ప్రయాణభృతిని భారత ప్రభుత్వం మంజూరు చేయవలసి ఉంటుందన్నమాట."

ఈ సూచనను అంగీకరిసే ముఖ్యంగా అమెరికా మొదలైన ఇతర దేశాలతో కూడా ఇలాంటి ఒడంబడికలు జరగవలసి ఉంటుందన్నమాట. అప్పుడు అమెరికా భారతదేశానికి వెళే అమెరికన్ యాత్రికులసంఖ్య, అమెరికా వచ్చే భారతీయుల సంఖ్య సమానంగా ఉండాలని షరతుకూడా విధించే అవకాశం ఉంటుంది. పైవార్త రష్యాకు మంచి ప్రచారంచేసి పెడుతుంది. కాని భారతదేశానికి సంబంధించినంతవరకూ ఇది అంత ప్రయోజనకారి కాదు.

* * *

భారతీయ గణాంకసంస్థ


కలకత్తానుంచి ఒకవార్త: భారతీయ గణాంకసంస్థ "దాదాపు రెండువేలమంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించింది. ఎటువంటిపని కావాలి ఎంతపని కావాలి అనేదాన్ని బట్టీ, సమర్థతను బట్టీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోటానికి ఏకగ్రీవంగా నిశ్చయించింది."

ఈ సంస్థకు ప్రొఫెసర్ మహలానోబిస్ డైరెక్టరు. ఈయన ప్లానింగ్ సంఘంలో సభ్యుడు. అంటే ఆ సంఘంలో ఆయనా కార్మిక మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా సహోద్యోగులన్నమాట. ఆయన ఆ మధ్య చైనాలో పర్యటించి వచ్చి తన అభిప్రాయాలను ఒక నివేదికరూపంలో సమర్పించారు. మూడవ పంచవర్ష ప్రణాళికకు మొత్తం పదివేలకోట్ల రూ.ల పెట్టుబడి కావాలని ఆయన అప్పుడే పాట మొదలుపెట్టారు. పరిశ్రమల యాజ

(55-వ పేజీ చూడండి)



సచిత్ర వారపత్రిక స్వర్ణోత్సవ సంచికలో బహుమతి రచన "ఆంధ్రమహావిష్ణువు" రచించిన కవి శ్రీ వజ్ఝల కాళిదాసును జంషెడ్పూర్ ఆంధ్రనాటక సాహిత్యసంఘం రిపబ్లిక్ దినోత్సవసమయాన సన్మానించిన సందర్భంలో శ్రీ కాళిదాసు, వారికి స్వర్ణాంగుళీయకం బహూకరిస్తున్న శ్రీ భాగవతుల విశ్వనాథం.



"రామలీల"లోని సీతాస్వయంవర దృశ్యాన్ని యీ చిత్రంలో చూడవచ్చును.

రాజస్థాన్ జానపదకళ

బొమ్మలాటల వంటి జానపద సాంప్రదాయిక కళలను పునరుద్ధరించి వ్యాప్తం చేయడంద్వారా ప్రజల జీవితానికి వినోదాన్ని, వికాసాన్ని, శోభనూ, శబలతనూ, సమకూర్చడానికి, సమాజ వికాస మంత్రిత్వ శాఖవారు యిటీవల అనేక చర్యలు తీసుకున్నారు.

పురాణ కథలు మొదలు చారిత్రిక సంఘటనల వరకు వివిధరకాల ఇతివృత్తాలతో బొమ్మలాటలను ప్రదర్శిస్తారు. దేశంలో సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల దృష్ట్యా, యీ ఇతివృత్తాలకు ఇప్పుడు మరి కొన్ని కొత్తవి తోడయ్యాయి.

భారత దేశంలో వంశపారం పర్యా బొమ్మలాట నే వృత్తిగా పెట్టుకొన్న కుటుంబాలనేకం ఉన్నాయి. రాజస్థాన్‌ది యీ రంగంలో అగ్రస్థానం. బొమ్మలాట వంటి జానపదకళలను అభివృద్ధి పరచడానికి రాజస్థాన్ చేసిన కృషి అమేయం. రాజస్థాన్ అభివృద్ధి శాఖవారు నియమించిన బొమ్మలాటగాళ్ళ బృందం ఒకటి రాజస్థాన్‌లోని గ్రామ సీమలలో 130 పైగా ప్రదర్శనలిచ్చింది.


"రామలీల"

★

★



ఆట ప్రారంభించే ముందు బొమ్మలకు పౌత్రికలు కట్టి వాటిని సజ్జితం చేస్తున్న దృశ్యం.



బొమ్మలాట

★

★

బొమ్మలాటగాళ్లు దారాలను చేతబట్టుకొని తెర వెనుక నుంచి బొమ్మల నాడిస్తున్నారు.

మాలతీ మాధవం

హాలంతా హర్షధ్వానాలతో మారుమ్రోగిపోయింది. విద్యార్థి బృందమంతా మాలతి గానాన్ని, నటనని వేయి విధాల కొనియాడారు. ఆహ్వానింపబడిన పెద్దలందరూ ఆమె అభినయాన్ని, కంఠ మాధుర్యాన్ని, మెచ్చుకుంటూ తమకు తోచిన బహుమానాలనిచ్చి, నవ్వు ముఖాలతో యిళ్ళకు వెళ్ళిపోతున్నారు. మాలతి తోటి స్నేహితుల అభినందనాలకి సమాధానాలనిచ్చుకుని తన వేషాన్ని మార్చుకోనబోయే స్థితిలో, ఆప్యాయత ఉట్టిపడే ఒక పిలుపు వినిపించటంతో ఆశ్చర్యంతో 'ఎవరా!' అని వెనుదిరిగింది. ఆశ్చర్యంతో గడబిడయి శరీరమంతా బిడియంతో నిండిపోయింది. నోటమాట రాక తలవంచుకు నిలుచుంది. అతను ఆమె దగ్గరగా వచ్చి,

"వీనుల కింపైన మీ మనోహర గానానికి, నటనాకౌశలానికి మా అసోసియేషన్ తరపున ప్రత్యేక అభివందనములు." తన చేతిలో పూలచెండును ఆమెకు అందించాడు. ఆమె ఆనంద పులకితయై కొంత సేపటివరకు సమాధాన మియ్యలేదు.

"మీ అసోసియేషనుకు నా కృతజ్ఞతలర్పించండి" ఆమె సమాధానమిచ్చింది. అతను వెళిపోయాడు. అప్పుడామె తల పైకెత్తి అతడు వెళూన్న మార్గాన్ని వీక్షించింది. పూలచెండును అతిపొందికగా, మృదువుగా అరచేతిలో ఇముడ్చుతూ, అద్దానికి ఎదురుగా కూర్చుని తనని పరీక్షించుకుంది. సిగ్గుపడింది. పూలచెండును హృదయానికి హత్తుకుంది. చెంపలకు రాచుకుంది. తన్మయత్వంతో శరీరాన్ని మైమరచిన ఆమె, వెనకాల ఎవరైనా వస్తారేమోనని కూడ గమనించలేదు. వెనువెంటనే ఆమె మనస్సుకు తటే వెనుదిరిగి సబ్బురాలైంది. రాధ నిలుచుని వుంది. ఆమె యిదంతా గమనించిందో లేదో తెలియదు ఆమె ముఖంలో విచారం పొడసూపుతోంది. ఎల్లప్పుడూ కిలకిల మంటూ ఎవరినో ఒకరిని వెంటవేసుకుని గోలచేస్తూ వచ్చే రాధ, ఈరోజు ఒంటరిగా, నిశ్శబ్దంగా, ముడుకున్న ముఖంతో, వెనకాల మౌనంగా నిలచోడానికి కారణమేమిటి? ఆమె చలాకీతనమంతా ఏమైంది? ఎవరు, ఎంత హృదయానికి దెబ్బతగిలేమాటన్నా, దానికి నూటిగా సమాధానమిచ్చి, విచారాన్ని దూరంగా నెట్టేమనిషి ఈరోజు ఈ విషయంలో ఇలా ప్రత్యక్షమయిందంటే... కారణమేమై ఉంటుంది?

"రాధా!...ఏమిటలావున్నావ్?" మాలతి రాధ దగ్గరగావెళ్ళి చేతులు పట్టుకుంది. రాధ కళ్ళలో నీళ్ళుతిరిగా యెందుకో? మాలతి కర్థంకాలేదు.

"మాలతీ! నీతో కొన్ని విషయాలు మాటాడాలి."

"నాతోనా..సరే! రా! యిలాకూర్చో!"

"ఇక్కడకాదు..." రాధ మాలతిని ఆపుతూ అంది.

రాధకారులో బయలుదేరి 'బీచ్'కి వెళ్ళారు. రాత్రి పదిదాటిందేమో బీచంతా నిర్మానుష్యంగా వుంది దూరంనుంచి సముద్రపు ఘోష హోరుమంటోంది. కూర్చున్న

పంతుల గోపాలం

పదినిముషాలవరకూ యిద్దరూ మౌనంగా వుండిపోయారు.

"మాధవాన్ని ఎరుగుదువుకదూ?" మాలతితో అంది రాధ.

"మాధవం...అంటే మన క్లాస్‌మేటే కదూ? ఇందాక పూలచెండు తెచ్చి ఇచ్చాడు..."

"మాధవమా?"

"అవును. ఏం?"

"అబ్బే!...ఏం లేదు...మాలతీ! మాధవమంటే నీకిష్టమేనా?"

"ఏం? నీకెందుకు? ఏదో విషయం చెప్తానన్నావు. మధ్యలో..."

"ఆ విషయమే మాలతీ!"

"అంటే..."

"మాధవం నా హృదయంలో స్థానం ఏర్పరచుకున్నాడు."

"నీకు మాధవం దగరబంధువనుకుంటాను."

"నాకు బావ అవుతాడు. త్వరలో నాకు కాబోయే..."

మాలతి నివ్వెరపోతూ రాధవేపుచూసింది.

"...అయితే నిన్నువదలసిం దేముంది?" అంది మాలతి. రాధ తల దించుకుంది. ఇసుకలో వ్రేళ్ళు దూర్చి ఆలోచించి తల పైకెత్తింది.

"మాలతీ! నువ్వు నా ప్రాణస్నేహితురాలవు. నీకు చెప్పకోక మరెవరికి చెప్పను? మాధవం మా వంశంలో, మాకు దగరవాడు చిన్నప్పటినుండీ ఒకేదగర పెరిగి పెద్దవారమయాము. మాధవమంటే మా యింటిలో వారందరికీ అమితమైన అభిమానం. ధనంలో వారికి మేమేమీ తీసిపోముకనుక మా ఉభయ బంధువర్గానికి మమ్మల్ని ఒక యింటివాళ్లను చేయాలనే అభిలాష వుంది. దానితో ఒక నిశ్చయానికి రావటానికి నిన్న వారిని ఇంటికి చూపుకై పిలిచాము. వస్తాడనుకోని మాధవం కూడా వచ్చాడు. నన్ను ప్రత్యేకంగాపిలచి,

'నీకు సుఖపడాలనుందా?' అనడిగాడు.

'అందుకే నిన్ను పెళ్ళిచేసుకుంటున్నా' అన్నాను.

'నీవు సుఖపడాలనుంటే ఈ పెళ్లి మానేయ్. నిన్ను నేను సుఖపెట్టలేను.'

"అంటే" నాకర్థంకాలేదు.

'రాధా! ఇన్నిమాటలెందుకు? నిన్ను నేను ప్రేమించలేను. నువ్వు వేరొకర్ని చేసుకోవటం మంచిది' అని వెళ్లిపోబోయాడు. దారికడ్డంగా వెళ్లాను.

"మాధవ్! చిన్నప్పటినుండి నీవంటే-తిరుగుతున్నాను. నువ్వేమాటన్నా సహిస్తూ, నిన్నేమాటన్నా సహించలేక పోతున్నా. ఎందుచేత? నీహృదయంకోసం...నిన్ను మనసారా ప్రేమించాను. నిన్ను విడిచి ఒక క్షణంకూడ చలువలేను. నీవు నన్ను ప్రేమింపకపోవడానికి నేను చేసిన అపరాధమేమిటి చెప్పు మాధవ్!...నన్నిప్పుడు వేరొకరిని వివాహం చేసుకోమంటె ఎలా చేసుకోగలను? చేసుకుని ఎలా సుఖపడగలను? నా జీవితమంతా యిలా కుమిలి కృశించవలసిందేనా? ఒక ఆడది సర్వనాశనమయితే నీకు సంతోషమేనా? ఒక ఆడది కళ్లవెంట రక్తధారలు కారుస్తే నీకు సరదాగా వుంటుందా? పిల్లపాపలతో కలకలలాడుతూ సంసారం చేయవలసిన ఒక నిర్భాగ్యస్త్రీ శ్మశానవాటికలో కట్టెలపై దగ్ధమవుతుంటే నీకు చిరునవ్వుగా వుంటుందా మాధవ్?...చెప్పు మాధవ్!' అంటూ మాధవం కాళ్లమీద పడిపోయాను మాలతీ! కొంతసేపటికి లేవనెత్తాడు. కళ్లు తుడిచాడు.

'రాధా! నీవు పిలపాపలతో కలకలలాడుతూ సంసారం చేయడమే నాకోరిక. నాజీవితంలో ఒకరిని నాశనం చేయాలనే తలంపు ఎన్నడూ లేదు. నిన్ను నేను సుఖ

పెట్టలేను. ఎందువల్లనంటే నేను... నిన్ను ప్రేమించలేదు కనుక..." అదే ఆఖరుమాట. కటికగుండె కరగలేదు.

నన్ను దాటి ఒక్క విసురున వెళ్ళిపోయాడు. అందుచేతే నేను నీ నాటకానికి రాలేకపోయాను. మాధవం ఎప్పుడయితే ఒప్పుకోలేదో నన్ను వేరొకరికిచ్చి వివాహం చేయడానికి యింట్లో సిద్ధంగా వున్నారు. నాకేం తోచక తక్షణం బయలుదేరి నీకీ విషయం చెప్పకుందామని వచ్చాను..."

మాలతి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. రాధ ముఖంలోకి చూసింది. వాడిపోయిన ముఖంతో, కన్నులనిండా నీరు క్రమ్మిన ఆమెను చూడగానే మాలతి, రాధను ఒక్కసారి హృదయానికి హత్తుకుంది "నీ ఉద్దేశ మేమిటి?" అని అడిగింది రాధ. మాలతి జవాబీయలేదు. జవాబు చెప్పలేకపోయింది. అక్కడ ఒక్క నిముషంకూడా కూర్చోలేకపోయింది. హఠాత్తుగా లేచి నిలబడింది. రాధ ఆశ్చర్యపోయింది. మాలతి నిలుచోక, "నేనేమీ చెప్పలేను రాధా! మళ్ళీ కలుస్తా... వస్తాను." అంటూ వెళ్ళిపోతోంది. "మాలతీ! కారుమీద వెళ్ళిపోదాం"

"మా యిల్లు దగ్గరలోనే వుంది. వెళ్ళిపోగలను." దూరంనుంచే అంటూ నడచి రోడ్డుమీదకు వెళ్ళి జనంలో కలిసిపోయింది. రాధకి అర్థంకాక కారుమీద ఒంటరిగా వెళ్ళిపోయింది.

అంగలు గబగబా వేస్తూ నడుస్తోన్న మాలతి తలలో ఆలోచనా పరంపరలు విపరీతమయాయి. అంతలోనే ఎవరిదో పిలుపు వినిపించింది. ఆగి నలుప్రక్కలా చూసింది. ఎవరూ కనపడలా. దూరంగా కారులోంచి చేయూపుతున్నారెవరో! దగ్గరగా వెళ్ళింది. మసక చీకటిలో మాధవం కనిపించాడు.

"ఇలా వస్తున్నారేం? ఇంటికేనా వెళ్తొంటి? రండి... కూర్చోండి." మాటల దొంతరలలో అతని గొంతుక తడబడింది.

"... నేను వెళ్ళిపోగలను" ఆమె ఎలా వుందో కాని మాటలు ధీరంగా వున్నాయి. మాధవం తలుపుతీసి వెలుపలికి వచ్చాడు. కొద్ది నిముషాలకి ఆమె వెళ్ళిపోబోయింది.

"చూడండి!.... మీతో కొన్ని... మాటలు చెప్దామని..."

"నాతోనా!..." గొంతుక ఆశ్చర్యపోయినట్టుంది.

"అవును. ఏం?"

"అయితే... చెప్పండిప్పుడే!"

"ఇక్కడ చెప్పడానికి తగిన వాతావరణం లేదు."

'ఏమి టన్నట్టు' మౌనంగా అతని ముఖంలోకి చూసింది.

"కొంత ప్రశాంతత అవసరం. అందు



ఇంటిలోపల

చిత్రకారుడు: ఎస్. వి. రామారావు—మద్రాసు.

లలితకళా అకాడమీ ఢిల్లీలో జరిపిన అఖిలభారత చిత్రకళా ప్రదర్శనంలో "మోడరన్ పెయింటింగ్స్" విభాగములో సెలెక్టయి ప్రదర్శింపబడుతున్న చిత్రము.

చేత కారులో కొంతదూరం..." మాలతి ఆలోచించి అంగీకారం సూచించడంతో మాధవం ముఖం వికసించింది. అనుకోకుండా ఆమె కారెక్కగానే మాధవం హుషారుగా కూర్చుని 'డ్రైవ్' చేస్తూ, రాధ మాలతి ఎక్కడ కూర్చున్నారో అదే స్థలంలో కారు ఆపాడు. ఇద్దరూ కారులోంచి దిగారు. మాధవం గుండెలు వేగిరాలైనాయి. ఇంతరాత్రిలో యిలా ఏకాంతంగా యిద్దరూ కూర్చుని మాటాడుకోవడం ఏ స్నేహితుడైనా చూస్తే ఏమనుకుంటాడు? అందులో ఆ సమయం... నాటకం జరిగినరాత్రి... తెలవారిలోపున కాలేజీ గోడలమీద యిద్దరిపేరులూ అటికాయలంత అక్షరాలతో లిఖించబడితే ఏం చెయ్యగలరు? కారులోంచి ఏదో విషయం చెప్తామని తీసుకొచ్చాడు. ఏం చెబుతాడు?... ఎలా చెప్పాలి? ఎందుకీ బుద్ధి పుట్టింది? ఈ సమయానికే ఈ బుద్ధి పుట్టిందెందుచేత? ఆడదాన్ని ఒంటరిగా పిలిచి ఆమెను ప్రేమించానని చెప్పదలిస్తే ఆమె ఏమనుకుంటుంది? మాధవానికి ముచ్చెమటలు పోస్తున్నాయి. తనేదో దొంగతనం చేస్తున్నవాడిలా అయిపోయాడు. ఇద్దరూ దూరదూరంగా కూర్చున్నారు. మాధవం పెదవులు వణుకుతున్నాయి. ఎలా ప్రారంభించాలో తెలియక తికమక పడుతున్నాడు. ఆమె రాబోయేమాటలకి ఎదురుచూస్తోంది కాబోలు వినడానికి సిద్ధంగా కూర్చుంది.

"మాలతీ!..." మొదలుపెట్టాడు. మనస్సులోనే అనుకుంది: "చెప్పండి."

"ఆగ్రహించుకోగూడదా!"

"అటువంటి విషయాలా?"

"ఏమో, నాకేం తెలుసు? అయినా, చెపుతా... నాకీమధ్య పెళ్ళి సంబంధాలొస్తున్నాయి..." అంటూ ఆమె వేపు చూశాడు.

"మంచిదే," అంది ముకసరిగా తలదించుకుంటూ.

★ మాలతీమాధవం ★

"కాని నా ఇష్టం లేదు."

"అయితే ఆ పెళ్ళి మానెయ్యండి."

"వస్తానపిల ఒకామె వుంది."

"ఆమెనే చేసుకోండి."

"ఆమె ఒప్పుకోనంటే..."

"ఆమె అలా అందా?"

"మాలతీ!" కళ్ళలోకి చూస్తూ చేతులు చాచాడు.

"ఆగండి!" గట్టిగా అంది. మాధవం నిశ్చేష్టుడయాడు.

"మీరనేదేమిటి?" మళ్ళీ అంది.

"...నిన్నుల్ని...ప్రేమిం...చా..." ఆమాటనడమే తిడవుగా ఆమె రెగ్గున లేచింది.

"మీరు చెప్పవలసింది ఇంతేనా...ఇంకేమైనా వుందా?" ఆమె ముఖం వేరొక ప్రక్క వుంది. ఆగ్రహంతో గొంతుక జీరపోయింది.

"అంటే...మీరు...నన్ను..."

"ప్రేమించలేదంటే ఆశ్చర్యంగా వుందా?" ఆ మాట అతని హృదయంలో శూలంలా పొడుచుకుంది. ముఖం మసిబొగ్గయింది.

"మీ సూటును, బూటును, అందాన్ని, సకలైశ్వర్యములతో తులతూగుతున్న మిమ్మల్ని, మీ కారునుచూసి ప్రేమించలేదెందుకనో అని సందేహపడుతున్నారా?"

ఏమిటిదీ? మాట్లాడుతున్నది మాలతేనా? ఆమె నిజంగా నన్ను ప్రేమించలేదా? ఆమె ఈ మధ్య సంచరింపులో, నోట్సు అడగటంలో ఆమె చూపించిన అనురాగమంతా నటనేనా? లేక నేను ప్రేమని భ్రమపడుతున్నానా? ఆమె నన్ను తృణీకరించడానికి కారణమేమిటి? నేను ధనధాన్యాదులతో తులతూగుతూ, గర్వపడుతున్నానని అపోహపడుతోందా? అనుకుని

"క్షమించండి! మీరిలా అంటారని కలలోకూడా అనుకోలేదు." అవమానంతో కృంగిపోతూ అన్నాడు మాధవం.

"ఏమయించి ఇలాంటి పిచ్చిమాటలు ఇంకెప్పుడూ ఎవరితోనూ అనవద్దని మనవి..." ఆ నిముషంలో ఆమె రూపమెలావుందో అతను గుర్తించలేకపోయాడు. మాలతి తలదించుకుని విసురుగా ప్రక్కనుంచి నడుచుకు వెళ్ళిపోయింది. మాధవం నిశ్చేష్టుడయాడు. మాలతి ప్రవర్తన అతన్ని పిచ్చివాణ్ణి చేసినట్లయింది. మాలతి మంచిపనే చేశానని సమర్థించుకుంది. తన మాటల్లో తప్పులు లేవని నిర్ధారణ చేసుకుంటూ అడుగులు గబగబా వేస్తూ యింటికి చేరుకుంది.

* * *


మాలతి ఉన్నపాటునే ఎవరితోనో లేచిపోయింది. ఈ విషయాన్ని ఊరమంతా కోడైకూసింది. ఈనాడు స్త్రీలు తమ గౌరవాన్ని ఎలా నిలబెట్టుకుంటున్నారో మగవాళ్ళందరూ చాటి చెప్పుకున్నారు. ఇప్పటి చదువుకున్న ఆడవాళ్ళందరూ ఇంతేనని అన్నులక్కలందరూ మాటలు విసురుకున్నారు. మాధవం నిలువునా కూలిపోయాడు. ఆ తుచ్ఛురాల్ని మనస్సులోంచి వేరు చేసుకోవాలనుకుని మనస్సు మార్చుకున్నాడు. కొద్దిరోజులకి రాధా, మాధవులకు వైభవోపేతంగా అప్పట్లో వివాహం జరిగింది. వారి వివాహాన్ని వేయినోళ్ళ కొనియాడుతూ పూరూరా చెప్పుకున్నారు.

రాధా, మాధవులిద్దరూ ఒక రోజు తీరికగా కూర్చొని ఉత్తరాలు పరిశీలించుకుంటున్నారు. మాధవం తనకొక ఉత్తరాన్ని విప్పి చదువుకుని, చకితుడయాడు!

"మాధవం!

నిన్ను ప్రేమించలేకపోయినందుకు నన్ను మనసారా క్షమిస్తావని నమ్ముతున్నాను. రాధ కన్నీరుచూసిగానే నిన్ను నేను ప్రేమించలేకపోయాను. ఆమె నిన్ను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించింది. మీ బంధువర్గంలో ఆమె ఒకతె. చిన్నప్పటినుండి నీకోసమే ఆమె జీవిస్తోంది. ఆమె జీవితంలో నిన్ను దులుకుంటే మరణం తప్ప వేరొక మార్గమామెకు లేదని నాకు తెలుసు. అటువంటి ఆమెను తృణీకరించి జాతిలో, ధనంలో, అన్నిటిలో హీనంగావున్న ఒక బీదస్త్రీని పెళ్ళిచేసుకుని నీ జీవితంలో నువ్వేం సుఖపడగలవు? లోకం నిన్ను చూసి నవ్వదూ? హేళన చెయ్యదూ? నువ్వు నలుగురిలో నగుబాటు చెందుతావా? నాకోసం ఒక నాగరిక యువతి సర్వనాశనం కావటం నాకిష్టంలేదు. అన్నయ్యా! నేనిప్పుడు అమ్మతో బాబయ్యగారింట్లో వుంటూ చదువుకుంటున్నాను. వదినకు నా నమస్కారములు.

మాలతి." ★



నా భోజనహోటలు

ప్రపంచములో ప్రతివస్తువునూ చేసే అవలో కనను బట్టే దాని మంచి - చెడులు కనబడుతూ వుంటాయని పెద్దల అభిప్రాయం అంటే చెడువారికి చెడగానూ, మంచివారికి మంచిగానూ కనపడునని కూడా మరొక సదభిప్రాయం. ధర్మరాజుకు ప్రజలంతా మంచివారుగానే కన్పడారట. ఇక దుర్యోధనుడికి సరేసరి. అంతా ధూర్తులులాగానే కనిపించారట. భోజనహోటలూ అనటంతోనే ప్రతివారూ దాని అపరిశుభ్రతనూ, అసహ్యమైన వంటలనూ, వారి దురాచరణలనూ ఆలోచిస్తూ, అయ్యో! పాపం హోటలు భోజనమా! అంటారు. అంతేగానీ దానిలో మంచి ఎంతవరకూ ఉన్నదో ఆలోచించరు.

వారాలోచించకపోతే ఎవరైనా చెప్పేదయినా వినాలిగా! నేను ఆలోచించి చెప్తున్నాను వినండి. నా భోజనహోటల్లో దాదాపు చాలామంది భోజనం చేస్తున్నారు. అంతా విసుక్కొంటూ తింటే అదేమయినా వంటపడ్తుందా! ఒకాయన అమాంతం విసరి సర్వర్ మొఖాన విసరికొట్టాడు. ఎందుకయ్యా అంటే, భోజనంలో ఒక పెద్ద వెంట్రుక కన్పించిందట. అది చిన్నదైనా ఫర్వాలేదట! దొంగతనమంటే పెద్దదయినా చిన్నదయినా ఒకటే! వెంట్రుకలు పెరగడం కొరకు మందులు రాచుకొని, మంగలి ఎక్కడ వెంట్రుకలు మొలిపించటానికి కత్తిరిస్తాడోనని తహతహలాడుతూ—మిషన్తో వద్దు, కత్తెరతో క్షౌరము చెయ్యమని ప్రజలొకప్రక్క మొర పెడుతుంటే, వెంట్రుకల విలువలు ఆయనకేమి తెలుస్తుంది? 'ఏనుగ చచ్చినా బ్రతికినా వెయ్యి రూపాయ' లన్నట్టు, వెంట్రుక వున్నా, వూడినా చాలా విలువకలది. వెంట్రుకలు ఎలాంటి ఎరువను కున్నారు? సరే యిక వెంట్రుకలను గురించి చెప్పుకొంటూపోతే చాలావుంది.

వెంట్రుక మాత్రానికే ఇంత రభసా? హోటలు వారెన్ని మంచిపనులు చేస్తున్నారో చూడండి.

భోజనం చాలా ఆలశ్యంగా వడ్డిస్తారని ఒకాయన అంటాడు. పూర్వము చిన్న చిన్న కొసులనుండీ మనము చదువుతూ వచ్చాము. భోజనమును బాగా నమిలి మ్రింగవలయును. భోజనము లాలాజలముతో బాగుగా కలిసినగానీ జీర్ణకోశములో త్వరగా జీర్ణముకాదని. బాగా పరిగెత్తి అలసిన వ్యక్తి-రెండు మూడు చెంబులనీళ్ళు ఒకేసారి త్రాగితే ఏమవుతుంది? అదేగతి పడ్తుంది. ఆకలెక్కువయి కంగారుకంగారుగా ముద్దలమీద ముద్దలు

అమ్మాలక్ష్మీనారాయణ

మ్రింగేవాడిగతికూడా. అంతే మనకు చాలాచాలా క్రొత్తవిషయాలు గుర్తుకొస్తాయి భోజనం చేసేటప్పుడు. ఈ అన్ని కారణాలవల్లా భోజనం చాలా నెమ్మదిగా, తీరికగా, జాగ్రతగా వడిస్తారు. అంతేగానీ త్వరగా వడ్డించలేక ఏమీకాదు తెలుసా!

మరొకాయన అన్నంమీద సున్నపు తేట చల్లారని ఫిర్యాదుచేసాడు. ఇంకా ఏదేదో అంటారు. ఎన్నని సహించేది. నిజంగా మంచికి చెప్పినా వినకపోతే ఎలాగ చెప్పండి. ఆ ఫిర్యాదుచేసిన పెద్దమనిషి ఎవరంటారా! రోజుకు దాదాపు అయిదు తినే కిళ్లీల మొత్తంలో సున్నం కలిపితే ఏ సెరుంటుంది. ఇంత సున్నం తినగాలేనిది, కొంచెం తేట చల్లిన అన్నం తింటే ఏం? సున్నంలో 'కాల్షియం' ఉంటుంది. అదే మన ఎముకలను బలపర్చటానికి అవుసరమయ్యేది. అసలు దానివల్లే మన భోమికలన్నీ తయారు చేయబడ్డాయి. వాటికి బలము చేకూర్చటానికీ, మనకు పైగా డబ్బు ఖర్చుపెట్టి సున్నంకొని మనకందజేస్తున్నారు. కిళ్లీలు అలవాటులేని వారికి చాలా లాభదాయకమైన పద్ధతి యిది.

భోజనమంతా మట్టిగడ్డల మయమని మరో మహానుభావుడు పేరు పెడాడు. దాని విషయం కూడా వివరిస్తాను వినండి. మీరు చాలామంది స్త్రీలను చూస్తూనే వుంటారు. ఎవరూలోనికి బియ్యమేరుతూ, అమాంతం మట్టిగడలను, నోటో వేసుకొని చప్పరించటం. మీరు చూడకపోతే చూడండి. అమట్టిగడలు వారికి చాలా యిష్టమట. అందుకే కొంత మంది వాటికి అలవాటు పడి అవి దొరక్క



శ్రీ నారాయణ నాట్యమండలి (కలకత్తా) వారు యిటీవల ప్రదర్శించిన 'కమల' సాంఘికనాటకంలో శ్రీవాజపేయులశంకరం, పి. ఎస్. రామారావ్, శ్రీమతి సరోజిని, మెట్టా సత్యనారాయణ మున్నగువారు.

★ నా భోజన హోటలు ★

బాధపడూ వుంటే వారిని ఆబాధానిముక్తుల్ని చెయ్యటంకొరకు ఈ మటిగడ్డలను భోజనంలో అందించటం.

అయ్యో! ఇంతవరకూ బాగానే వున్నది గానీ మరి వడ్లగింజల విషయం చెప్పరేమి టంటారు. త్వరపడకండి వినండి చెప్తాను. దీనికంతా విజ్ఞానశాస్త్రం ఒకటే వున్నది. ఇప్పుడు ప్రభుత్వం వారు అందర్నీ దంపుడు బియ్యం తినమని సలహా యిస్తున్నారెందుకో తెలుసా? దంపుడుబియ్యపు గింజలపై ఒక సన్నని తవుడు అనే పొరవుంటుంది. దీనిలో విటమిన్ 'బి' అనే ఆరోగ్యానికి అవసరమయిన పదార్థం ఉన్నది. ఆపార మరబియ్యములో నుండదు. అందుచేత మరబియ్యముతోపాటు వడ్లగింజలుకూడా కొన్ని కలుపుటవలన మనకు దంపుడుబియ్యపు భోజనము చేసినట్లే అవుతుంది. ఎందుకంటే అందర్కీ సరిపోను దంపుడుబియ్యం ఆరోగ్యశాఖవారైనా సర



అనారోగ్యకారణంగా తాత్కాలికంగా పదవినుండి తొలగిన విదేశాంగ మంత్రి జాన్‌ఫాస్టర్ డలెస్.

ఫరా చేయలేరురా? తలలూపుతున్నారు. నచ్చటం లేదూ!

మరి పుల్లటి పెరుగంటారా! బజారులో సారా పులవలేదని పెరుగు పెట్టే వారెంతమంది? దానిలో ఎంతరుచి వున్నదో ఆ రుచిని రాబట్టటం కొరకే పెరుగును బాగా పులవబెటటం ఈ మద్య నిషేధం రోజుల్లో ఆ పుల్లటి పెరుగునే సారాగా అనుభూతి పొందుతూ ముచ్చటపడే వారెంతమందీ? వారికొరకే ఈ కష్టమంతా!

ఇంకొకరు విమర్శిస్తారు: ప్రొద్దుటి పప్పు, మధ్యాహ్నం పప్పుచారు ఆ మిగిలిన పప్పుచారు మరునాడు ఇడ్లీలోనికి సాంబారు! అన్నీ చలివి అంటూ సాధింపులు. పంచవర్ష ప్రణాళికల సారాంశం, ధ్యేయం ఏమిటో ఎవరికైనా తెలుసా, పొదుపు. ప్రతివారూ యిలా మిగిలినవప్పంతా పారవేస్తే, యిలాగే గ్రామాలూ, తాలూకాలూ, జిల్లాలూ, రాష్ట్రాలూ యింకా అనేకచోట బజార్లంతా పప్పే. ఇక కొంతకాలానికి పప్పుకు కరువువచ్చి విదేశీ మారకం దెబ్బతిని యింకా యింకా ఎన్నో జరుగుతవి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొనే యిలా తయారుచెయ్యటం.

ముక్కు పురుగులని ముక్కోడు మరొకాయన. చీమలని చీదరించుకొన్నాడు మరొకాయన. మనమంతా మానవ మాత్రులమే. అంత చిన్న చిన్న జీవులను ఏరటం ఎంత కష్టం? ఆ లెక్క కొస్తే పురుగులను తినే

పాపం! కృష్ణమూర్తి!

'హృషీకేశం'

ఏ నెలకా నెల...తన కొచ్చే జీతపు రాళ్లలో కొద్దో గొప్పో మిగులుద్దా మనుకుంటూన్న కృష్ణమూర్తి, ఆ నెల ఫస్టు తారీఖు జీతం పుచ్చుకోగానే ... ఏమైనాసరే, ఆ నెల తప్పకుండా ఒక్క అయిదు రూపాయలన్నా మిగిల్చి తీరాల్సిందే అనుకున్నాడు ...!...సమిష్టిగా వుంటూన్న అతని కుటుంబంలో ... అన్నగారి తాలూకు చిన్న కుటుంబం ... అతను, తల్లి, తమ్ముడు ... నూతనంగా వచ్చిన అతని అర్ధాంగి ... మెంబరు!...అర్ధాంగి ఇంకా కాపురానికి రానేలేదు! ... ఇహ తన కొక్కడికీ ఓ యాభైరూపాయలు ఇంట్లో యిచ్చి...తన వంతుకు వచ్చే పాతిక రూపాయల్లో ... ఓ అయిదు రూపాయలు మిగల్చుకో లేకపోతే...అందులో యిప్పుడే మిగల్చుకో లేకపోతే....ఇహ ముందు ముందు... వేరింట కాపురం పెట్టి.. సంతానం పెరిగితే...మిగుల్చుకునేది మాత్రం ఏ ముంది?...అని అతనిబాధ!... కాని ఆ మిగుల్చుకోడమే అతనికి చేతగాకుండావుంది. అతను...సినిమాలు...కాఫీ హోటళ్ళు మానుకుని...ఎంత పొదుపుగా ఖర్చు చేద్దామనుకున్నా...అతనికి తెలియకుండానే అనుకోని ఖర్చులో...పాతిక రూపాయలు హరించుకొని పోతున్నై!... అందుకే ఆ నెల మరీ అంత గట్టిగా అనుకున్నాడు కృష్ణమూర్తి...!......

...ఆ విధంగా నిశ్చయించుకున్న కృష్ణమూర్తి...ఆఫీసునుండి రెండు మైళ్ళు రోడ్డంబడి నడచివచ్చి...చొక్కా దీసి వంకెనకు తగిలించ బోయాడు. పొద్దున పది గంటలనుంచి చెమటకు తడిసి ముద్దైన ఆ చొక్కా అతని శరీరాన్నొదిలి రాదల్చుకోలేదు! తత్కారణంగా...అతడు బలవంతంగా తీసిన ఫలితంగా...వీపున రెండంగుళాలమేర పర్రుమనిచిరిగిపోయింది!...

...ఇది అతని నిశ్చయానికి ఆదిలోనే ఎదురైన మొదటిదెబ్బ!...అతనికున్నది నాలుగు చొక్కాలవుతే...రెండు యింట్లో ... రెండు చాకలింటో! ప్రస్తుతం అతని ఒంటిమీదున్నది రెండోచొక్కా! "ఇకేం తొడుక్కుంటావ్...కృష్ణమూర్తీ?..." అని ఆ చిరిగినచొక్కా అతనిని ప్రశ్నిస్తున్నట్లుగా తోచింది అతనికి. కాని తిరిగి ఆ విడిచినచొక్కానే వేసుకుందామా అనుకున్నాడు!...దాని దుర్గంధం భరించేదలా? ...పోనీ చినిగింది కుట్టించి వేసుకుందామా అంటే అది అతనికి చేతగానిపని!...

...అందుకనే వెంటనే బట్టలషాపుకెళ్ళి గుడ్డకొని ఐదురూపాయ లొదలించుకొని ఇల్లు చేరాడు!...

...ఆ మర్నాడు దర్జాగా కొత్తచొక్కా వేసుకొని మేలరకం పంచకట్టి ఆఫీసుకు వెళ్ళిన కృష్ణమూర్తిని చూచి తోటి గుమాస్తాలంతా 'ఏంకృష్ణా! ... ఏంగిరాకీ? ... అంతా మీకేనా...మాకుగూడా వుందా?" అంటూ నోరు చప్పరించారు. అంతటితో వూరుకున్నా బాగుండేది. కాని వారలా చేయలేదు. చేయదల్చుకో లేదుకూడాను. మధ్యాహ్నం లంచ్ టైంలో "నాచొక్కా చినిగిపోతే కుట్టిచ్చుకున్నానరా! అని గోల పెడుతున్నా వినిపించుకోకుండా బలవంతాన హోటల్కు లాక్కెళ్ళి రెండురూపాయ లొదిల్చి మెల్లగా ఒక్కొక్కరే బయట కొచ్చేశారు...!

పదిహేనో తారీఖు లెక్క చూచుకున్న కృష్ణమూర్తికి తను పొదుపు చేయటంలో ఫరవాలేదు అన్న ధైర్యం కల్గింది! అవును మరి...పదిహేన్రోజులకు అయినఖర్చు పది రూపాయలేగా!...

...పదహారవతారీఖు...పన్నెండు గంటలకు ఆఫీసులో కృష్ణమూర్తిదగ్గరకు...ఎవరో ఒకాయన రశీదుపుస్తకాలు, ప్రాసిక్యూషన్ నోటీసులుపట్టుకొని దక్కా వచ్చాడు!... ఎవరా అని ఆరాతీయగా కృష్ణమూర్తికి తెలిసినవిషయం అతగాడు వృత్తిపన్ను సంబంధీకుడని!...రెండేళ్లనుంచి బకాయిపడకను "అంతదెబ్బ ఒక్కసారిగా యివ్వలేను" అని నసిగినా ప్రాసిక్యూషన్ నోటీసు చూచిన తరువాత నాలుగు రూపాయలు చెల్లించి రశీదులు అందుకున్నాడు కృష్ణమూర్తి! ...తప్పదు మరి!...

నెలలో యింకా పదునాలుగు రోజులు గడవాలి!... ఓ ఆరు వాటికి కేటాయించి మిగిలిన అయిదు పెట్టెఅడుగున భద్రంగా దాచివుంచాడు!...

కాని విచిత్రమేమిటంటే ముప్పయ్యో తారీఖు వచ్చినా అది అలాగే వుండగలిగె!.. కాని ఆనాటి మధ్యాహ్నం తన అత్తయూర్నించి వచ్చిన ఉత్తరం చూచేసరికి కృష్ణమూర్తి కూర్చున్న కుర్చీలోనే వెనక్కు చేరగిలపడిపోయాడు!...ఏవో నోములు తీయస్తున్నాయట...అర్జంటుగా రమ్మని కబురు!...పోకపోతే అర్ధాంగి మనసు నొప్పించినట్లవుతుందేమో!—మరి పోతే పదిరూపాయలేమో ఖర్చుకింద కావాల్సిందే!...అందుకే గుమాస్తాలకు జీవితంలో.. నిశ్చయాలు, ఆశలు...ఆదర్శాలు వుండకూడదంటూంటారు అనుకున్నాడు కృష్ణమూర్తి!... ఆనాటిసాయంత్రం...రెండు రోజులు శెలవు పెట్టి...ఆ శెలవుతో బాటు...తోటి గుమాస్తాదగ్గర ఓ అయిదు చేబదులు పుచ్చుకొని... మొత్తం పదిరూపాయల్లో అత్తారూరెళ్ళాడు...పాపం...కృష్ణమూర్తి!... ★

వారెంతమంది లేరు? చీమలనుతింటే కళ్లు పెద్దవుతాయనీ, చలువనీ, చెప్పేవారెంతమంది? ఇలాగే యింకా ఎన్నో, ఎన్నో!

ఇదంతా చదివి నేనేదో హోటలు ప్రొప్రయిటర్ను అని మాత్రం తప్పుదోవను పడవద్దు. నేను వారి శ్రేయోభిలాషిని మాత్రమే. ఎందుకంటే వారు మనకు తిండి పెడుతున్నారు. అన్నపూర్ణ లాంటివారె 'నా భోజన హోటలు'ని ఎందుకన్నానంటే ఆ భోజన హోటల్లో నేను భోజనం చేస్తున్నాను గనుక. ★

ఖరగ్‌పూర్‌లో "ప్రవాసాంధ్ర నాటకకళాపరిషత్"

[ఒక విలేఖరి]

"ఎన్నో సంవత్సరాలుగా ఎందరో మహానుభావులు యీ ప్రవాసాంధ్రలో ఒక నాటక కళాపరిషత్తు స్థాపించాలని ఎన్నోవిధాల ప్రయత్నాలుచేసి విఫలులైయారు. కాని ఈనాడు కేవలం ఉత్సాహం, సాహసం ఆధారంగా "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్" వారు ఇంతటి మహత్కార్యానికి అంకురార్పణ చేసినందుకు వారిని యావత్ రాష్ట్రేతరాంధ్రులూ అభినందించకుండా వుండలేరు," అని ప్రఖ్యాత (రాష్ట్రేతరాంధ్ర) నటులు శ్రీ ఆర్. వి. చలంగారు (జంషెడ్‌పూర్) "ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్" నాటకోత్సవాలను జనవరి 25-వ ప్రారంభోత్సవం చేస్తూ అన్నారు.


వారు ఇంకా ఇలా అన్నారు:

"1946 లో కీ॥ శే॥ బి.యస్. నారాయణ గారి అధ్యక్షతను ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికీ, వారి ప్రగతికీ "రాష్ట్రేతరాంధ్ర మహాసభ" అనే ఒక సంస్థ స్థాపింపబడి, కొంతకాలం అది మహోజ్జ్వలమైన సేవ చేసింది. ఆ మహాసభకు ఒకసారి నేనూ కార్యదర్శిగా సేవచేశాను. కాని, నారాయణగారి ఆ సమయంతో ఆ సభ కూడా అస్తమించింది. దానికి తిరిగి "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" వారు "ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్తు"ని స్థాపించి మరో రూపాన ప్రాణంపోసి బ్రతికించారు. తదుపరి శ్రీ ఆర్. వి. చలం నాటకాలు, నటుల గురించి ప్రస్తావించారు.


రాష్ట్రేతరాంధ్రులో మంచి కళాకారులున్నారు. విజయనగరం, రాజమహేంద్రవరాల్లో జరిగిన నాటకోత్సవాల్లో రాష్ట్రేతరాంధ్ర ప్రాంతంనుండి రెండే రెండు నాటక సమాజాలు వెళ్ళి పాల్గొన్నాయి. రెండింటికీ బహుమతులు వచ్చాయి. విజయనగరంలో మా సమితివారికీ (ఎ. డి. యల్. సొసైటీ-జంషెడ్పూరు), రాజమహేంద్రవరంలో "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" వారికీ బహుమతులు వచ్చాయి. ఆంధ్రదేశంనుండి వచ్చిన నాటక సమాజాల వారికి, ప్రవాసాంధ్ర కళాకారులు ఏమాత్రం తీసిపోరని ఈ సంఘటనలు చాటుతున్నాయి.

సభకు ప్రొఫెసర్ వల్లూరి సుబ్బరాజు గారు అధ్యక్షత వహించారు. కన్నుల పండుగా అలంకరింపబడిన సభా ప్రాంగణంలో సహృదయ ప్రేక్షకలోకంతో నిండినహాల్లో

వీరెవరో గుర్తుపట్టగలరా?



1



2

ముప్ఫయ్యేళ్ల క్రితం ఇద్దరు ఆంధ్రప్రముఖులు ఈవిధంగా వుండేవారు. వారిని గుర్తుపట్టగలరేమో ప్రయత్నించి చూడండి.

సమాధానాలు 54 వ పేజీలో.

ఈ వేళ (25-1-59) "ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్" నాటకోత్సవాలు ఉత్సాహంతో ప్రారంభమయాయి.

ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీ ఎమ్. వి. రావు, బి. ఎస్‌సి., బి. ఎల్. సభాసదుల నాహ్వానిస్తూ, "ఆంధ్రదేశంలో ఈనాడు ఊరూరా జరుగుతున్న నాటకోత్సవాల లాగునే, ఇక్కడకూడా ఆంధ్రకు అయిదారు వందలమైళ్ళ దూరాన రాష్ట్రేతరాంధ్రుల కోసం ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసిన "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" వారికి జోహార్లు. ఇలాంటి గురుతర బాధ్యతలను నిర్విఘ్నంగా కొనసాగించేందుకు పూనుకున్న శ్రీ పి. అప్పారావుగారు, శ్రీ శశిభూషణ్ శాస్త్రో, శ్రీ ఎస్. ఆర్. నంది గార్లకు అభినందనలు" అన్నారు. కుమారి యం. ఉష ప్రార్థనగీతంతో ఈ నాటకోత్సవాలు ప్రారంభమైనవి.

సభకు అధ్యక్షతవహించిన ప్రొఫెసర్ వల్లూరి సుబ్బరాజుగారు. నిర్వాహకుల సాహసానికి జోహార్లు అర్పిస్తూ యిలా అన్నారు:

"మానవునికి తిండే ముఖ్యం కాదు. మానసికవికాసానికి వినోదంకూడా కావాలి. వినోదాలన్నిటికంటే నాటకానికి ప్రాచీన కాలంనుండీ అత్యున్నతస్థానం ఏర్పడింది. నాటక రచయితలు ఒక ముఖ్యవిషయాన్ని జ్ఞాపకముంచుకోవాలి. రాజకీయ వివాదాల, ఏదో తాత్కాలిక సిద్ధాంతాల ప్రబోధానికి రచన సాగిస్తే ఆ రచన కాలం చాలా పరిమితమవుతుంది. విశ్వమంతటికీ ఒప్పే సర్వ్వలకూ ఆమోదమైన రచన నాలుగు కాలాలపాటు మనగలుగుతుంది. నాటక నిర్వాహకులకు డబ్బే ముఖ్యాశయం కాకూడదు. అలాగని నష్టం భరించి నాటకాలు వేయమని కాదు. ఈనాడు నాటకాల్లో వేషాలు వేసి చిత్రసినిమాల్లో

(61-వ పేజీ చూడండి)



జీవనలీల

మూలం
మానిక్ బంద్యోపాధ్యాయ
అనువాదం
మద్దిపట్ల సూరి

(గత సంచిక తరువాయి)

13

ఏపనైనా ఉబులు తొందరతొందరగా చేసెయ్యటం—శశికెప్పుడూ అలవాటు లేదు. మనసుకేదయినా తోస్తే దాన్ని మననం చేసుకుని చేసుకుని తర్వాత ఆచరణలో పెట్టటానికి ప్రయత్నిస్తాడు. అయినా అప్పుడప్పుడు ఎంత ప్రయత్నించినా తమాయించుకోలేని ఊహాలు కూడా తలెత్తుతూ ఉంటాయి. ప్రొద్దున్నే లేచి అతడేమీ ఆలోచించలేదు, ఏ విషయమూ వెనకాముందు యోచించి చూసుకోలేదు. తిన్నగా పరాన్ యింటికివెళ్ళి, వంటింటిగుమ్మందగిర నిలబడి "ఓసారి తాటితోపుకి వస్తావా కుసుమా?" అని అడిగాడు.

కుసుమ తెల్లబోయింది. "తాటితోపులోకా? ఎందుకు ఇంత ప్రొద్దున్నే తాటితోపులోకి?"

"రా. కొన్ని సంగతులు మాట్లాడాలి నీతో."

"మాట్లాడాలా? ఏపనాలో నవ్వాలో తోచకుండా ఉంది చిన బాబూ! ఈ జన్మకివాళ మొదటిసారిగా మీ అంతటమీరు మాట్లాడాలని వచ్చారు. అదీ తాటితోపుకి పిలిచి! పదండి వస్తున్నాను."

తాటితోపులో క్రిందపడిపోయిన తాటిబొండుమీద కూర్చున్నాడు శశి. ఓనాడిలాగే ప్రొద్దున్నపూట కుసుమ తనని ఇక్కడికి పిలుచుకునివచ్చి, మరి సంగతులు చెప్పింది. కొంచెంసేపటికి కొంగున కట్టుకున్న తాళాలగుత్తి గలగలలాడించుకుంటూ వచ్చింది కుసుమ. ఇవాళింతహుషారుగా ఉన్నదేమిటి కుసుమ? రేపు ఇహ ఎలాగూ ఈ ఊరువిడిచి వెళిపోతోందికదా అనో, ఆమె ముఖం కొంచెం చిన్నబోయినట్లు కన్పించాలి. కన్నీళ్ళని పైకిపారనీకుండా అణచుకుందేమో! శశి ఏం మాట్లాడలేకపోయాడు. ముఖం విచారంగా పెట్టుకుని, కుసుమముఖంలోని భావాల్ని పరిశీలించసాగాడు.

"నవ్వనా?" కుసుమ అడిగింది.

"ఎందుకు? నవ్వటం దేనికి?"

కుసుమ నవ్వుతూ – "నా నవ్వుచూస్తే మీ కేదో ప్రాణంలేచి వచ్చినట్లుంటుందిగా! అందుకని అడుగుతున్నా" అన్నది "ఊరికే తమాషాకి నిన్నిక్కడికి పిలుచుకు రాలేదు కుసుమా!"

"అవో! ఆ సంగతి తెలియదే నాకు! మొదట్నుంచి తమాషా చేస్తూనే వస్తున్నారుగా నాతో. ఇప్పుడూ బహుశా అందుకే పిలుచుకుని వచ్చారనుకున్నాను. సరే అయితే కూర్చుంటాను... ఎందుకు పిలిచారో చెప్పండి".

"మొదట్నుంచీ నీతో తమాషాయే చేస్తున్నానని ఎలా అనగలవు కుసుమా?"

"తమాషా కాదూ? అయితే వేళాకోళమా?"

శశి కొంచెం కోపం తెచ్చుకుని, "నీ అంతర్యం ఏమిటో నాకేం అంతుపట్టకుండా ఉంది కుసుమా!" అన్నాడు.

"ఎలా అంతుపడుతుంది? ఆడవాళ్ల అంతర్యాలు అంత సులభంగా తెలిసేవి కావు. డాక్టరయితే అయి ఉండొచ్చుమీరు ఇది జ్వరంలాంటిది కాదుగా!"

శశికి బాధగా తోచింది. స్నేహపూర్వకమైన తృణీకార భావంతో ఏడేళ్లుగా ఆమె పరిహాసాలకి ప్రశ్రయమిస్తూ వచ్చినా ఆమెని అర్థంచేసుకోలేకపోయాడా తను! ఆశ్చర్యమే శశికి చాలా కష్టం చేసింది. జీవిత పరిధికి వెలుపలగా ఉన్న ప్రాకారానికి హఠాత్తుగా మధ్యలో ఒక చిన్న గుమ్మంకన్పిస్తే అటువైపున ఎంత వైశాల్యం! ఎంత విస్మయం! కుసుమకి కళ్లు జలజలలాడటం లేదెందుకని? ఒకసారి పుట్టింటికి వెళ్టంకోసం క్రిందపడి నడుం విరగ్గొట్టుకుంది. చివరికి అక్కడికి వెళ్లినా వెళింది కాని మళ్లీ పదిహేనురోజుల్లోనే తిరిగివచ్చింది. తాను ఇక్కడ ఇలా కలుసుకోవటం ఇదే ఆఖరుసారి అయి ఉండొచ్చు. బహుశా ఈ జీవితంలో ఇహ ఇంత గ్గిరగా కలుసుకోవటం అంటూ ఉండదు. అయినా ఇవాళ కుసుమ కాస్తకంటతడి అయినా పెట్టుకోవటం లేదేం? గద్గద కంఠంతో ఉద్వేగంతో ఒక్కమాటయినా మాట్లాడదేం? కుసుమ ముఖంలో విచారభావాల్ని చూడాలని శశికళ్లు వెంపరలాడిపోతున్నాయి. ఆమెసన్నని పడుపువినాలని అతడి చెవులునిక్కపొడుచుకుంటున్నాయి కుసుమరోజూ మాట్లాడే మాటల్లో, ఆమె ప్రవర్తనలో ఎన్నో సంకేతాలు అతడికెంత ప్రియమైనవో, ఆమెలోని ఆ అమాయకత ఆ తొట్రుపాటు అతడికెంత యిష్టమో ఎవరికి తెలుసు? ఈ ఊరుని శాశ్వతంగా వదిలి వెళ్లిపోబోతోంది కుసుమ. అలాంటి దివాళ ఇక్కడ ఈ తాటితోపులో తనకింత దగ్గరగా ఊరికే తమాషాగా తాళం చెవులు చప్పుడుచేస్తూ కూర్చుంది. ఎంత అన్యాయం ఆమెది: ఎంత వెర్రితనం!

కాలితో చిన్న మొక్కని కదిలిస్తే మంచు బొట్లు జలజల రాలాయి. కుసుమనికూడా ఇలా కట్టుకొని ఒక్కసారి కుదిస్తే ఆమె కళ్లలో అణగి ఉన్న కన్నీళ్లన్నీ ఇలా రాలిపోతాయి. ఆ రాలిపోవటం చూడాలి తను! అనుకుంటున్నాడు శశి.

"మాట్లాడాలని పిలుచుకుని వచ్చి మెదలకుండా కూర్చున్నారేం చిన బాబూ?" అని అడిగింది కుసుమ.

★ జీవనలీల ★

"మీరు ఈ ఊరువదిలి వెళిపోతారని విన్నాను. ఆ మాటే అడుగుదామని పిలుచుకుని వచ్చాను."

"ఎల్లుండి వెడతాం" అనేసింది కుసుమ చులాగ్గా.

"నాతో చెప్పనయినా లేదేం?"

"ఎప్పుడు చెప్పను? మీరు ఎప్పుడైనా వస్తేగా!" శశీ కోపం తెచ్చుకుని, "రాలేదా, ఎన్ని పనులతో సతమత మవుతున్నానో తెలుసా? ఊరికే నే చెయ్యి విరిగిందని సాకుతో, జోరున వర్షం కురుస్తున్నా వచ్చినవాణ్ణి, ఇంత ముఖ్యమైన సంగతి చెప్పటానికి ఓసారి రాకూడదూ?" అన్నాడు.

ఈమాటతో కుసుమలో ఓ విలక్షణమైన కోపం కన్పించింది. ముఖంమీది ముంగురులను రెండుచేతుల్లో వెనక్కి తోసుకుని, శశి కేసి తీవ్రంగా చూసింది—శశి ఏదో చెప్పినమాట వినని పిల్లవాడై నట్లు, అతణ్ణి తీవ్రంగా దండించబోతున్నట్లు, కుసుమ ఇలాంటిది [illegible] దనల్శ. శశి ఆమెని అవమానించకుండా ఉన్న దెప్పుడు? ఆమె [illegible] మానాన్ని నిల బెట్టిం దెప్పుడు? ఒళ్లుమండేట్లు మాట్లాడకుండా విడిచి పెట్టిం దెప్పుడు?

అతను కోపం తెచ్చుకోని దెప్పుడు? బెదిరిస్తున్నట్లు తనకేసి చూడని దెప్పుడు? ఇవాళ ఈ చిన్న అవమానానికే ఆమె ఆడ పులిలా లేచింది.

అయినా ఆమె గట్టిగా ఏం మాట్లాడలేదు. తమాయించుకుంది. ఆమెకోపాన్ని చూసి శశి నీరుకారిపోవటాన్ని బట్టి చూస్తే కుసుమ నేర్పుగా మాట్లాడటంలోని ఒడుపుని ఎంతవిజేసి పటుకోగలిగింది తెలిసిపోతుంది.... "ఊరికే చెయ్యివిరిగిందన్న సాకుతో ఒక్కసారి కాదు వందసార్లు పిడుగులు పడుతున్నా, భూకంపం వస్తున్నా రాగలను, గాని ఆ సంగతి చెప్పటానికి ఎందుకురావాలి నేను?" అన్నది కుసుమ.

"పోనీ వరాన్‌తో నయినా కబురు పంపవచ్చునుగా!"

"అదిమాత్రం దేనికి పంపుతాను? నా సంగతి పట్టించుకోని వాళ్లకి కబురంపవలసిన అగత్యం ఏంవచ్చింది? నేనే వద్దన్నాను."

"పనితొందరలో రాలేక పోయినంత మాత్రాన పరాయి వాణ్ణయి పోయాను నేను. అంతేగా కుసుమా?"

కుసుమ నవ్వింది. "పరాయివాళ్ళెక్కడ అయినారు? కొటి తోపులో చాటుగా పరాయివాళ్లతో అయితే మాట్లాడుతూ కూచుంటానా నేను? నేనంత వేకిదాన్ని కాను చినబాబూ?"

ఏమన్నది కుసుమ? గంపెడు గాధ ఉన్నమాటని ముఖంమీద అనేసింది. శశికి చటుక్కున కనకటిసంగతి ఒకటి గుర్తుకి వచ్చింది. ఓనాడు కుసుమ బరితెగి అతడి తండ్రిమాట ఎత్తి అవమానంగా మాట్లాడింది. అలాంటి విపరీతం మరి ఎప్పుడూ జరగలేదు కనుక శశి ఆ సంగతి మరిచిపోలేక పోయాడు. కుసుమ కోపానికి కారణ

మెసెంది కూడా గ్రహించలేక పోయాడు. ఇన్నాళ్ళకి కుసుమ మళ్ళీ ఆనాటిలా మాట్లాడిందేమిటి? 'లేక దాన్ని కానుట. ఎంత అసభ్యమయినమాట! అయినా కుసుమ చెప్పతలచిందేమిటో మరోలా స్పష్టం చెయ్యకూడదూ? ఏమనాలో, ఏం చెయ్యాలో కూడా శశికి బోధపడలేదు. ఇవాళ హఠాత్తుగా ఈమాట అనవలసిన అగత్యం ఏమి వచ్చిందో కుసుమకి, అదీ అగమ్యంగానే ఉంది. అభిమానం కాదీ ఒకవేళ అనతలచినా ఇన్నాళ్ళనుచీం మాట్లాడుతున్న ధోరణిలో కొనసాగుతూనే ఈ అభియోగాన్ని తీసుకువచ్చినా శశి గ్రహించగలిగేవాడే కాని ఇది ఆ ధోరణిలో లేదు. ఇది కుసుమ అక్కసుతో—అహంకారంతో అన్నమాట ఇవాళ లేదు, రేపు శాశ్వతంగా వెళిపోతోంది. అలాంటి దివాళ అతడితో ఇలా మాట్లాడటం ఏమంత భావ్యం?

"శశి ఆలోచించి ఆలోచించి "ఎలాగు వెళిపోతున్నావుకదా అని ఇంత తీవ్రంగా మాట్లాడుతున్నట్టున్నావ్ కుసుమా? సంబంధం తెగిపోయింది కనుక అనతలచుకున్నవన్నీ అంటున్నావా? కుసుమా" అన్నాడు.

"ఏమ్మన్నేమి అన్నాను నేను?"

"నువ్వు అన్నదేదో, కలకాలం జ్ఞాపకం ఉంటుందిలే. ఇందుకనే నువ్వు చెయ్యివిరిగిందని వచ్చినరోజున నీతో కొన్ని సంగతులు మాట్లాడబోయాను. నువ్వేమీ విన్పించుకోలేదు, గ్రహించలేదు. కోపం తెచ్చుకుని వచ్చేశావ్. ఆడవాళ్ళంతా ఇంతే!"

కుసుమ కళ్ళు ఇంతింత చేసుకుని "ఆడవాళ్ళని గురించిన ఇంత పరిజ్ఞానం మీకు ఎక్కడినుంచి వచ్చింది చినబాబూ! ఆడవాళ్ళు ఇలాగూ ఉంటారు, అలాగూ ఉంటారు, ఎన్నిరకాలుగా నైనా ఉంటారు, కాని మనసుకు నచ్చినట్లు మాత్రం ఉండరు అన్న సంగతి కూడా తెలుసుకోండి" అన్నది.

"ఇవాళ నువ్వు చాలా అసహ్యంగా మాట్లాడుతున్నావ్ కుసుమా!"

"మాట్లాడితే మాట్లాడనివ్వండి చినబాబూ! నోటికి వచ్చినటలా మాటాడనివ్వండి. ఇవాళ నే చెప్పతలచుకుంది ఏమిటంటారో! మేము ఊరువిడిచి పోతున్నామని మీకు చెప్పిందెవరు? ఇక్కడికి నన్ను పిలుచుకురమ్మని ఎవరు చెప్పారు మీకు? నేను మతిలేనిదాన్నని, పిచ్చిదాన్నని తెలుసుగామీకు? అయినా వెళిపోబోయే ముందు ఇక్కడికి పిలుచుకుని రావాలనుకున్నారు. చెవులు గింగురెత్తేట్లు చెడా-మడా మాట్లాడదామనుకున్నారు. పదేళ్ళనుంచి ఆడుతున్నా మనసు తీరలేదూ ఇంకా? నేను మూర్ఖురాల్ని, పల్లెటూరిదాన్ని, ఈ ఆటల అంతర్యం తెలియదు నాకు. చచ్చే బాధగా ఉంది నాకు."

ఈ మాటలకి సమాధానం ఏమీ ఉండదు కనుక శశి నోటివెంట మాటరాలేదు. అతడు బూట్లలోంచి కాళ్ళుతీసి, గడ్డిమీద మంచుకి రుద్దుతూ, తలవంచుకుని మూగవాడిలా కూర్చున్నాడు.

ఇక్కడివా కుసుమ కింతసేపటికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మనసులోని ఉద్రేకాన్ని ఇలా కన్నీళ్ళతో ఇలా ఎన్నడూ శశియెదుట బయటపెట్టుకుని యెరుగదామె. అయినా చాలా గట్టిదామె. రెండుసార్లుగా నిట్టూర్చి, రెండుసార్లు పమిటచెంగుతో కళ్ళు ఒత్తుకుని, ఆ ఆవేశాన్ని అణచుకుంది.

"ఇలా అవుతుందని అనుకోలేదు చినబాబూ! అనుకుంటే ఎప్పుడో ఊరు విడిచిపెట్టి వెళిపోయేదాన్ని" అన్నది.

కుసుమ ఇంకొంచెంసేపు కన్నీళ్లు పెట్టుకునిఉంటే, శశి దిక్కుతోచక పిచ్చివాడిలా ఆమెని రెండుచేతులతో పొదివి పట్టుకునేవాడే, అందులో ఏం సందేహం లేదు. కాని కుసుమ ఇలా అనటంతో అతడు కొంత తమాయించుకున్నాడు. ఇన్నాళ్ళకిలా కుసుమ ఆరోపణలన్నిటికీ సమాధానం ఇవ్వటం కుదరదు అన్న సంగతి అతడు గ్రహించలేక పోయాడు. శశిముఖం వెలవెల బోతున్నట్లు కన్పించింది. ఏమిటిచెయ్యటం? కుసుమతో ఏం మాట్లాడటం? రెండురోజుల నోటీసుతో కుసుమ తనని ఇలాంటిచిక్కులో పెడుతుందని, ప్రమితంగా ఉన్న మనస్సును ఇంత కాగుమారు చేస్తుందని ఏంతెలుసు. కుసుమ ప్రక్క కూర్చునిఉంటే రెండురోజుల్లో తాను వెళిపోతున్నాననే విచార తరంగాలలో తల మునకలవుతూ తన నింత కలవరపెట్టేట్లు చేస్తుందన్న అభిప్రాయంఎన్నడూ లేదతడికి. నిన్న ఈ వార్త విన్నప్పట్నుంచీ శశి మనస్సు పరిపరివిధాల పోసాగింది. ఇవాళ అదంతా కలసి ఏదో క్లిష్ట స్థితిగా పరిణమించింది.

కుసుమ శరీరం శశికివాళ అపూర్వసుందరంగా ఉన్నట్లు తోచింది. అయినా ఆ శరీరాన్నంతనీ పొదివి పట్టుకోలేకపోయాడు. కాని హఠాత్తుగా కుసుమ చెయ్యిపట్టుకున్నాడు' కుసుమ కొంచెం విసుపోయింది. ఇద్దరిమధ్య ఎడం ఉంది. చెయ్యిపట్టుకుంటాడనే నేమో కుసుమ కొంచెం వెనక్కి తగినుంచుంది. కాని ఆమె అన్న మాట మాత్రం అపూర్వం, ఎన్నడూ ఊహించనిది.

"నాకు నేనై ఎన్నిసార్లు వచ్చాను? ఇవాళ పిలుచుకవచ్చి ఇలా చెయ్యిపట్టకోవటం భావ్యమా చినబాబూ? కోపం తెచ్చుకోలేనూ నేను? నాది మా చెడ్డకోపం అసలు"

ఆ మాటవినే సరికి వెలవెలబోతున్న శశిముఖం మాడిపోయింది. కుసుమకింత భయపడతాడు శశి—అని ఎవరికి తెలుసు? అయినా అతడు కుసుమ చెయ్యి విడిచిపెట్టలేదు.

"తెచ్చుకో కోపం, నేను అనే మాటవిని తెచ్చుకో. నాతో వచ్చేస్తావా కుసుమా?"

"వచ్చెయ్యనా? ఎక్కడికి?"

"ఎక్కడికో అక్కడికి. వచ్చేట్లయితే ఈ రాత్రి ఎక్కడికో అక్కడికి వెళిపోదాం, రా."

"రాను" అన్నది కుసుమ వెంటనే.

"శశి వ్యాకులపడుతూ ఏం? ఎందుకురావు?"

"ఎందుకు వస్తాను?" అని మాత్రం అన్నది కుసుమ.

శశి అమాయకుడిలా, పసివాడిలా మాట్లాడాడు—"ఎందుకు వస్తావా? ఎందుకువస్తాను అంటే అర్థం ఏమిటి కుసుమా?"

—"ఇదేమిటివాళ ఇలా అంటున్నారు?" అంటూ చిన్నపిలలా తల ఊగిస్తూ, నీరుక్రమ్మిన కళ్ళతో శశిలోని విహ్వలభావాన్ని గమనిస్తూ "ఎలా అడుగుతున్నా రీమాట? ఎందుకు వస్తాను. మీరు పిలయినప్పుడు అడిగిందేతడవుగా ఆదరాబాదరా పరుగెత్తుకువస్తానని అనుకున్నారా మీరు? ఎవరైనా వస్తారా?" అన్నది.

శశి ఇంక ఆపుకోలేక "ఒకప్పుడు వచ్చేదానివే!" అన్నాడు. కుసుమ ఆమాటను ఒప్పుకుంటూ—"అవును వచ్చేదాన్నే చినబాబూ! రమ్మని స్పష్టంగా పిలవటంమాట అలా ఉంచండి. సైగ చేసినా చాలు పరుగెత్తుకువచ్చేదాన్నే. ఎప్పుడూ ఒకేరకంగా సాగుతుందా? మానవులు ఎప్పుడూ మారకుండా ఒకేరకంగా ఉండటానికి లోహప్రతిమలా? చెప్పతలచుకున్నది ఖండితంగా చెప్పటం మంచిది. ఈనాడు చెయ్యిపుచ్చుకునిలాగినా రాను" అన్నది.

శశి ఆమె చేతిని వదిలేసి, "నీది ఇంత భయంకరమైన కోపమని నాకు తెలియదు కుసుమా! పెద్దపెద్ద మాటలన్నీ మాట్లాడుతావు. ఒక చిన్న విషయాన్ని నువ్వు గ్రహించవెందుకని కుసుమా! తమ మనస్సును మానవులెప్పుడూ గుర్తించగలరా? ఎన్నేళ్ళనుంచో తృణీకార భావంతో అవమానిస్తూ వచ్చావని, కోపం తెచ్చుకుని దానికి బదులు తీర్చుకోతలచావులా ఉన్నదివాళ. నాకు తెలియకుండానే నీకు కష్టం కలిగించి ఉండొచ్చు. నీమీద ఎంత ఆపేక్షో తెలుసుకోలేదూ? నువ్వు వెళిపోతున్నావని తెలియటంలో నాకు గుబులు పుట్టిందంటావా! అదీకాక పోనీ—నువ్వన్నమాటేగా—మనుషులు మారుతారని! సరే ఇన్నాళ్ళూ నీతో ఏదో ఆడానసే అనుకో. ఇవాళ నేను మారకూడదా కుసుమా?"

(39-వ పేజీ చూడండి)



కొద్ది సన్‌లైట్ చాలా బట్టలను ఉతికింది
-అట్లు చేసినట్టిది దాని అధిక నురగ
చిన్ని చేతులకు పెద్ద కృషి: అంత పెద్ద బట్టల దొంతరను, దుప్పట్లు, తువ్వాళ్లు—రాధ, సుధ, వాటన్నిటినీ ఇస్త్రీ చేయుచూ అమ్మకు సాయపడుచున్నారు.
ఎన్నో బట్టలు-అయినా అమ్మ వాటిని ఎంతో కొద్ది సబ్బుతోనే ఉతికింది. సహజంగా సన్‌లైట్‌తో. అది బాదకుండానే మురికినంతయు తొలగించివేస్తుంది! మీ బట్టలుతుక్కొనుటకు సన్‌లైట్ సబ్బును వాడండి!
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు బట్టలను తెల్లగాను కాంతిగాను ఉతుకును.

సీతమ్మ సంసారం

(నాటిక)

బి. జి. ప్రసూనాంబ

(గత వారం తరువాయి)

రంగమ్మ: పిడికెడన్నమైనా పెట్టకుండా అయ్యో గాంతో! ఎంతగతి పట్టింది!

ప్రకాశ: ఎవరొద్దన్నారే! ఆమైన కూర్చోకపోతే కాస్త అన్నం వండితే కరిగిపోతావా?

రంగమ్మ: అవునురా నాయనా నేనే మైన పనిముఖం ఎరుగుదునా!

ప్రకాశ: అవసరానికి ఉపయోగించని పని ఎందుకమ్మా?

రంగమ్మ: నా పెత్తన మేముందిరా ఈ కొంపలో? పరాయివాళ్లైనా అదింత పెడితే తింటేనిలేకుంటే కడుపులో కాళ్ళు పెట్టుకొని ఓమూలపడుంటేని. మంచికోమాట గోడుకో దెబ్బ అన్నారు!

[మళ్ళీ మురళీ కలవరిస్తాడు. జ్వరంలో వళ్లు తెలీక తిన్నుకుంటాడు. ప్రకాశరావు కంగారు పడతాడు]

ప్రకాశ: అన్నట్టు ఇప్పుడో పని చేయొచ్చు నేను ట్యూషను చెప్పే రామస్వామిగారింటికి వెళ్ళి ఉన్న విషయమంతా చెప్పిచూస్తా. ఇంక మొదటి తేదీకి నాలుగైదురోజులే గనుక కొంతైన జీతం ముందిమ్మంటాను ఇవ్వకపోతారా?

సీతమ్మ: అడిగి చూడండి.

రంగమ్మ: అదీ ముందరే తెచ్చి తినికూచుంటే వచ్చేనెల అందరం గడ్డి మేస్తామటరా!

ప్రకాశ: పిల్లవాడు బాగుంటే గడ్డీ మేస్తామో కంపే మేస్తామో!

[ప్రకాశరావు వెళ్లిపోతాడు. సీతమ్మ చింతతో కూర్చుంటుంది.]

రంగమ్మ: ఇంతైనా కాస్త మడికట్టుకొని కూడు ఉడకేయ్యవే మమ్మల్ని పస్తుంచినా పరేగాని పగలల్లా రెక్కలు కొట్టుకొచ్చిన వాణ్ణి మాడుస్తావటే?

సీతమ్మ: లేవడానికి కాళ్లాడడం లేదమ్మా?

రంగమ్మ: ఆడవు. ఆడవు. ఎందుకాడతాయి? జరిగినమ్మకు జరిగినంతని ఊరుకున్నారా? ఆ చవటపాగిస్తున్నాడు. సాగించుకుంటున్నావు. పాపం నీతప్పేముందిలే.

(ప్రకాశరావు మళ్ళీ వస్తాడు.)

సీతమ్మ: ఏమైనా ఇచ్చారా?

ప్రకాశ: ఎందుకిస్తారు? పైగా సరిగా చెప్పడంలేదనీ, వాళ్ళమ్మాయికి దమ్మిడీ ఎత్తు చదువురాలేదని ట్యూషను మార్పించేశామన్నారు ఇక వాళ్లింటికి రాక్కర్లేదుట. నేను చెప్పిన చదువుకు ఇప్పటికిచ్చిందే జాస్తట. ఇక ఒకటేమిటి, నానా మాటలన్నారు.

రంగమ్మ: సారె, సంబడం! అదీ వదలగొట్టుకొచ్చావా! ఇంక జరిగినట్టే కొంపలో జానకీ ఎందాకని వంటింట్లో మగ్గి చస్తావే. వచ్చి ఓమూల చాపేసుకు పడుకో. నీకూ నాకూ రోగమొస్తే చేసేదిక్కు కూడా లేదు. ఈపూటకు అందరికీ శివరాత్రే లే.

ప్రకాశం: (కోపంతో) వెళ్లి వండుకొని తినరాదుటమ్మా.

రంగమ్మ: అందరికీ లేని బాధ నాకేం వచ్చిందిరా! (లేస్తూ) కొంపలో మజ్జిగనీళ్ళయినా ఏడిశాయో లేదో. (వంటింట్లో కెళ్తుంది. మురళి కలవరిస్తాడు. గుణం పుట్టిన చేష్టలు చేస్తుంటాడు సీతమ్మ దేవుడి ఫోటో దగ్గరికెళ్ళి ఏడుస్తుంది)

సీతమ్మ: అయ్యో! నా పిల్లాణ్ని నాకు దక్కించండి ఓ తల్లి పార్వతీ—నువ్వు జగజ్జననివి. దీనరక్షకివి నువ్వు నా మురళీని కాపాడుతల్లీ. నా బిడ్డను నాకివ్వు తల్లీ. నా కడుపులో చిచ్చుపెట్టకు తల్లీ. తల్లీ—చలని తల్లీ, నన్ను కాపాడుతల్లీ.

(ప్రకాశరావు భార్య తలను తనగుండెల కదుముకుంటాడు)

ప్రకాశ. సీతా, ఏడవకు. మనబాబు మనవాడే. మన మురళీ మనవాడే. వాడికేం చెడు జరుగదు. ఇదిగో ఇప్పుడే వెళ్ళి డబ్బు తెస్తా. డాక్టరుచేత ఇంజెక్షను చేయిస్తా ధైర్యంగా వుండు. (వంటింట్లోకి పోయి ఓ కంచుగిన్నె పట్టుకొస్తాడు.) సీతా ఇది అమ్మి డబ్బు తెస్తా. మన మురళీకోసం ఇంక బెంగపడు. (పోబోతాడు. రంగమ్మ గుడ్డురుముతూ వస్తుంది.)

రంగమ్మ: గిన్నెక్కడికిరా? అలా తీసుకొని పరుగెత్తుతున్నావు?

ప్రకాశ: అమ్మతనమ్మా. డబ్బుకు మరివేరే మార్గం లేదు

రంగమ్మ ఓరి నీ దరిద్రం కాలా. గిన్నె వెంటబడ్డావుటరా! ఓరి నీ సొమ్మం మండ. అవ్వి కన్పించాయా చివరికి.

ప్రకాశ: అమ్మా....అమ్మా....కొంచెం మురళీని చూడు.

రంగమ్మ: (గిన్నె లాక్కొని మంచం మీద కూర్చుంటూ) నీవూ నీ భార్య ఏమైన భాగోతం ఆడుకోండి. ఇంట్లో సామానులన్నీ బొక్కదగిర ముల్లెనుకున్నావా? సిగ్గు గలవాడివైతే చీపురుపుల్లైనా ముట్టక.

సీతమ్మ: అత్తయ్యా, పిల్లాడి ప్రాణం...

రంగమ్మ: పిల్లాడు, గిల్లాడు ఇంట్లో చిల్లిగవ్వముట్టడానికి వీలులేదు.

ప్రకాశం: అమ్మా మురళీ బ్రతికితే నీకిలాంటి పదిగిన్నెలు కొనిస్తా.

రంగమ్మ: ఆ కొనేడబ్బు పెట్టె ముందులే కొని ఇప్పించుకో.

ప్రకాశ: పోనీ, అమ్మనమ్మా. తాకట్టు పెట్టి మొదటి తేదీకి తెచ్చిస్తా.

రంగమ్మ: ఇదిమాత్రం చచ్చినా ఇవ్వను. ఇక నీపెండ్లాన్నే తాకట్టు పెడతావో. నువ్వే తాకట్టుకు పోతావో. నాకు తెలీదు.

ప్రకాశ: అమ్మా గిన్నెపోతే మళ్ళీ వస్తుంది మురళీ చెయ్యిజారితే మళ్ళీ ఎక్కడ కన్పిస్తాడే?

రంగమ్మ: ఆహా! పోయినవన్నీ తెచ్చావు. ఇక గిన్నె తెస్తావు

ప్రకాశ: అయితే ఇవ్వవా అమ్మా?

రంగమ్మ. నేనేంగీర్వాణంలో మాట్లాడుతున్నానా? ఇవ్వనని స్పష్టంగా చెప్పడంలే!

సీతమ్మ ఫరవాలేదు. నా మురళీని నేను బ్రతికించుకుంటాను. ఇదిగో. ఈ మంగళసూత్రాలు అమ్మిరండి. ఖర్చు లక్షణంగా ముంగుకు జరుగుతుంది. (చేతిలో మంగళసూత్రాలు పెడుతుండగా శెట్టి వస్తాడు, నల్లగా మొద్దులాగా ఉంటాడు.)

శెట్టి ఏం జ్ఞాపకమున్నామా?

ప్రకాశ అయ్యో! మిమ్మల్నెలా మరిచిపోతాం శెట్టిగారూ!

శెట్ట: ఆచాయలే గానరాటంలేదే!

ప్రకా: అటు ప్రక్క వచ్చే అవసరం లేకపోయింది.

శెట్టి: ఎందుకుంటుంది? నీఅవసరం తీర్చుకుంటివి ఇక ఆ బజారుతో ఏంపని? నాతో ఏంపని?

ప్రకాశ: మీకివ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా ముఖం చూపలేక పోతున్నాను శెట్టిగారూ. ఏనెల తలకుమించిన ఖర్చు సంసారం సముద్రంలాగుంది. అందుకని ఆవీధిని రావడమే మానేశాను ఈమధ్య.

★ సీతమ్మ సంసారం ★

కోటి: ఓహో! విధి నెరోకిండా ఎగేద్దా మనుకున్నావా!

ప్రకాశ్: ఎక్కడైన ఒక్క కోర్టు ఒక్క కానీ ఎగేసినట్టు విన్నారా!

కోటి: ఎవరిసంగతో నాకెందుకంట. నాకు అరుగాలవాటి డబ్బియ్యాలి. అది ఇట్టబెట్టి మరి మాటాడు. కుడ్డలు తెచ్చి కులుకుతా కడితే ఆమాత్రం బుద్ధి ఉండొద్దూ టయ్యా అన్నంది వేప్రాణానికి.

ప్రకాశ్: మిగలకండి కోటిగారు. కష్ట సుఖాలు అందరికీ వస్తాయి. కాలుజారి తీసుకోవచ్చు. నోరుజారితే తీసుకోలేం.

కోటి: చెప్పొచ్చావులేవయ్యా శ్రీరంగనీతులు. ఇటువంటివి కానా చూశాం. నా డబ్బు నాకు పారెయ్యి మర్యాదగా.

ప్రకాశ్: కోటిగారూ మాసం చివర,పిల్లాడికి గుణంపుటిన చెరులార అన్నింటికీ స్థిర పడి (నోట మాటరాక తత్తరిమంతో కళ్ళదు వుంటాడు.)

కోటి: అదీ, ఇదీ నాకెందుకయ్యా, నా డబ్బు నాకియ్యి.

ప్రకాశ్: కోటిగారూ, ఇవాళ్టికి మన్నించండి. పిలవాడు...

కోటి: నీపిలవాడితో మాకెందుకయ్యా. మాడబ్బు మాకు పారెయ్యి మర్యాదగా అంటుంటే...

(పిల్లవాడు గుణంపుటినపను చేస్తుంటాడు.)

ప్రకాశ్: కోటిగారూ దాగివ్వొదలండి. నేను బయటికెళ్లాలి. పిల్లవాడు తుణయాలవట్టి మైకె చేజిక్కాడు.

సీతమ్మ: కోటి గారూ, మీకు బిడ్డలున్నారు. మామురళీ మీ బిడ్డల్లో ఒకడు. వాణ్ణి కాపాడండి.

కోటి: అదంతా నాకు తెలీదు. మర్యాదగా డబ్బిస్తారా సామాను వేలం వేయించనా!

రంగమ్మ: సామాను నాది. అందులోచిల్లిగవ్వ ముట్టడానికి వీలులేదు. అగుగో పిల్లాడి ముందుకు తాళిబొట్టుకూడా అమ్మబోతున్నదిగా. అందులో మిగిలితే తీసుకో

కోటి: ఇలాతేండి ప్రకాశంగారూ. (ఇద్దరు పెనుకుంటూరు. కోటి మంగళ సూత్రాలు తీసుకొనివెళ్ళిపోతాడు. ప్రకాశ్ రావు విరిచూపుమానూ నిలబడి వుంటాడు. పిల్లవాడికి ఫిట్సు వస్తుంది. శాంతిచేసుకుని అలాగే నిలుచుకుంటాడు.)

సీతమ్మ: అయ్యో! అయ్యో!! విశేంటిలా కొయ్యబారిపోతున్నాడు. అయ్యో! అత్తయ్యా, అయ్యో!

రంగమ్మ: కొత్త నాటకం చేసిందేమో. వింటలా హడావిడిచేస్తావు? (దగరకొచ్చి ముట్టుకుని పెద్దగా ఏడుస్తుంది) అయ్యో, నాయనా! ఎంత అర్థాయుష్షువాడివి పుట్టావురా! నీకింత తొందరగా కాలం తీరిందని అనుకోలేదుగదరా! మురళీ! తండ్రీ! నా చిన్నితండ్రీ ఇంకెవరు బామ్మఅని పిలుస్తార్రా! దీపావళికి కొత్తబట్టలడిగితివి గదరా! టపాకాయలు కొమ్మంటివి గదరా! ఇప్పుడెవరు అడుగుతార్రా నాయనా, ఎంత అన్యాయంచేసి పోయినావురా, మురళీ మురళీ!

(అంతవరకూ నిశ్చలంగా ఉన్న ప్రకాశ్ రావు వెర్రి నవ్వుతో జుట్టు పీక్కుంటూ లేసాడు. అందరు అతన్ని ఆశ్చర్యంతో చూస్తారు.)

రంగమ్మ: (కొడుకుని కావలించుకో బోయి) రా నాయనా ప్రకాశం. నీకిగతేం దిరా. వేలెడంత వెనకోసం నాకడుపులో చిచ్చు పెడతావురా? ప్రకాశం.

సీతమ్మ: ఇంకేమి, మీరనుకున్నంత పని అయింది.

రంగమ్మ: ఓ పిసినీ అంతేలే పట్టుకొని పోను. నువ్వు అడుగుపెట్టిన కొంపకు శని పట్టిందే. బంగారంలాంటి నా బిడ్డను నీవు ధారగ్రహీతం చేశావే.

సీతమ్మ: కానివ్వమ్మా కన్పింతా తీర్చుకో. (ప్రకాశరావింకా నవ్వుతూనే ఉంటాడు. నవ్వు ఆపి.)

ప్రకాశ్: రే నాయనా, మురళీ ఇదిగో మందుతీసుకో, బాబూ, ఇలా. మా మంచి మందు తెచ్చానమ్మ, మా నాన్న గదూ. ఒక్క గుటక వెయ్యి, అగుగో మాతీ అలా ఏడిస్తు వుంటావేం.ఇలా మారాం చేస్తే నీకు ఒక్క చిక్కుపుడా పెట్టను, అన్నీ బొమ్మలే ఇచ్చేస్తాను. నాతండ్రికదూ బంగారుకొండ వులా ఆగకేయి నీజ్వరం మాయమౌతుంది. వద్దా నాయనా. నీకు చిక్కులూ వద్దా, టపాకులూ లేవని కోపమొచ్చిందా! ఏ మేడ్ మీదా అమ్మాయని చెంపి వెంటనే టపాకులు తెప్పించుకోలేకపోతే మురళీ ముందు ప్రాగటబ నిస్తాగా. ఆ కేయిలో డబ్బులున్నాయి. వెంటనే వంతు ఇక్కడున్నట్టు రమ్మనిచెప్పు, కొత్తబట్టలు కొనాలన్నావుగదు నాన్నా. రేపు కుట్టిస్తాను. నీవేది కావాలంటే అది ఇస్తాను. మీనాన్న ఇకనుంచి డబ్బు సంపాదించేమార్గం తెలుసుకున్నాడు. న్యాయంగా ఉంటే గడవడం కష్టం. నీ తండ్రికి తెలివొచ్చింది. ఇక మా మురళిని బంగారంలో ముంచి ఎత్తుతాను. నాయనా, ఒక్కసారి ఊఁ అను కన్నా తెరు. ప్రాగకేంరా మందు. పాపాణమెపోయావా? మందిప్పించలేదని కోపమా? చిక్కులు కొనివ్వలేదని అలిగావా? చెప్పు నాయనా, ఏంకావాలి నీకు (కదిలించి) అహిహిహి అలిగిపోయావా? నాయనా, దిగ్విత పోయావా? ఇక ఎన్నటికీ కంటికి కానవా? నీబుజిమాటలు వినిపించవా? నీ తండ్రి పెంచడం చేతగాని కటికదరిద్రుడని తెలుసుకున్నావా? మురళీ నిజమేరా—నువ్వు నిజం గ్రహించావురా? నేను దరిద్రుడను. చేతగాని దద్దమ్మను. (జుట్టు పీక్కుంటాడు.) నవిపోతాడు.) కొంచెం సేపటికి వెర్రి నవ్వు నవ్వుతూ లేస్తాడు) దరిద్రంట...దరిద్రం. ఇంకేం చెయ్యగలను నువ్వు! నువ్వు! నువ్వు నన్ను ఏడిపించాలని చూశావు. ఇదిగో నీకలగా దడి. చూసుకో ఎలా నవ్వుతున్నానో (విరగబడి నవ్వుతాడు) ఇక చాలా? ఎంత నవ్వానో చూసు. జాగ్రత్త నిప్పులో తలగాటముదాను. నీకంటే అరితేరిన ఘటాన్ని నేను. (మళ్ళీ నవ్వుతాడు) ఎవరిది విజయం. చెప్పకోండిక. ప్రకాశాన్ని ఏకీభవించన చెయ్యలేదు. గెలుపునాది. ముమ్మాటికీ నాదే. (వెర్రిగా నవ్వుతాడు. మళ్ళీపడిపోతాడు. కొంచెం సేపటి తర్వాత లేచి వంటింట్లోకి వెళ్తాడు. గిన్నెలు విసిరివిసిరి పారేస్తా) అమ్మ ఇదిగో నీకంచుగిన్నెలు, నీ మాయను. భద్రంగా దాచుకో, వెతికి పెట్టుకో. మళ్ళో ముట్టుకో. కార్పొని ఛాంచెయ్యి. రేపు వస్తే నీతో టాప్పేవని వే. భద్రపరచుకో. ఇకనీ నీకు నామురళీ నాకు (తొందరగా వచ్చి సీతమ్మ చేతుల్లోంచి మురళిని భుజాన వేసుకొని వెళ్ళిపోతాడు.) ★

నాన్న వొద్దన్నాడు

'నిన్ను ఇంటికి దిగబెట్టా లేమిటి?' అడిగాడు సూర్యం కాంతాన్ని.

'అక్కరేదేమిటి మరి?' అంది కాంతం.

"ఇదేం బావుందేం నీతోటి తిరగడమైనా మానుకోవాలిగాని. మీ ఇల్లు ఆకొసనీ మా ఇలు ఈ కొసనీ. ప్రియాని వచ్చేటి దగువు తున్నావ్; పదనిమిదేళు వెళ్ళి యుంటావు, మైనార్టీ వెళ్ళి వోటింగు హక్కు వొచ్చేటట్టున్నా సినిమానించి ఒక్కర్తి ఇంటికి వెళ్లలేవుట. నిన్ను చూసి అభ్యుదయ స్త్రీ లోకం సిగ్గుపడుతుంది," అన్నాడు సూర్యం.

"పరవాలేదు అభ్యుదయ స్త్రీలోకంలో అందరూ ఆడవాళ్ళేగా సిగ్గుపడినంత మాత్రాన్ని ఆడదానికి పోయిందేమీ లేదు పద.'

"అయితే దిగబెట్టక తప్పదంటావు?'

"అవా! తప్పదు."

"ఇది ఘోరం నిన్నిప్పుడు గాంధీనగరం దిగబెటి నేను అక్కణ్ణించి జగన్నాథపురం వెళ్ళేసరికి పన్నెండూ అవుతుంది. అప్పుడలి ఆకలేజి మెతుకులు తిన్నా! ఆడదానివి గదా నీకొక్కంచెం గూడా జాలి లేదేమి?'

"పోనీ మాయింటికొచ్చి భోంచేసి వెళ్ళు కాదన్న వారెవరు?"

"నీ అయిడియా లన్నిట్లాగే వుంటాయి యిది అన్యాయంగా వుంది. మీ యింట్లో తిని వెళ్ళివాకేరేజిలో అన్నం అవతల వారెయ్యనా? ఎందుకొచ్చిన పలహోలం పోనిద్దు"

'పోనీ హారీసం యిచ్చు లేకపోతే మళ్ళీ కడుపునిండా తిందూ!

'బావుందేం. రేపట్నుంచీ నీతో తిరగడమే మానుకుంటాను. నన్ను ఇవాళికి రక్షించి నువ్వు రిక్షా ఎక్కు. నే నిలా పోతాను. ఇంతట్లో నీకేమీ మానభంగమైపోదులే—'

'అంతేలే-సినిమా ఎంజాయ్ చెయ్యడానికి నేను నీ కొక్కవాలి. ఇంటికి దిగబెటడానికి ముట్టుకు నాకు మనవ్యక్తులేను. ఆహాహా! మీ మొగజాతి గుణం చూపించావులే'

'ప్లీజ్ కాకవకొళం లేని విషయంలో ఎందుకలా విస్తారంగా మాట్లాడతావ్? చెప్పినట్లు విను. రేపు మళ్ళా కలుస్తారా!'

చివరికి కాంతాని రిక్షా వాణ్ణి. రిక్షావాడికి డబ్బులిచ్చి హెచ్చరిచ్చి సూర్యం ఇంటి ముఖం పట్టాడు.

అతనికి ఆశ్చర్యం వేసింది.

కాంతి మెవరు, తనెవరు?

కాంతి మెవరో తనకింకా పూర్తిగా తెలియదు.

తను మోటారు ట్రాన్సుపోర్టు కంపెనీలో గుమాస్తా. అయిదు నెలకిందటే యీ వూరొచ్చాడు. హోటల్లో తింటూ లాడ్జిలో వుంటున్నాడు.

మూడెల క్రితం పోక బట్ట తలాయన పార్శిలాఫీసుకి వొచ్చి ఏదో పార్శిలు రాజమండ్రీ పంపిస్తూ ఫారం నింపకపోగా, తను అడిగిన ప్రశ్నలకి సమాధానాలుకూడా చెప్పకుండా తనకేసి చూస్తూ కూచుండి పోయాడు. ఉండుండి, 'అబ్బాయీ, నీపేరు రామసూర్యనారాయణ కాదూ?' అనేశాడాయన. సూర్యం టపీ

మని కలం టేబిలుకేసి కొట్టాడు...కొత్తవాడైనా లక్ష్యపెట్టక "ఎవడండి చెప్పేశు మీకూ?" అన్నాడు. తనకా పేరంటే వొళ్ళుమండి యూనివర్శిటీకి డబ్బు కూడా కట్టి మారుస్తు అని మార్చుకుంటే ఇంకా ఈయనెవడో రామ సూర్యనారాయణా బుచ్చి సుందర సుబ్బరామయ్యా అని పిలుస్తాడేమిటి?

అయన వూరుకోలేదు. 'ఎవడో చెప్పేదేమిటి? నీ అష్టభద్ర పాత్యం, పేరంటే సూర్యం అని మార్చుకుండొచ్చుగానీ అష్టభద్ర సుందరంగా చెయ్యలేవుగదుటోయ్ నువ్వు! లాయరు వెంకట్నారాయణ గారి కొడుకువి కాదూ?" అంటూ ఆయన సగం సేపు బోలెడు నవ్వేసి, సగంసేపు బోలెడు చెప్పేసి కొసకి మీది మాదీ ఒకవూరే అన్నాడు.

ఆ కథ సూర్యానికి తెలీదు. ఎందుకంటే సూర్యం వాళ్ళనాన్న, 'లా' అయిపోగానే విశాపట్నం వెళ్ళిపోయేరు ఏకంగాను.

'కాని నాకు మీ అన్నదమ్ములిద్దరూ గురే, మీ నాన్నగారుండేటప్పుడు—అంటే సరిగా అయిదేళ్ళకిందట నేను విశాఖపట్నంలో మీ యింటికొచ్చి పదిహేను రోజులున్నాను.'

తిప్పచేశాడు గాబోలు, కేసుగెల్చిందో లేదో, నాన్నగారింతే. కేసుగెల్చినా గెలవక పోయినా, క్లయింటు ఫీజిచ్చినా ఇవ్వక పోయినా, క్లయింటు బ్రాహ్మడైతే చాలు, ఇంట్లో పెట్టి మేపేవాడు.

అందుకే ఆయన గోదావరి జిల్లాలో మాగాణి అంతటినీ అమ్మేసి మరీ పోయినాడు.

'వోనూవుండు. మాయిలు గాంధీనగరంలో మీరూ మేమూ కావలసిన వాళ్ళం. ఇప్పుడంటే లేదు గానీ మీ నాన్నగారుండేటప్పుడు మనకి రాకపోకలుండేవి' అంటూ ఆబట్టతలాయన తన ఇంటి ఆనవాళ్ళు చెప్పి వెళ్ళాడు.

ఆబట్టతలాయన కూతురే కాంతం.

పద్దెనిమిదేళ్ళుంటుంది గాని, అదిమనస్సైతే వుంటుంది. వోళు మాత్రం కనీసం యిరవై ఏళ్ళది. అతనీ దాంతో మనకేమిటి-అహం. సంగతొచ్చింది గాబట్టి, అనుకోడం.

తను సుబ్బారావుకోసం గాంధీనగరంలో వీళ్ళింటి పక్క వీధి వేపు వెళ్ళడం, ఆవేళ ఆయన వీధి గుమ్మంలో నిలబడి మళ్ళీ అరికాలుమంట నెత్తికెక్కేటట్టుగా అబ్బాయ్ రామసూర్యనారాయణా' అంటూ [illegible] పోయేకూడకటు పలకరించుకుంటూ గుమ్మం దిగి 'దుమీదికి రావడమూ - సూర్యానికి బాగా జ్ఞాపకం. ఇంకా చాలా రోజులు జ్ఞాపకం వుంటాయి కూడానూ.

వాళ్ళాయిడని కొడుకులిద్దర్నీ కూతుళ్ళిద్దర్నీ చూశాడు సూర్యం. రామ సూర్నారాయణ్ణి వాళ్ళందరూ చూశారు. ఈ రామ సూర్నారాయణన్న పిలుపు ఆ వేళ వాళ్ళి



నిరీక్షణ

—చిత్రం: అచ్యుతరావు]

★ నాన్న వొద్దన్నాడు ★

చ్చిన కాఫీలో తీపికన్నా మొహం మొత్తింది. దాంతో పదిరోజులపాటు అటు వెళ్లడమే మానేసి సుబ్బారావునికూడా కలవలేదు.

ఒక్కొక్కళ్ళ పరిచయం అలా మొదట్లోనే వికారిస్తుంది.

ఆ పదిరోజుల తరవాతానూ;

'యామండోయ్, రామమూ...'

ఆడగొంతుక. నడిబజార్లో పెద్దవాల్యూములో ఎవరైనా వినుతారు. దాన్లో తప్పేంలేదు.

పాపం, 'రామనూర్నారాయణ' ఆగేడు. సైకిలు దిగేడు.

అబ్బబ్బ. ఈ కాకినాడ ఆడపిల్లలు ఎంత ధైర్యస్తులు! అనుకున్నాడు వెనక్కి తిరిగి చూసి—అరుగో ఆ వేళ బంతులా గున లేదూ, ఆయన కూతుర్లావుంది. పేరేమిటి చెప్మా అంది, ఆఁ, కాంతం. కాదు; గట్టిగా 'ఏమమ్మా వెంకటలక్ష్మి సూర్యకాంతమూ'! అనాలనిపించింది; చెప్పొద్దూ!

ఇంటికి వెళ్ళేగాని వొదిలిందిగాదు.

అంతేగాదు. వాళ్ళనాన్న లేడూ, ఆయన చేసేపన్లకి అర్థంవున్నట్టు కనిపించదు. మొన్న పదిరోజులకిందట అత్తారుగా కట్టుకుని లోపలికి తీసుకుపోయి ఊటిఫినూ కాఫీ అరగిస్తేగాని విడిచిపెటలేదు. కాగా, ఇప్పుడు కాంతం తీసుకువెళ్లాక కాసేపు మాటా జేసి వంటేస్తే వొయేదానికి మళ్ళీ పాపం పెళ్లాన్ని శ్రమపెట్టాడు. కాఫీ పెట్టమని కొడుకు చేతికి డబ్బులిచ్చి హోటలుకి పంపబోతూవుంటే సూర్యమే అడ్డొచ్చాడు.

దాంతో విడిచిపెడితే బాగానేవుణ్ను. అతను తిన్నగా ఆ మాటా యీ మాటా మాటాడుతూ బజారుకనివొచ్చి, జగన్నాథపురమూ వొచ్చేసి, తనలాడ్జీ మానీ, పెదవి విరిచి 'ఛఛ్ఛ, లాభంలేదు. మా యింటికొచ్చెయ్. ఓగది కాళీచేసిస్తా. ఆఫీసుకి దగ్గర' అన్నాడు.

ధనుపడ్డంతా అయింది!

అయితే—ఆ మర్నాడు.

సుబ్బారావు సినిమాలో కనబడి, 'ఏంరోయి, రావడం మానేశావ్?' అనడిగాడు.

'ఛ్ఛ ఏం లేదురా!'

'నాకు తెలుసురా! నిన్నా లచ్చయ్య బాగా పటేసటున్నాడే!'

'ఏ లచ్చయ్యరా?'

'అదే—మా వీధిలో—'

అసలైంది!

'ఛ్ఛ, ఏగి ఇంకా—?'

అంతే సుమండీ! అక్షరాలా ఈ నాలుగు ముక్కలే—.

మర్నాడు లచ్చయ్యగారు స్వయంగా కంపెనీ ఆఫీసుకి వొచ్చేరాగు! 'అబ్బాయ్, నీతో మాట్లాడాలి' అన్నారు.

'మాట్లాడండీ!' అన్నాడుతను.

'ఇక్కడెలాగ? బైటికిరా!'

ఏమిటో, ఆఫీసురూంలోలేని సీక్రెటీ రోడ్డు మీదొస్తుందా? ఇంట్లో మొగుడున్నాడని సంతికెళ్ళి బటకట్టుకుందిట—.

ప్రొప్రయిటరుగార్నడిగి రోడ్డుమీద్దాకా వొచ్చాడు సూర్యం.

అయింది, అనుకున్నంతా అయింది చప్పున అడిగేస్తాడు. గాబోలు.

అంతకంటే చప్పున చేశ్చెయ్యమంటాడు గాబోలు దేవుడా, ఈ ఆంధ్రకన్యలకేం గతి పటింది! వాళ్ళతోబాటు మాకూ—

'నిన్ను మా ఇంటికి తీసుకెళ్ళడం, మా వాళ్ళకి పరిచయం చెయ్యడం, నీలాడికి సేను రావడం. మాయింటికి మారిపోమనడం ఇవిచూసి నువ్వు ఏమయినా అనుకున్నావా బాయనా?' అన్నాడాయన వొక్కబిగిన,

'చెప్పండి—' తెగొందుకు ముందు కూటాడం!

'చాలా పొరపాటు నాయనా! వృద్ధిలోకి రావల్సిన వాడివి—వెంకట్నారాయణగారంత పెదలాయన కడుపున పుట్టినవాడివి—అన్నిటికీమించి పాతికేళ్ళువెళ్ళి నూటపాతిక రూపాయలు తెచ్చుకుంటున్న వాడివి—ఈ ఆలోచన నీకే కలిగిందా లేక యింకెవరన్నా చెప్పారా అబ్బాయీ!'

శివశివా! హరిహరీ!

'నీకు మా అమ్మాయినిచ్చి పెళ్ళిచేద్దామన్న వుద్దేశంతో నేనిన్నాళ్ళు పరిచయం చేసుకున్నా ననుకున్నావా, వెర్రినాయనా! ఎంత తప్పది!'

డామిట్! కథ అడ్డంగాతిరిగింది! ఏదో చెప్పి కొనుక్కోవాలి.'

'ఛీఛీ!—నాకలాంటి వుద్దేశం లేదండీ!—అసలు నేనలా అనుకోనేలేదు. అలా అనుకోనేలేదు అలా అనుకోడానికింకా ఏదీ, మీరు...' అని గాభరా పడిపోయాడు సూర్యం.

'గాభరాపడకూ; తాపీగా ఆలోచించు! నేనిదే 'సెంట్' చేసి చాలా ఇనస్యూన్సు నేనూ, బాగా బతుకుతున్నవాణ్ణి. అంత నీచానికి దిగుతానని ఎలా అనుకున్నావోయ్? అసలలాంటి వుద్దేశమే నాకున్నట్టయితే, మీ అమ్మగారున్నారు, మీ అన్నయ్యగారున్నారు; వార్ని సంప్రదించకుండా ఏదేనా చేసేటంతటి వెర్రివాణ్ణి కాదు నాయనా! చూడూ, నా వయస్సెంతుంటుంది!...?"

'యాభై...' అని గొణుక్కున్నాడు సూర్యం.

'యాభై కాదు యాభై అయిదు! ఈ అయిదేళ్లలోనూ నేను క్రమపద్ధతిలో చెయ్యని వొక్క పని, ఒక్కటి!—ఎవర్నయినా చూపించమనూ! అలాటిది నేను మేరేజి అంత ఇంపార్టెంటు థింగుని ఇలా వొంకరగా అడ్డదారంట నడిపిస్తానా! డోన్టు డ్రీమ్ లెక్టట్—'

ఎరగనుకున్నారూ? ఆయన తనని అడ్డమైనప్పుడూ ఇంటికి పిల్చుకోడమూ, కాఫీలూ టిఫినూ యిచ్చేసూ వుండడమూ, ఇంట్లో ఎదిగిన అమ్మాయుండడమూ చూసి ఆయనిలాటి అభిప్రాయంతో వున్నాడని తను అనుకున్నాడూ? ఇంకా అనుకున్నాడో లేదో! ఇదేమిటీ తుఫాను!.



అలంక

—చిత్రకారుడు : యం. డి. నెల్‌సన్]

ఏమయినాసరే అతన్నిహా రోడ్డుమీద కూటాడనివ్వకూడదు!

సెంటాం అదోలా పెట్టేసి సూర్యం, అతన్ని అసహ్యించుకుంటున్నట్టుగా (లేకపోతే ఆగేట్టు లేదు!)—.

'అయ్యా! మొన్నటివరకూ మీరెవరో నాకు తెలీదు. తెలుసుకుందామని నేను ప్రయత్నమూ చెయ్యలేదు—ఇంతకీ మీయింటికి నేను రెండుసార్లే కదా వొచ్చానూ! మీ అమ్మాయిని ఇప్పటిదాకా తలెత్తయినా చూడలేదు. అలాటిది నేనీ వుద్దేశంతో వున్నానని మీరెలా అనుకున్నారు?—లేక పోనీ మీకెవరు చెప్పాడు?—చెప్పండి నా జోడొక్కటి చిరగేస్తాను!—తొక్క నార తీస్తాను!' అన్నాడు.

'ఏమో. నేనీవుద్దేశంతో వున్నానని నువ్వనుకుంటున్నట్టు తెలిసింది. అని చాలా పొరపాటయినటువంటి అభిప్రాయం. అటువంటి అభిప్రాయంతో అయితేమటుకు నువ్వు మాయింటికి రావద్దు, నేను మీఇంటి దగ్గరికి రాను. స్నేహితుల్లా అయితే సరే...' అని అర్ధాంతరంగా వెళ్ళిపోయాడు.

దాంతో గొడవొదిలిందని సంతోషించాడు—అవును. ఇదో గొడవకింకే వుంది

★ నాన్న వొద్దన్నాడు ★

ఈమధ్య మరీ ఈరకంపేట ఎక్కువయిపోలేదూ, తనూ అలాటిదే ఇదనుకున్నాడు. ఎలాగో ఒలాగ పీడ విరగడైందిగదా అనుకున్నాడు.

కాని దాంతో వొదిలిందా?

ఈ గొడవయిన మూడో నాడు—

సుబ్బారావుని చూసి వొచ్చేస్తుంటే మళ్లీ కాంతానికి దొరికిపోయాడు సూర్యం.

‘ఏమండీ, మాయింటికి రావడం మానేశారూ?’

‘ఛ్ఛ! ఏంలేదూ.’

‘రండి. మా నాన్నకి జరం, నిన్నట్నుంచీనూ’—

‘ఓహో, అలాగునా?’

‘అయితే లోపలికి రాదల్చుకోలేదా అండీ?’

‘ఛ్ఛ, ఎందుకురానూ, (నాకప లీలా రోడ్డుమీద మాట్లాడ్డమంటే చిరాకూ.)’

దసాదేమిటి—రోడ్డుమీద నిలబెట్టి మొగాణ్ణి ఇంట్లోకి రారా అని అడుగుతూ వుంటేను—పైగా అదుతీరిపోయిందిగా!

కొట్టొను డాక్టరుదగిరకి కుర్రాణ్ణి సైకిలు మీదెక్కించి తీసుకెళ్ళమందుకుపంపించాడు. బజారుకెళ్లి కుమారీ బ్రెడ్డూ, బత్తాయి కాయలూ పట్టుకుని తనే గాంధీనగరం వెళ్లేడు.

అలా జరం తగ్గేవరకూ రోజూ వెళ్లేడు.

భోగట్టా లివి:—

వాళ్ళింట్లో ఎవరు చేసినా కాఫీ బాగుండదు.

కాంతంఅనబడే ఈ అమ్మాయికి పెళ్లేమీ కాలేదు గాని అవొచ్చుట. ఎందుకంటే వీళ్ళకి బావొకడున్నాడు. అతను వీళ్ళ మేనత్త కొడుకేను. అంతా అయిదేళ్ళకితం వుద్యోగం కోసం బెంగుళూరు వెళిపోయి ఎందులోనో పనిచేస్తున్నాట్ట. వాళ్లమ్మ నాన్నా కూడా కాంతాన్ని చేసుకుంటారట. (అక్క,కోడలు గాను.) కాని ఆ కుర్రాడే, (బావ,) ఈ అయిదేళ్ళబట్టీ రాజమండ్రీ సంవత్సరానికో సారొచ్చి పదిహేనురోజులుంటున్నా కాకినాడ ముచ్చటకేనా రాలేదుటా.

అయినా సరే వాడు దీన్ని పెళ్లాడుతాట (వాడికి దీన్ని స్తారట).

ఆడుతాడు గాబోలు. ఆడినా ఆడకపోయినా సూర్యం ఆసక్కరేదన్నమాట.

(అంచేత లచ్చయ్యగారా వుద్దేశంలో లేరన్నమాట.)

కూతుళ్లిద్దరూ కొడుకులిద్దరికంటే పెద్దవాళు. అయినా అందరూ మంచివాళ్ళు. వాళ్ళు ‘బొత్తిగా యీకాలపువాళ్ళు’. వాళ్లకి ‘వాళ్ళమ్మకీ నాన్నకీ వున్న చాదస్తమూ, పీనాసితనమూ లేవు’

అందరోకి కాంతం తెలివితేటలయిందే గాక నిర్మొహమాటంగా మాట్లాడుతుంది. దానికి చదువుతో సంబంధంలేకుండా లోకజ్ఞానం పెరిగిందట. కాంతం తనకంటే చిన్నదిగదా అని అండీ అనడం మానేసి ఓ పావుగంట చూసి తనూ నువ్వు నువ్వనడం మొదలెట్టింది.

ఇది వొకందుకు మంచిదే ననుకున్నాడు సూర్యం కూడానూ.

పెళ్ళిగురించీ ఉద్యోగంగురించీ కాంతాని కున్న అభిప్రాయాలు సూర్యం చాలాఆసక్తితో విన్నాడు.

‘మా బావా మేమూ చిన్నప్పటింలో ఇదిగా వుండేవాళ్ళమూ, పెద్దయ్యాక యేం వెలగబెడతాడో అనుకునేవాళ్ళం. వాళ్ళ నాన్నా అమ్మా ముత్తింకి విద్యోవో యద్యోవో చేసి కాకినాడకే కలెక్టరయిపోతాడన్నంత మురిసిపోయీవాళు. ఇంతా బెంగుళూరువెళ్లి అక్కడ మెకానిక్కుట. ఏం మెకానిక్కులో, మద్రాసూ, బెంగుళూరూ మెకానిక్కు అనంటే ఏదో పెద్ద ఉద్యోగంకాబో లనుకోడం-వాళ్లు అక్కడ చేసేపని మేకులు ఊడదియ్యడం, స్క్రూ డ్రైవర్లు త్రిప్పడంమ్మా. ఇక్కడ వీళ్ళు మా వాడు మెకానిక్కంటే మా వాడు ఫిటరనుకొని మురిసిపోడం. ఏడాదికోసారి ఏం వొస్తాడో వాళ్ల దగ్గిరికి—మిగిలిన యాడాదిపొడుగులో మనియార్డరే కాదు ఉత్తరం ముక్కైనా రాయడు. రాజమండ్రోస్తే గంజికుంటలో పొర్లాడినట్టు ఇరకాటంగా వుంటుందిట. ఎప్పుడో పొరేడు కామోసని నేనంటే మా అత్త అదేమిటే అలా అంటావని నొచ్చుకుంది. మా అత్తకి మెకానిక్కంటే తెలీదనుకో.—’ అంది ఓ సారి పూర్తిగా చేతులూ బుర్రా ఆడిస్తూనూ.

‘అయితే నీకు మీ బావంటే ఇష్టం లేనప్పుడామాట చెప్పరాదు!’ అన్నాడు సూర్యం, చూదామని—వాళ్ల చెల్లెలూ పెద్దతమ్ముడూ వున్నా లక్ష్యపెట్టక.

అవును! ఒకవేళ కాంతమే తనని ‘లా’ చేస్తే!

తను ఆ అపాయంనించీ తప్పుకోవాలి. ఎందుకంటే మామయ్యగారి (అదే, లచ్చయ్యగారి) నోరు మంచిదిలాదు.

‘ఎందుకిష్టంలేదూ! ఇష్టంలేదని పైకనడం ఎందుకు! అందువల్ల మరికొంత నోరుదండగ. ఇవా అక్కణ్ణించీ ఎందుకిష్టంలేదో ఏమిటో అన్నీ వొస్తాయి. -ఎందుకొచ్చిన గొడవలే- ఇష్టానికేముంది - నాలుగు రోజులు కలిసి మెలిసుంటే అదే వొస్తుంది ఇష్టం.’

(62-వ పేజీ చూడండి)

ఆంధ్ర మహాభారతము

ఆదిపర్వము - షష్ఠాశ్వాసము

క. నానావిధమార్గణముల, నానామార్గముల నేసి నం గురువీరుల్
వానిం జూచి భయంపడి, నానాతనుఁగా మనంబునఁ దగచి రనిన్.

వ. ఇట్లు పాంచాలుబాణవృష్టికి నిలువోపక కురుకుమారులు కుమారశరనిహతసురారికుమారులుంబోలె వెఱచఱచి పాండవులయొద్దకుం బఱతెంచినం జూచి యర్జునుం డాచార్యధర్మజులకు నమస్కరించి మీర లింద యుండుం డే నీక్షణంబ యప్పాంచాల్యుం బట్టితెచ్చెద నని విజృంభించి సంరంభంబున భీమసేనుండు దనకు సేనాగ్రచరుండుగా మాద్రేయులు రథచక్రరక్షకులుగా ద్రుపదరాజవాహినీసముద్రంబు దఱియం జొచ్చిన

క. కరిఘటలఁ దాఁకి భీముఁడు, గరటతటీకుంభబింబకరముఖముల జ
ర్జరితములఁ జేసె నిష్ఠుర,తరవజ్రనిపాతపటుగదాఘాతములన్.

ఉ. దారుణ మౌ వృకోదరుగదాకులిశాహతి సన్యవాహినీ
వారణసంచయం బభినవక్షతజారుణధార లొప్ప సం
చారితధాతునిర్ఝరవిశాలశిలోచ్చయసంచయాభమై
వీరరణంబునం బడియె విక్షతహస్తిపవృక్షపంక్తితోన్.

చ. అనిలజుఁ డుగ్రుఁ డై ద్రుపదు హస్తిఘటావలి నశ్వసంహతిన్
ఘనరథకోటి భగ్నములుగా సమరంబునఁ జేసి పేదదు
ర్జనులఁ జంపనేల యని మానుగ గోపుఁడు గోగణంబులన్
గొనకొని రొప్పునట్టు లధికుం డగిచెం బృథుదండహస్తుఁ డై.

స్రగ్ధర. అంతం గౌంతేయుఁ డత్యాయతయశుఁడు నరుం డల్గి పాంచాలుదంతి
ధ్వాంతంబుల్ వానివాహోత్తమతుహినతతిం దద్భటోదారతారా
సంతానంబుల్ శరాంశూచ్చయవిభవమునన్ శాంతిఁ బొందించి యుద్య
ద్ధ్వాంతారాతిప్రభుం డై తనరుచు వెలిఁగెం దద్రణవ్యోమవీథిన్.

క ఆతనిఁ జూచి సహింపక యాతతకార్ముకుఁడు ద్రుపదు ననుజుఁడు శౌర్యో
పేతుఁడు సత్యజితుం డను, నాతఁడు ధీరుఁ డయి తాఁకె నతిరభసమునన్.

క. కడఁగి ద్రుపదానుజుఁడు నె,వ్వడిఁ గవ్వడి నేసె నూఱు వాఁడిశరములం
గడు నలిగి వాని నన్నియు, నడుమన తునియంగ నేసె నరుఁ డస్త్రములన్.

క. వివిధాస్త్రకోవిదుఁడు పా,ర్థవి వానిరథంబుఁ బార్ష్ణిసారథుల సహిం
చువలువడ జేసె నుగ్రా,హవమునకును వాఁడు విముఖుఁ డై చెడి పఱవన్.

వ అంత

క. శరమోక్షణవేగనిరం,తరకుండలితోరుచాపదండుఁ డకాండో
ద్ధురదండధరుఁ డనఁ బోలెను. హరిసంతను, డాఁకె ద్రుపదుఁ డత్యుద్ధతుఁ డై.

మ. పరమాస్త్రవిశారదుల్ బలయుతుల్ పాంచాలకౌంతేయు లొం
డొరులన్ మార్కొని యేయుచున్నపుడు తదీయోగ్రాజిరంగంబు దు

స్తరనీరంధ్రనిశాతసాయకతమ స్సంఛన్న మైనం బర
స్పరయుద్ధంబులు దక్కి యోధులు నిశా భ్రాంతాత్ములై రచ్చటన్.

అర్జునుఁడు ద్రుపదుం బట్టి కట్టి తెచ్చుట

వ. అట్టి మహాద్వంద్వయుద్ధంబున విజిగీషుండయి పాంచాలుండు పాండవమధ్యము ధనుర్మధ్యంబు భగ్నంబుగా నొక్కబాణంబున నేసి యార్చిన నలిగి వాసవసుతుం డుద్యతాసిహస్తుండయి శైలస్థలంబుమీఁదికి లంఘించుసింహంబునుం బోలె ద్రుపదురథంబుమీఁదికి లంఘించి వానిం బట్టికొనినఁ దత్సైన్యంబు హాహాధ్వను లెసంగ మహార్ణవంబునుం బోలె మ్రోయుచుండె నంత.

క. ప్రక్షీణదర్పు ద్రుపదు ర,థాక్షముతోఁ గట్టి తెచ్చి యర్జునుఁడు క్రియా
దక్షుం డయి గురునకు గురు,దక్షిణ గా నిచ్చి చేసె దత్సమ్మదమున్.

వ. ద్రోణుండు నర్జునుచేసిన పరాక్రమంబునకుఁ బరమహృష్టహృదయుండై ద్రుపదుం జూచి నగుచు నిట్లనియె.

క. వీ రెవ్వరయ్య ద్రుపద మహారాజులె యిట్లు కృపణు లయి పట్టువడన్
వీరికి వలసెనె యహహా మ,హారాజ్యమదాంధకార మది వాసెనొకో.

ఆ. ఇంక నైన మమ్ము నెఱుఁగంగ నగునొక్కొ, యనుచు నుల్లసంబు లాడి ద్రుపదు
విడిచి పుచ్చె గురుఁడు విప్రులయలుకయుఁ, దృణహుతాశనంబు దీర్ఘమగునె.

వ. ఇట్లు ద్రుపదుండు ద్రోణుచేత విముక్తుండయ్యుఁ గోపపాశబద్ధుండయి యప్పరిభవంబునకుం బ్రతీకారంబు సేయ నమకట్టి బ్రాహ్మణోపాస్తి సేయుచుండె నిట ధృతరాష్ట్రుండు యుధిష్ఠిరు రాజ్యభారధురంధరుంగా నెఱింగి భీష్మవిదురులతో విచారించి యౌవరాజ్యాభిషిక్తుం జేసిన

చ. నలువురు దమ్ములున్ బలిమి నాలుగుదిక్కులు నోర్చి సర్వభూ
తలమున రాజనందనుల దర్ప మడంచుచు భూరివస్తురా
సులు గొని వచ్చి యీఁ గొని విశుద్ధయశోనిధి యొప్పె ధర్మజుం
డలఘుఁడు యౌవరాజ్యయుతుఁ డయ్యును బెంపున సార్వభౌముఁ డై.

వ. మఱియును.

క. బద్ధపరంపర నొప్పె మ,దోద్ధతగజరథతురంగ యుద్ధముల గదా
యుద్ధమునఁ జూడ నెందుఁ బ్రసిద్ధుఁడు మధ్యముఁడ యను విశిష్టస్తవముల్.

చ. అనుపమకార్ముకాదివివిధాయుధవిద్యలయందుఁ గోవిదుం
డనఁగ నజయ్యుఁ డై పరఁగు నర్జునుఁ బోలఁగ నన్యు లెందు లే
రనుజనఘోష ముచ్చరిత మయ్యె మరుచ్చలితోచ్చవీచిని
స్స్వనముఖరాబ్ధి వేష్టితవిశాలమహీవలయాంతరంబునన్.

క యము లమితశౌర్యు లరినృపయము లమలచరిత్రనిరతు లనఁగా నత్యు
త్తమభక్తి నన్నలకు విన,యము మెఱయుచు నుండి రధికులై బహుకళలన్.

వ ఇట్లు పాండుకుమారు లపారగుణంబుల నెల్లవారికి నారాధ్యులయి పరఁగుచున్న నందుధనుర్విద్య నర్జును దృఢముష్టిలాఘవలక్ష్యవేధిత్వదూరాపాతజితశ్రమత్వంబులకు నసిగదాశక్తితోమరాదిప్రహరణప్రవీణతకుం బరమహీపాల పరాజయోత్పాదన పరాక్రమంబునకుఁ దనవలని భక్తిస్నేహంబులకు మెచ్చి భారద్వాజుండు వానికి బ్రహ్మశిరంబను దివ్యబాణంబు సప్రయోగనివర్తనంబుగా నిచ్చి యిట్లనియె.

ఉ దీని నగస్తి నాఁ బరఁగు దివ్యమునీంద్రుఁడు దొల్లి ప్రీతితో
భూనుత యగ్నివేశుఁ డను భూరిమునీంద్రున కిచ్చె వారలున్
మానుగ నాకు నిచ్చిరి క్రమంబున నేనును నీకు నిచ్చితిన్
దీనికి నీవ యర్హుఁడవు తేజమునం గడుఁ బెద్ద గావునన్.

గెలుపు ఎవరిది?

కత్తిపీటతో కాకరకాయలు తరుగుతూ, కోటుకళ్ళ కామాక్షి, కమలలోచనుడు కామేశ్వర్రావువైపు కొరకొరా చూసింది.

కామేశ్వర్రావు వొళ్ళు భగభగా మండింది. వంకీలజుత్తు విర్రవీగుతూ వయ్యారంగా వదనంమీద పడేటట్లు చేసుకొని, అర్ధాంగి కామాక్షివైపు తిరిగి వాలుకతో వెక్కిరించాడు.

కామాక్షి కోపంపట్టలేక పోయింది. కామేశ్వర్రావు అర్ధాంగి దుడుకుతనాన్ని క్షమించలేక పోయాడు.

కోపంతో కామాక్షి కాకరకాయని కసిదీరా రెండుగా కోద్దామని ప్రయత్నించే తొందరలో వేళ్లు రక్తమయం గావించుకొంది.

కామేశ్వర్రావు 'బాగా జరిగిం'దంటూ పకపకమనబోయి వికవికా నవ్వేడు.

కామాక్షికళ్లు ఫాలాక్షుని నేత్రాలను గుర్తుకుతెచ్చాయి. అంతలోనే జలజలమని ప్రవహించే సెలయేటిమాదిరి బొటబొట మంటూ కన్నీరుధారలై, అందాలుచిందేటి చిన్నారి మోముపై నృత్యం చేయసాగింది.

కామేశ్వర్రావిది గమనించీ గమనించనట్టూరుకున్నా, అతని హృదయంమాత్రం చివుక్కుమంది. తాను అగ్నిసాక్షిగా పెండ్లాడిన కామాక్షి, అందులోనూ, కోరి, వరించి, తరించిపోదామని చేసుకొన్న తరళనయన తన కామాక్షి, తనవలపులదొంతి, ముద్దులమూట — కామాక్షి వేళ్ళు గాక, నిన్ననే రెండురూపాయలిచ్చి కొన్న కొత్త కత్తిపీట అంచులు 'రక్తపుచేరు'లలో తేలిపోతూంటే చూసి సహించలేక పోయాడు.

కాని, అంతలోనే తనకి నిన్న జరిగిన పరాభవం గుర్తుకొచ్చి, తన జాలినంతా దూదేకినట్లు చెదరగొట్టాడు. కాఫీ గడగడా త్రాగినట్లు జాలినంతా మ్రింగివేశాడు.

అవును! నిజమే!!

ఎంత పెళ్ళామైతేమాత్రం? దానికి కొన్ని హద్దుపద్దులంటూ ఉన్నాయి. దైవసమానుడైన తనను—భర్తను—అలక్ష్యం చేస్తుందా? దేవాన్నలక్ష్యంచేస్తే దైవకృప, దైవాన్నిధ్యం ఎట్లా లభిస్తాయి? కామేశ్వర్రావు దయార్ద్రహృదయుడు కాబట్టే పెళ్ళానికి దైవకృప, దైవసాన్నిధ్యం లభింపచేయాలనుకున్నాడు నిన్న ఉదయం ఎనిమిది గంటల అరవై నిముషాలవరకూ.

కానయితే, దైవికంగా జరిగిన సంఘటన ఆ అదృష్టాన్ని కొంటె చూపుల కామాక్షికి అందీయలేదు.

కామేశ్వర్రావు, కామాక్షిలలో ఎవరూ ఎవరికీ తెలివితేటల్లో తీసిపోరు. ఒకరినొకరు ఎగతాళి చేసుకోవటంలో నేమి, అర్థం చేసుకోవటంలో నేమి సమానులు. ఒకొక్కప్పుడు కామేశ్వర్రావుది పైచేయి అయితే, కామాక్షి మరో సందర్భంలో భర్తను మించిన తెలివితేటలు ప్రదర్శిస్తుంది.

వారం వారం చదివే పత్రికలలో రచయితలు కల్పించే సంఘటనలు అనేకం వారి జీవితంలో ప్రతిబింబించినాయి. చిలకాగోరింకలు పోరాడినా, కలిసినా లోకానికి చూడముచ్చటె మరి. కామాక్షి కామేశ్వర్రావుల

కొంపెల్ల గోపాలకృష్ణమూర్తి

తగవులాటలు ఆ చుట్టుపక్కల ఆడపడుచులకి గిలిగింతలు పెట్టయన్నా, యువకుల స్వప్నలోకానికి వారధి కట్టాయన్నా, ముద్దులొలుకు పూర్వస్మృతులేవైనా ఉంటే, వాటిని విజ్ఞప్తికి తెస్తాయన్నా, ఆశ్చర్యం అతిశయోక్తి ఏమున్నాయి? వీరిద్దరి సరస సల్లాపాలు ముఖ్యంగా పక్కవాటాలోని ముసలమ్మకి ముసిముసి నవ్వులు తెప్పిస్తాయి.

"అరి మీ ఇలు బంగారంకానూ! ఏం సరసాలు, గోపాలప్రా? మీరు గత ఏడు జన్మల్లోనూ భార్యాభర్తలై యుంటారు" అనేది అతిప్రేమతో. ముసలమ్మ దీవనలే మహద్భాగ్యంగా యెంచుకొనే కామాక్షి, కామేశ్వర్రావులు తమ కొలుబలకు నవ్వులతో, కేరింతాలలో ముగించి 'అవ్వ'కు బహుమతిగా ఒక అరకప్పు కాఫీ నివ్వజూపితే ఆవిడ నిరాకరించి, కామాక్షి చెవుల్లో యేదో గొణిగింది. కామేశ్వర్రావది వినాలనుకున్నా, ముసలమ్మ మహోగ్ర చూపులకి జడిసిపోయి గదిలో కుర్చీలో చతికిలబడి నిమ్మళంగా కూర్చుంటాడు.

"గత" రోజు ఉదయాన్ని తెచ్చి "అంత్రకితం" రోజు రాత్రి కామేశ్వర్రావు కామాక్షిని వెక్కిరించాడు.

"నిన్ను కట్టుకున్నందుకు నన్ను నేను 'వెధవా' అని తిట్టుకోవాలి. కాకపోతే పదమూడు మాసాల పన్నెండురోజులనుంచి సంసారం సాగిస్తున్న భార్యగారికి కూరలో ఎంత ఉప్పువేయాలో తెలీదూ? సరిగా వంటనైనా చేయటం చేతకాని లలనామణిని నా మెడకి ఉరిలా కట్టేడా మామగారు"

తన నంటేసరేగాక! తన తండ్రినంటే తానూరుకోగలదా కామాక్షి! దెబ్బకు దెబ్బ తీయాలనుకొంది. లేకపోతే ప్రతిరోజూ తన తండ్రిని తన భర్తతూలనాడటం తాను, తన చెవులలో విని, తట్టుకోలేదు.

సెలతిరిగే సరికి ఉఫ్ ఉఫ్ మంటూ ఊదే సిగరెట్టుకి ఉన్నదానిలో పదిరూపాయల ఎవఖయారు నయాపైసలు తగలేస్తే, ఆ కోటికి రుచేమి తెలుస్తుంది? ఈ వాళ సిగరెట్టు దమ్ము సరిగాపడలేదేమో! అందుచే శ్రీవారి కోపతాపాలు నవరసభరితంగా తయారుచేసిన వంటకాలమీద, ఆ వంటకాలు తయారుచేసిన ఆ రూపవతిమీద ప్రసరించేయి"

ఈ విధంగా బడబడా, గడగడా నూక్కలు పుత్రాడు పాతాళనొప్ప చెప్పినట్లుగా ధారాళంగా మాట్లాడిన కామాక్షి పలుకుల నాలకించినవాడై కామేశ్వర్రావు విస్మయమొందీ, మొందనట్లుగా ముఖం మరింత కోపాగ్నిని వెదజల్లేలా మార్చి ఒక్కకేక వేశాడు.

★ గెలుపు ఎవరిది? ★

"ఔనో! యమ్మయ్యో! నా డబ్బు, నేను కష్టించి, చెమటోడ్చుకొని, జేబురుమాలుతో తుడుచుకొని, సంపాదించిన డబ్బును, నా యిష్టం వచ్చినట్లుగా 'తగలేసుకొనే' 'హక్కు' నాకు జన్మతో నే సంక్రమించింది. మధ్య నువ్వెవరువన్ను ప్రశ్నించటానికి?"

"ఓ యబ్బో! కోతలెన్నైనా కోయవచ్చు. చేసుకోబోయేముందు కాబోయే మామగారిదగ్గర ఏడు వేల ఏడువందల డెబ్బైయేడు రూపాయలు కట్నరూపంగా పుచ్చుకొన్నదేగాక, వియ్యపురాలు లాంఛనాలనీ, బంధుమిత్రులకు కాఫీ, ఉపాహారాలని, భాజాభజంత్రీ ఖర్చులనీ, నగారా నగారాలకి మరో మూడు వేల మూడు వందలు ఖర్చు చేయించి, అప్పుడుచ్చుకొన్న డబ్బుఅంతా 'బ్యాంకు'లో దాచిపెట్టి, ఇంకా యేమిటేమిటో మాట్లాడుతున్నారు! వెనక్కి తిరిగి చూస్తే మన "ఘనకార్యం" తెలుస్తుంది" ఇది కామాక్షి ఉవాచ.

ఈ కామాక్షి మాటలు కామేశ్వరరావు హృదయంలో "ఆరనిచిచ్చు"ను రేపెట్టి పోయి, శూలంలా గుచ్చుకొంది.

"ఇదిగో! ఆఖరిసారిగా చెపుతున్నాను. ఇష్టంవచ్చినట్లు మాట్లాడేటంటే నేనూరుకొనేది లేదు. నేనూరక పుచ్చుకున్నానా? జీవితాంతం ఒక ఆడదాన్ని ఏలుకోవటమంటే కేవలం పెళ్ళినాటి కట్నమే సరిపోతుందా? పిల్లా పీచూ పుటిన తర్వాత తెలుస్తాయ్ అమ్మాయిగారి తిప్పలన్నీ!"

ఇలా సంఘర్షణ రెచ్చిపోయి, చివరికి విడాకుల సమస్యవరకూ వచ్చింది. వచ్చిందే గానీ, ఆచరణలోకి రాలేదు. కథల్లో చెప్పబడేరీతిగా కామాక్షి పుట్టింటికి ప్రయాణమై మూనివేయటం, మరికొన్ని గంటలనంతరం కామేశ్వరరావు హృదయం కరిగి ద్రవించి కామాక్షిని "క్షమించు కామా!" అనటం ఇత్యాదులు నిర్విఘ్నంగా జరిగిపోయేయి! కానైతే కామాక్షికి తృప్తికలగలేదని చెప్పాలి. తనను, తన తండ్రిని చులకన చేయటం, మాటిమాటికి అవాకులూ చెవాకులూ ప్రేలటం ఆమెకి శాంతి కలగజేయలేదు. ఏమైనా ఆ నాటి యుద్ధంలో కామేశ్వరరావుదే విజయం.

భార్యాభర్తల ఈ జగడం ఎక్కడ మితిమీరి పోతుందోనని ప్రక్క వాటాలోని ముసలమ్మ ఆదుర్దాపడింది. తగూలాట సంధివరకూ వచ్చినా అన్యోన్య వైరభావం ఎక్కడ ప్రజ్వలిస్తుందోనని ఆమె భయపడింది. ఎలాగైనా ఇద్దర్నీ తిరిగి కలపాలనుకొంది. మరునాడు ఉదయం కామాక్షి తొందరగా లేవలేదు. గట్టిగా కేకలేస్తే ఎక్కడ భార్యతిరగబడి సమాధానం చెపుతుందోనని భయపడాడు కామేశ్వరరావు. అయితే కాఫీవేళకూడా మించిపోతోంది. గతరాత్రి సంఘటనవల్ల పాపం కామాక్షి అలసిపోయిందేమో ననుకొని, వేళదాటి పోతూండటంవల్ల ఇంట్లోవున్న వస్తువుల్ని గట్టిగా తన్ని శబ్దం చేయసాగాడు.

అయినా కామాక్షి లేవలేదు.

కామేశ్వరరావు కోపం మిన్నుముట్టి పోయింది.

అయినా శాంతించుకొని ఎవరితోనో మాట్లాడుతున్నట్లు గట్టిగా అరవడం ప్రారంభించాడు. అయినా కామాక్షి లేచే జాడలేవీ కానరాలేదు. కోపంపట్టలేక, కుర్చీని తలక్రిందుచేసి, కామేశ్వరరావు నడివచిగా 'వీరవరాహ భోజన ఫలహారశాల'కి చకచకా నడిచిపోయేడు.

ఇవంతా నిద్ర పోతుండానే, పోతూన్నట్లు నటిస్తూన్న కామాక్షి గమనిస్తూనే ఉంది. గతరాత్రి తనకి జరిగిన పరాభవం గుర్తుకొచ్చి, భర్తకి 'తగిన శాస్తి' చేయాలనుకొంది. 'ఆయన' ఓర్పు ఏమాత్రం ఉందో గమనిద్దామని నిద్రలోనే దొంగ ముసుగు కప్పుకొంది.

కామేశ్వరరావు వెళ్ళిన కొన్ని నిముషాల నంతరం కామాక్షి, అప్పుడే లేచినదానిలా ఆవలించి, ఒళ్ళు విరుచుకొని, దంతధావనాది కాలోచిత కృత్యాల నతిదిగ్విజయంగా నెరవేర్చేటప్పటికి గడియారం చిన్నముల్లు తొమ్మిది దంకెనూ, పెద్దముల్లు అరంకెనూ కౌగలించుకున్నాయి. అంతలోనే పెరట్లోకొచ్చిన ముసలమ్మ:

"ఏమిటే కామాక్షి! రాత్రి అంత రభస జరిగింది?" అంటూ తిష్టవేసింది.

"ఏం లేదు బామ్మగారూ! నేను చేసిన కూరలో నట ఆయనగారికి ఉప్పు ఎక్కువైందట! అందుకనే నా మీద ధాం ధూంలు" అన్నది కామాక్షి.

"పుర్రా ఔదో అన్నాడనుకో! నీవైనా ఊరుకో వద్దటే! ఉప్పు మరీను. ఉప్పు ఎయ్యి చెప్పు, లక్ష చెప్పు, మీ ఆయనకి నీ వంతమాత్రం తీసిపోవు. ఇంకా రెండాకు లెక్కువే చదివేవేమో తెలివి తేటల్లో..."

"............"

"అయినా ఆడవాళ్ళం.. మనం సర్దుకుపోకపోతే రజోగుణ ప్రధానుడైన పురుషునని లాభమేముంది!" అంది ముసలమ్మ భగవద్గీతను గుర్తుకు తెస్తూ.

"ఇంతకీ నాదే నా తప్పంతా! మీరు కూడా అలా అంటే......" "అది కాదే పిచ్చిపిల్లా......సరసానికైనా, విరసానికైనా, కోపానికైనా, తాపానికైనా కొన్ని నిబంధనలూ, ఆచరించవలసిన విధానాలూ ఉన్నాయి" అంది ముసలమ్మ గతం మదిలో ఒకసారి మెదలగానే.

ఏమిటండీ నిబంధనలూ, చట్టుబండలూనూ" అంది కామాక్షి విసుగ్గా.

"అలారా దారికి! చెప్తానువిను," అంటూ ముసలమ్మ కామాక్షి చెవుల్లో ఏదో గొణిగింది ఒక నిముషంసేపు.

"అది భర్తమీద కసి దీర్చుకోవడమంటే. అంతేగానీ, అతనిలో సమానంగా ఆడదాని కేక లేయగలనటే?"

"అబ్బ! నాకు సిగ్గేస్తుందండీ మీరు చెప్పినట్లు చేయడానికి" అంది బింగమాలితో కామాక్షి.

"లేకపోతే ఎవరు గెలిచేరో తెలుసుకోనే దటా? ఈ దెబ్బతో చూడు అబ్బాయి మళ్ళీ నిన్నెప్పుడైనా మాటలంటాడేమో?" అని ముసలమ్మబామ్మ వెళ్ళిపోగానే కామాక్షి ఇల్లంతా కలకలలాడేటట్లు తీర్చిదిద్దింది. 'ఆయన' విడిచేసిన సామాన్లు యథాస్థానంలో పెట్టి, చక్కగా వంటచేసి, అందాలొలికే తన మోమును లక్స్ టాయిలెట్ అనే సబ్బుతో మరింత తోమి, తరువాత కాటుకార పొడవు తగినంతగా దట్టించి, తదియనాడు చంద్రవంకను తలదన్నే సన్నని, చిన్న ఎఱ్ఱ తిలకాన్ని అందంగా నుదుటపెట్టుకొని, చక్కటి చీర నగనగాలను ధరించి "ఇంటికి దీపం ఇల్లాలే" అనే సూక్తిని గుర్తుకు తెచ్చేలా ముస్తాబైంది.

కామేశ్వరరావు కాలేకడుపులో మధ్యాహ్నం రెండు గంటలకి ఇంటికి చేరేసరికి కామాక్షి సర్వాభరణభూషితయై, రతీ అతి

ఆమె మనోరంజనమై, కిలకిల నవ్వుతూ, గాజులతో గలగల ధ్వనిచేస్తూ, గుమ్మముందు నిలచి ప్రాణనాథు నాహ్వానించే సరికి కామాక్షి భర్త కామేశ్వరరావు అమాంతం 'ఇది కలయా, వైష్ణవ మాయయా" అనే స్థితిలో పడిపోయేడు.

"రాండీ లోపలికి! అలా చూస్తారేం? మిమ్మల్నే!" అని అమృత ధార లొలికించే ఆరాంగి పలుకులకి సమ్మోహితుడై ఇంటి లోకి జొరబడాడు.

"ఈమె నా భార్య అందాల కామాక్షి యేనా? గత రాత్రి అపరకాళికా స్వరూపిణియై, నేటి ఉదయం ఎనిమిది గంటల ముప్పది నిముషములవరకూ మేల్కాంచని తన భార్య కామాక్షియేనా?" అని తర్క వితర్కాలలోపడి, సంబాళించుకొని, మంత్రముగ్ధుడై వంటింటిలో విస్తరిముందు కూర్చొన్నాడు.

"కాళ్ళు కడుక్కోలేదు. మళ్లా శుభ్రాలంటారు" అంది కామాక్షి!

"అవునవును. మరిచిపోయే"నని క్షమార్పణ చెప్పుకొనివచ్చి కూర్చొని, తృప్తిదీరా భోజనంచేసి 'ఆమె' అందించిన 'చిలకల'ను నోటిలోనున్న పండ్లక్రింద పడవేసుకొని, ముసిముసి నవ్వులు నవ్వుతూ 'ఏమిటివింత' అన్నటు కామాక్షి వంకదృష్టి సారించాడు.

కామాక్షి బదులు చెప్పక భర్త పక్క నిలబడింది.

"అలా కూర్చో" అంటూ బలవంతాన ఆమెను ప్రక్కనున్న కుర్చీలో కూర్చోబెడుతూ:

"ఏమిటి కథ?" అన్నాడు.

"ఏమీ లేదండీ! అంది కామాక్షి!

"అలా కాదు ఏదో ఉండి వుండాలి. ఫరవాలేదు చెప్పు. నేను నీ 'ఆయన'నేగా" అని కామేశ్వరావు అనగానే కామాక్షి తనమొఖాన్ని అదో 'సీరియస్'గా పెట్టి.

"ఎందుకు లెండి! మీ కంతా వేళాకోళమే" అంది.

"సరిసరి! వేళాకోళాలే! ఎప్పుడు, ఎక్కడ, ఏవరితో ఎట్లా ఏమి మాట్లాడాలో అప్పుడు అక్కడవారితో అట్లా మాట్లాడాలి నీలోనైనా అంతే. ఆ!" అన్నాడు తన వాక్చాతుర్యానికి తానే ఆశ్చర్యపోయాడు.

"మీరు నా మీద కేకలేస్తారు గానీ, ప్రక్క వాటా ముసలమ్మ ఎన్ని కూతలు కూసినా కుక్కురుమనరు. కూరలో కొంచెం ఉప్పు తక్కువైతే అది ప్రమాద వశాత్తూ జరిగింది. దానికి మీరెంతో రెచ్చిపోయేరు మరి ఆ ముసలమ్మ అసహ్యమైన కూతలూ, ఇంటా బయటా కూస్తోంటే అవి మీ చెవిని బడలేదా? లేక బడీబడనట్లు నటిస్తున్నారా" అని నాటిగానూ, ఘాటుగానూ కూడా ప్రశ్నించింది కామేశ్వరావు పెళ్ళామైన కామాక్షి,

"ఏమిటి నువ్వు మాట్లాడేది? నా కేమీ అర్థం కావటం లేదు. నీ గురించి పక్క వాటా ముసలమ్మ కూస్తోందా? ఏమని?"

"అబ్బ! ఏమీ తెలీనట్టు?"

"నన్ను చంపక చెప్పు ఏమందో తక్షణం వెళ్ళి..."

"చెప్పమంటారా?"

"అబ్బబ్బ. చెప్పు"

"చెప్పేస్తున్నానండోయ్. తర్వాత విచారిస్తే లాభం లేదు"

"ఏమీ విచారించను. నేను చాలా ధైర్యవంతుణ్ణి" అన్నాడు కామేశ్వరావు తన విశాలమైన వక్షాన్ని కామాక్షికి చూపుతూ.

"మరే!...మరే! ఆ పక్క వాటా ముసలమ్మంది... ఏమమ్మా కామాక్షీ! పెళ్ళయి పదమూడు మాసాల పదమూడు రోజులైంది కదా! మరి నీ కడుపున ఇప్పటివరకూ ఒక్క కాయైనా కాయలేదే యమ్మా మరీ విడ్డూరంగావుంది. చూశారా ఆవిడ దుడుకుతనం?" కామేశ్వరావు కొయ్యబారిపోయేడు. చెప్పండి గెలుపు ఎవరిది? ★

"అర్రె మీ అఘాయిత్యమూ!......ఆఖరికి ఇస్త్రీ పంచ కట్టుకునే తయారయ్యారూ పూజకు ?"

"—అంటే ఇస్త్రీపంట్లాం తొడుక్కోలేదనా నీ కోఅతి ?"

"అబ్బే! ఉల్లెన్ సూటు వేసుకోలేదని! లేకపోతే- నేను నిన్న చచ్చిచెడి మీ మడి పంచ ఉతికి ఆరవేశానుగదా-"

"మనసు నిశ్చలంగా వుండాలి గానీ మడి పంచేవిటి సరోజా?" అన్నాడు శేషగిరి సీరియస్‌గా.

"అబ్బో! ఎంత వేదాంతమో!" అని సరోజ నెమ్మదిగా, ఆయాసంతో నవ్వుతుంటే - పూలతో, పండ్లతో నిండిన చెట్టు చిన్న గాలికి అల్లలాడినట్లనిపించింది శేషగిరికి.

"సరేసరే! ఇహనయినా పూజకానివ్వండి!" అంటూ వంటింటివైపు రెండడుగులు వేసింది సరోజ.

"సరోజోయ్! సరోజ్! సంధ్యావందన పుస్తకం ఏమయింది..."

"ఘోరం! మహాఘోరం! పచ్చి బ్రాహ్మడై పుట్టి సంధ్యావందనం మరిచిపోవడం...... హుం...!"

"మరి పెళ్ళయిం తర్వాత ఈ రెండేళ్ళ కాలంలో పొరబాటు నయినా పంచపాత్రా ఉద్ధరిణీ ముట్టుకున్నావా?"

"ఇంతకూ మీ సంధ్యావందనానికి పెళ్ళి అడ్డొచ్చిందంటారు?"

"-అని కాదనుకో.-అయినా ఇవాళ వినాయక చవితికదా, రెండు మూడు రోజుల ముందు చిన్న వార్నింగ్ ఇచ్చివుంటే కాస్త రిహార్సల్లు వేసుకుని వుందునుగా!"

"ఆ! ఉంటారుంటారు!...ఇదిగో మీ గాయిత్రీగ్రంధం! ఆ ప్రక్కన వ్రతకల్పం, అక్షింతలు, గంధం, పూలూ వుంచాను. ఇటు ధూపమూ, దీపమూ..."

తల పైకెత్తాడు శేషగిరి. తడి ఆరని జుత్తును వదులుగా ముడేసుకుని, పట్టుచీర కొంగును నడుములో చెక్కుకుని లేతగా పసుపు పూసిన మొహంమీద వెలుతున్న కుంకుమబొట్టుతో నిల్చున్న సరోజను చూసి- 'గృహిణి అనగా ఈమెయే' అని నిర్వచించుకున్నాడు సరోజానాథుడు.

"పూజారి మహాశయా! నా వైపు మాడం మానేసి, దయచేసి ఆ జంధ్యాన్నిటు ఎడమ భుజం మీదుగా వేసుకుంటారూ?"

"ఏవిటీ..." శేషగిరికి అపుడుగాని బోధపడలేదు—తన జంధ్యం అపసవ్యంగా వుందని. జంధ్యానికి స్థానచలనం కలిస్తూ "క్షంతవ్యుడిని సరోజా క్షంతవ్యుడిని! ఏదీ ఈ జంధ్యం అలవాటు కూడా ఇటీవల తప్పిందిగా..."

"తప్పని దేవిటి లెండి! తమరు పూజ మొదలెట్టండి" అని అక్కడనుంచి సరోజ



రంగారావ్

వెళుతుంటే శేషగిరికి గ్రీష్మంలో హిమానీనదం గుర్తు వచ్చింది.

శేషగిరి పూజ ప్రారంభించాడు—కొండ మీద కెక్కుతున్న పాతబస్సులా.

రెండు రోజుల తర్వాత రాత్రి భోజనాలయ్యాయి.

"అయితే రేపు స్టేషనుకు వెళ్ళక తప్పదంటావ్ ?"

"అయ్యో రామా! మళ్ళీ మళ్ళీ అ మాటే అడుగుతారేం?"

"అబ్బే..." అని ఒక్క నిముషం పూరుకుని..."హూం! జీవితం ఎపుడూ హాయిగా ఎలా వుంటుందీ?" అన్నాడు శేషగిరి.

"ఏం? ఇపుడు మా అత్తయ్యగారు వస్తే అంత చేదుగా వుందేం?"

"ఇంకా నయం! మీ అత్తయ్యగారితో పోలిస్తే కాకరకాయలు చక్కెరకేళీ లనిపించవూ?"

"చాలాలెండి. ఆవిడ రాకపోతే మనకు ఆమాత్రం చేసిపెట్టేవాళ్ళెవ్వరూ ?"

"...ఏంవసుందో గాని...నాకుమాత్రం అదేదో అయిపోయి ఆ వెధవాయి బయట పడేదాకా మనసులో మనసుండదు సరోజా!"

"అయితే అబ్బాయే నన్నమాట ?"

"నిస్సందేహంగాను! మా కుటుంబంలో ఎపుడూ ప్రథమ సంతానం అబ్బాయితే సుమా!" అన్నాడు శేషగిరి సగర్వంగా.

"అవేం నాకు తెలియదుగాని- మా ఇంట్లో మాత్రం ఎపుడూ అమ్మాయితే పుడతారట!"

"అదిగో అదిగో! ఇక్కడకూడా ప్రతి పక్షం లేవదీస్తున్నావూ?"

"అబ్బే! అబ్బే! అబ్బాయే నను కుందాం గాని...ఇంతకూ పేరేం పెట్టదలచుకున్నారూ ?"

"పేరుకదూ! ఎన్నిక జరిగిపోయి, 'శ్రీసౌభాగ్యవతి'ని సీలు కవర్‌లో ఉంచడం అయిపోయిందితే!"

"అబ్బో! అంతలావు రహస్యమయితే తమతోనే వుంచుకోండి!" అని పక్కకు ఒత్తిగిల్లి పడుకోబోయింది సరోజ.

"అయినా సరోజా! తప్పొద్దున స్టేషనుకు నాతో బాటు నీవూ రాకూడదూ ?"

"రావాలనే వుందండీ! కానీ...రోజులు అవోవస్తున్నాయి గనుక ఎక్కడా తిరగొద్దాలూ, కుదుపులూ అవీ వుండకూడదని చెప్పిందిగా మిస్. భువనేశ్వరీ?"

మంచంమీదనుండి లేచివెళ్ళి చాపమీద పండుకున్న శేషగిరి స్వప్నసీమలో—ఆ రాత్రి—దొండపండులాటి అబ్బాయీ, దానిమ్మగింజలాటి అమ్మాయీ దాగుడు మూతలాడుకున్నారు.

—మరునటిరోజు పొద్దున్న—

అయిదుగురు పిల్లల్ని కన్న రిటైర్డు మాతా తిలకమూ, ఏదు పదులు దాటిన అనుభవజ్ఞురాలూ, అధునాతనత్వం అర్థమయీ నవీనత్వం వదిలిపెట్టని పూర్వసువాసినీ, సంతత్వానికి సగటున పది పురుళ్ళయినా పోయడం హాబీగాగలదీ, సరోజనాన్నకు వేలు విడిచిన చెల్లెలూ—అయిన సాత్రమా జగ్గమ్మగారు సెంట్రలు సేషనులో అడుగుపెటేంది.

ఆవిడతో బాటు $6' \times 2\frac{1}{2}' \times 1'$ సైజు ట్రంకు ఒకటి—దిగింది.

'అసలు రైలే రాకపోవచ్చు! అథవా రైలొచ్చినా ఆవిడ రాకపోవచ్చును'— అన్న ఆశాజ్యోతిలాటిదేదో వెలిగిస్తున్న శేషగిరి, ఆమెను గుర్తుపట్టి, ఆశాజ్యోతిని ఆర్పేసుకుని, ఎంగిలి మింగుతూ ఆవిడ ప్రక్కకు చేరాడు.

—"ఓ...వచ్చేశారే?" అన్నాడు శేషగిరి అనురాగంతో.

"ఆ!" అంది సామ్రాజ్యమ్మ. ఎలిజబెత్ రాణి, వారి అమాత్య ప్రభృతులు ఠీవి, గాంభీర్యం, గట్రా గురించి సామ్రాజ్యమ్మకు వృత్తాంతాలు తానే తెలుసుకుంటుంటారని ఆవిడ కనబడ్డారు—హిస్టరీ లెక్చరరు అంతనా.

"ఎవరికోసం చూస్తున్నావూ? ఇంకెవరయినా రావాలా?"

"ఇంకోడు రావడమెందుకూ? నేను చూస్తున్నది పోర్టరుకోసం..."

"ఓస్! ఈ ఒక్క ట్రంకుపెట్టికోసం పోర్టరా! అయినా మీ పట్నవాసంవాళ్ళు..." అన్న తన విమర్శలో మిగతా భాగాన్ని శేషగిరి కేంద్రవాడి ముందలానికి వదిలేసి, సామ్రాజ్యమ్మ ఆ ట్రంకును అవలీలగా శ్రీరామచంద్రుడు శివధనస్సును అందుకున్నట్టు—కింగ్ కాంగ్ పూలగుత్తి తీసుకున్నట్టు—చేతిలోకి తీసుకుంది.

"అరెరె! మీరు తీసుకోవడమేమిటి! నేనున్నానుగా—ఇలా తెండి!" అని గంభీరంగా ఆ పెట్టె నందుకున్నాడు శేషగిరి.

సామ్రాజ్యమ్మ ఆ ట్రంకును వదిలింది; ముందుకు కదిలింది.

శేషగిరి కుడిభుజం దగ్గిర వున్న బంతిగిన్నె కీలులో—బంతిభాగం గిన్నె భాగానికి విడాకులిచ్చేసినట్లనిపించింది. ఆ పెట్టె—అది పెట్టెనా! అందులో—నాలుగు పర్వతాలూ, రెండు ఇస్పూ, ఒక షటిల్ పాసింజరూ, ముగ్గురు టిక్కెట్టులేని ప్రయాణీకులూ కూచున్నట్లుంది.

పదారు గజాలు ముందాగి, వెనక్కు తిరిగి, సామ్రాజ్యమ్మ అడిగింది—"ఏమబ్బాయ్...వెనక్కు వస్తావేం? పెట్టె బరువుగా వుందేమిటి?"

"అబ్బే! ఇదేం బరువూ!" అన్నాడు శేషగిరి, అసలది గౌరవానికి ఉండవలసిన కనీసపు బరువుకన్న చాల తక్కువయిపోయినట్లు.

"ఆ! అదే నేనంటున్నది కూడా! అనవసరంగా పోర్టరుకు డబ్బు తగలేయడం దేనికి? అని సామ్రాజ్యమ్మ టికెట్ కలెక్టరు చేతికి టిక్కెట్టు నిచ్చేసి గేటుదాటింది.

శేషగిరికూడా ప్రాణాన్నంతా కూడదీసుకుని గేటును సమీపించాడు. జేబులోని ప్లాటుఫారం టిక్కెట్టును తీసివ్వాలన్న సదుద్దేశంతో ట్రంకును క్రిందికిదింపాడు శేషగిరి.

"ఫూల్!"

చేతుల్ని విదిలించుకుంటున్నాడు శేషగిరి.

"బ్లైండ్ ఫూల్!!"

శేషగిరి అదిరిపడ్డాడు; "ఎవ్వరూ—నేనా?" అన్నాడు, టిక్కెట్ కలెక్టరును చూసి.

"ఆ...మీరే!" అన్నాడా యువకుడు. కేవలం ఆ రెండుముక్కలూ చెప్పడానికని చాలకాలం నుండీ కాచుక్కూచున్నట్లు.

'సరే...అంటే అన్నాడు పోనీలెద్దూ! చేతిలో ఈ పెట్టె ఒకటివుండగా వాడితో పోరాటమెందుకూ?" — అనుకుని టిక్కెట్టునిచ్చాడు శేషగిరి.

"నాలుగువీశాల బరువున్న ఆ ట్రంకుని నా కాళ్ళమీద పెట్టబోవడంలో మీ ఉద్దేశం?" అన్నాడు టి. సి.

"ఉద్దేశమేమిటి హిందూదేశం! ఈ ట్రంకును ఓ పదిగజాలు మోయండి! ఉద్దేశాలూ—సద్దేశాలూ నాలుగు రోజులదాక మీవంక రావు" అని ట్రంకునందుకున్నాడు శేషగిరి.

సామ్రాజ్యమ్మ జట్కా ప్రక్కన నిల్చుని వుంది. శేషగిరి గేటుబయటకు అడుగులు వేశాడు.

'పావలా పడేసే పోరయరాదూ? సింజీ పోల్స్!' అని టికెట్ కలెక్టర్ ఘట్టిగా అనుకున్నట్టు వినిపిసే—'సోదరా! టీసీవరా! రేపాకవాడు నీ పాలిటి కిలాటి పిన్నిగార్లిద్దరు—చరిత్రాలు గెలి ట్రంకులతో పోర్టర్ల నమ్మ్యకోజాల వత్తు



కా!' అనుకున్నాడు శేషగిరి.

పచ్చిపడి కాయంగలేని పిన్నపాలై. చేతులున్నా లేవట్లయింతర్వాత, చెమటతో చొక్కా వీపుకు అతుక్కుని పోగా సామ్రాజ్యమ్మను చేరుకున్నాడు శేషగిరి. పెట్టె పమేయుడే. జట్కా ఎక్కారు.

—మూడో రోజు సాయంకాలం శేషగిరి ఆఫీసునుండి ఇంటికివచ్చాడు. గుమ్మంలో ఎదురయింది సామ్రాజ్యమ్మ.

"అబ్బాయ్...ఏమిటది?"

"పొట్లం!"

"అవి తెలుసు! అందులో ఏమున్నాయీ?"

"జహాంగీరులు!"

"ఎందుకూ?"

"తినడానికి!"

"ఎవ్వరు?"

"సరోజ!"

"ఆ—ఆ...అందుకనే నేనడిగింది—!" అంటూ సర్వజ్ఞత్వంతో హసించింది సామ్రాజ్యమ్మ, "ఇపుడు సరోజ ఇలాంటివి—అందులో హోటల్‌వి—తినకూడదు."

"—అలాగని డాక్టరేమీ చెప్పలేదే?" అన్నాడు శేషగిరి వచ్చి కోటు విప్పుతూ.

"దాని మొహం—అది చెప్పేదేమిటి! ఏదో నాలుగు పుస్తకాలు చదివేయగానే సరా?—"

శేషగిరి—ఆశ్చర్యంతో సామ్రాజ్యమ్మ వైపు తిరిగిచూశాడు—"అయితే మీకూ డాక్టరు ఘంటసేశ్వరి నచ్చలేదన్న మాట..."

"నచ్చడం ఏమిటి, నచ్చకపోవడం ఏమిటి! నేనిక్కడ వున్నంతకాలం ఈ డాక్టరు వచ్చినా రాకపోయినా పరవాలేదు." అంటూ సామ్రాజ్యమ్మ తన స్వానుభవాల్ని సామర్థ్యాన్ని సవివరంగా చెప్పసాగింది—"అ...కేవలం ఆ మంగలి అప్పమ్మ నేనూ వుంటేచాలు, ఎలాప్రసవమయినా విశేషంగా జరిగితీరవలసిందే! ఇప్పటికి కనీసం యాభై పురుళ్ళయినా పోసివుంటాను. తల్లీ పిల్లా సలక్షణంగా లేరని ఎవరినయినా చెప్పమను చూదాం—"

"—మీరే గనుక ఎం. డి. చదివివుంటే!" అన్న శేషగిరిని వినిపించుకోలేదు సామ్రాజ్యమ్మ.

"అందుచేత అబ్బాయ్! నా కెలాటి బెంగా అనవసరం! నేనున్నాను—"

"అయితే ఈ జహాంగీరులు మీరివాళ రాత్రి ఫలహారానికి వుంచుకోండి!" అన్నాడు శేషగిరి ఆమెమీద కలిగిన హఠాత్ ప్రేమతో.

"అవి అలా వుంచు...యిక, ఇంకోటుంది. ఎంతయినా మనం మానవులం..."

"అవునవును!" అన్నాడు శేషగిరి లుంగీ కట్టుకుని తువ్వాలు పైన వేసుకుంటూ.

"దేనికయినా మానవయత్నం చాలదు. దైవబలం కూడా వుండాలి..."

"ఆ వుండాలి వుండాలి"—'ఏదో ముసలావిడ అంటూంది, అననిద్దూ! పాపం ఈవిడను మొదట ఎంత అపార్థం చేసుకున్నానూ! ఈ ముసల ఇపుడు మనసుకు ఎంత ధైర్యం! ఆ ట్రంకులాటివి మూడు మోసినా ఈవిడ ఋణం తీర్చుకోలేను—' అనుకుంటున్నాడు శేషగిరి.

గాలిపటానికి దారం తెగింది; తటాక జలం మీద రాయిపడింది.—"అందుచేత... నేను ఈ మూడు రోజులనుండీ నీపోకడ చూస్తున్నాను. నీవేమో బోతగా దేవుడి ధ్యాసే లేకుండా వున్నావు. మరీ అంతనాస్తికుడిలా వుండకూడదు. కాబట్టి నామాట విను. రేపటినుంచీ పొద్దున్న ఆరింటికల్లాగో మేలుకో. శుచిగా స్నానం అదిచేసి లలితాష్టోత్తరంతో పూజ చేయి. ఏం? సాయంకాలం ఆఫీసునుండి రాగానే నాతో బాటురా! ఇద్దరమూ నవగ్రహప్రదక్షిణ చేసివద్దాం...ప్రతీ శుక్రవారము అమ్మవారికి—"

'నాన్సెన్స్!' అందామనుకున్నాడు శేషగిరి.

"—సరోజ పసిపిల్ల-పాపం. దానికిది మొదటి కానుపు! అంతా సుఖంగానే జరిగిపోతుందనుకో. అయినా ప్రసవం ఒక గండంలాంటిది. అది కాస్తా గడిచి తల్లీ పిల్లడూ క్షేమంగా బయటపడ్డానికి మనం ఎన్నివిధాల వీలయితే అన్ని విధాలా ప్రయత్నించాలి!" అని సామ్రాజ్యమ్మ ముగించేసరికి, శేషగిరికి ఆమెమీద బోలెడు భక్తి అదిరిపోయాయి. ఆమె వెనకాలే వంటింట్లోకి వెళ్ళి—" అయితే పిన్నిగారూ! ఆ నవగ్రహప్రదక్షిణ ఏదో ఇవాళినుంచే ఆరంభిస్తే—?" అని సూచించాడు.

"అలాగే కానిద్దాం ఏది...అమ్మాయి పక్కింటికెళ్ళిందీ - దాన్ని రానియ్యి"—

ఆరాత్రి.

"భక్తుడుగారు నిద్రపోయారేమిటి అపుడే?"

"మ! ఆట్టే ఎగతాళిచేయకు! అంతా... కాలమహిమ!" అన్నాడు శేషగిరి పైకి చూస్తూ.

"కాలమహిమ కాదు, 'అబ్బాయి' మహిమ!...పుటకముందే ఆడిస్తున్నాడు నాన్నగారిని!"

"వెధవాయిని చెవులు పిండేస్తాను! లెంపలు వాయించేస్తాను..."

నవ్వలేక సరోజ నవ్వుతుంటే, తలకిందికి పీటను తీసుకుని వసారావైపు విసురుతున్న సామ్రాజ్యమ్మ—" అమ్మాయ్ సరోజా! నెలలునిండిన దానివి-అలా నవ్వుతావేం... అయినా నిద్రపోకుండా ఇంత రాత్రిదాకా మేలుకోవడమా!" అని హెచ్చరించింది.

"అవునవును! పిన్ని చెప్పింది నిజం సరోజా. నీవు చాలజాగ్రత్తగా వుండాలి!"

"అబ్బో మా అత్తయ్యమాట జవదాటం లేదే మీరూ!" అని సరోజ అంటుంటే శేషగిరి లేచివెళ్ళి తనచాపను చేరుకున్నాడు.

—మరుసటిరోజు పొద్దున శేషగిరి ఆఫీసుకు వెళ్ళబోతుంటే సరోజ వచ్చింది. "నాకు రెండువున్నుల ఎర్రతోలు కావాలి!"

"వారం క్రిందటగా పది అవున్సులు తెచ్చి చ్చానూ?"

"దానితో ఒక పళ్ళాయి, రెండుజతల కుజోళ్ళు కట్టానుగా. పాతే అప్పటర్ మెడ ఎగిలిపోయి వుంది—అందుకనీ."

"సరే సరే!— రెండేళ్ళ నుండీ నీ ఎదుట నిలబడుతుంటే ఒక్క ముఖరయినా అలిచ్చిన పాపాన పోలేదుగానీ...అబ్బాయి పుట్టకముందే వాడికన్నీ సిద్ధంచేసి పారేస్తున్నావు! ఊం...అదృష్టం వుండాలి దేనికయినా!"

"అవునుపాపం! అదృష్టం లేనిది మీకే!—కదూ?" అని సగర్వంగా శేషగిరిని సాగనంపింది సరోజ.

ఆరోజు సాయంకాలం శేషగిరి ఇంటికొచ్చేసరికి అతడిగదిలో అతడివస్తువు లేవీ లేవు. గదంతా శుభ్రంగా చిమ్మివుంది. 'డెటాల్' వాసన వస్తూంది. గదిలో మంచమూ, చిన్న టేబిలు, ఓ ముక్కాలి పీట - ఇవన్నీ వున్నాయి! అతడి పుస్తకాలూ, హేంగర్లూ, టేబుల్ లైటూ, మడతకుర్చీ - అన్నీ హాల్లో వున్నాయి.

"సరోజా! ఏమిటిదంతా? నా గదిలో ఏదీ ముట్టుకోకూడదని ఎన్నిసారు చెప్పాలి? నన్నడక్కుండా నా వస్తువులన్నీ హాల్లో అక్కడా ఎవరు పడేయమన్నారూ?" అని కేక లేయసాగాడు శేషగిరి.

వంటింటినుండి సామ్రాజ్యమ్మ బయటకు వచ్చింది. "ఏ...అరవకు. అవతల గదిలో అమ్మాయి పండుకునివుంది! దాని ఆరోగ్యం ఏమీ సరిగా వుంది," అని సామ్రాజ్యమ్మ, సరోజకు విశాలంగా గాలీ వెలుతురూ రాగల గది కావాలనీ, బాత్ రూముకు దగ్గరగా వుండడం చాల అవసరమనీ - కారణాలన్నీ వివరించేసరికి శేషగిరి మారు మాట్లాడకుండా ఒప్పేసుకున్నాడా మార్పుకు.

—ఆరోజు రాత్రి సరోజ హార్లిక్సు పుచ్చుకుని పడుకుంది. శేషగిరి చదువుతూ చదువుతూ నిద్రపోయాడు.

"శేషగిరీ...లే..."

———

"శేషగిరీ...లేవమంటుంటే...!" శేషగిరి లేచి కూచున్నాడు.

"వెళ్ళి డాక్టరుని తీసుకురా..."

"ఇప్పుడేం డాక్టరూ..పడుకో సరోజా!" అన్నాడు శేషగిరి సరిగా కళ్ళు చెవులూ తెరవకుండానే.

"నేను సామ్రాజ్యాన్ని...సరోజకి నొప్పులు ప్రారంభమయాయి...త్వరగా వెళ్ళి డాక్టరుని తీసుకురా!"

"ఏమిటీ!" అన్న శేషగిరి లేవడానికీ, చొక్కా తొడుక్కుని మూడోవీధిలో వున్న డాక్టరు గుమ్మంలో నిలబడ్డానికీ మధ్య కాలంలో గడియారంలోని పెద్దముల్లు రెండుమీదనుంచి మూడుకు సాగింది. చిన్నముల్లు ఐదుదగ్గర తారట్లాడుతూంది.

నౌకరు డాక్టరింటి తలుపుతీశాడు శేషగిరి దూసుకుపోయాడు లోపలికి. డాక్టర్ భువనేశ్వరి వచ్చింది ఆవలిస్తూ—"హలో! రండి రండి! కూచోండి!"

"అబ్బే కూచోవడానికి వీలేదండీ! మా సరోజకు నొప్పులు ప్రారంభమయ్యాయి. మిమ్మల్ని వెంటనే పిల్చుకుని రమ్మంది మా పిన్ని..." అన్న శేషగిరికి నత్తివచ్చినట్లయింది.

"దట్సాల్ రైట్! నేను నిన్న సాయంకాలం అమ్మాయిని చూసినప్పుడే అనుకున్నాననలు! పోదాం—కూచోండి," అంది డాక్టర్ చిరునవ్వుతో.

"అబ్బే, చాల అర్జంటండీ...

"అవునవును. నాకు తెలుసు! ఇదిగో ముఖం కడుక్కుని ఇంత టీ—తాగి వచ్చేస్తా...ఆగండి." అని మిస్ భువనేశ్వరి లోపలికి వెళ్ళింది.

"సారీ...నీ! అక్కడ కొంపలంటుకుపోతున్నాయన్నా అంటే - టీ తాగి వస్తానంటుందేం! ఇదేం డాక్టరూ...ఈ సారి ఇదేదో అయిపోతే ఈమె మొహం కూడా చూడకూడదు," అని తీర్మానించుకున్నాడు శేషగిరి. అతనికి అక్కడ కూచో బుద్ధి కాలేదు. 'ఎంతకూ బయటకురాదేం ఈ పుణ్యవతి!' అని కునాని కోసారి విసుక్కున్నాడు.

"రిక్షా తెచ్చారా?..." అంది హాల్లోకి వచ్చిన డాక్టర్.

"రిక్షా...ఏదీ...ఓ...రిక్షా...అబ్బే... తేలేదండి!" భువనేశ్వరికి కాస్త చిరాకు కలిగింది: చిరాకులోనే చిరునవ్వు నవ్వింది.

"ఊ...సరే! మీ ఇల్లు - దగ్గరేగా! నడిచివెడదాం! దయచేసి ఈ 'బేగ్' పట్టుకొస్తారూ?" అంది డాక్టరు భువనేశ్వరి.

(47-వ పేజీ చూడండి)

నక్షత్రఫలితాలు

[25-2-59 మొదలు 3-3-59 వరకు]

బి. నరసింగరావు

గ్రహస్థితి.

శు కే		కు	
ర బు	మార్చి తే1 దిని బుధుడు మీనములో ప్రవేశించును. కన్య, తుల, వృశ్చిక మనుస్సులలో చంద్రుడు		
శ	గు		రా

* అశ్వని [చూ, చే, చో, లా] *

ఈవారము మీకు మొదట్లో నిరాశగా వున్నా మిత్ర సహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధన లోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్థులకు ఏమంత బాగుండదు విద్యార్థులకు బద్ధకమువల్ల చదువుసాగదు ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది వారములో అవయోగములున్నా మిత్రసహాయము కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తు సంపాదన, వంటి శుభ యోగములు కూడా వుంటాయి.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈవారము మీకు మిశ్రమయోగము. కార్యాచరణలో ఆటంకములు కలుగుతాయి. బుద్ధిబలమును ఉపయోగించి ప్రయత్నించి నను కార్యసిద్ధివుండదు. చేతికివచ్చే డబ్బు అవసరములకు సరిపోక ఇబ్బందిచే అశాంతిగా వుంటుంది. దూరమున్నున్న ఆత్మీయులకు అనారోగ్యముగా వున్నదని విని వ్యాకులపడతారు. ఐననూ దైవానుగ్రహముచే అన్నీ సరిపడతాయనే మనో నిబ్బరముతో వుంటారు. ఉద్యోగస్థులకు అస్థిమితము. వర్తకులకు ఆందోళన, 25,26,27 నిలకడలేని స్థితి, ప్రయాణము. 28,1,2 నష్ట ద్రవ్యప్రాప్తి, పుణ్యక్షేత్ర సంచారము దేవతా దర్శనము, వింతలను చూచుట, ఆరోగ్యచింత.

* కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ] *

ఈవారము అనుకున్నటుగా సొమ్ము చేతికి రాకపోవుటచేతను, ఖర్చులు ఎక్కువగుట చేతను, అశాంతికలుగుతుంది. కోర్టు వ్యవహారములు కొంతవరకు అనుకూలిస్తవి. ఉద్యోగస్థులకు అధికారుల తొందరలు. వర్తకులకు అశాంతి. భార్యకు ఆరోగ్యము బాగుండదు. వ్యవహారముల పరిష్కారములో దుష్ట స్త్రీలతో వివాదము విద్యార్థులకు చదువుపై అనాసక్తి, 25,26,27 కార్యభారము, త్రిప్పట, వివాదము. 28,1,2 ధనలాభము, కార్యసిద్ధి. 3 న ఆరోగ్యచింత.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

తలకు తగని పనులను పైని వేసకొని కార్యసాధన అవటప్పటికీ నిరుత్సాహ పడక, పట్టుదలతో ప్రయత్నించి, ఫలమును పొందుతారు. సోదర సహాయము కొంత అనుకూలత నిస్తుంది. ఉద్యోగస్థులకు అధికారుల చురుకు మాటలచే మనోవ్యధ కలుగుతుంది. అవసరాలు తీరనందున ఇంట్లో అశాంతి. ప్రమాదముల వల్ల గాయములు కలుగవచ్చును. రసాయనిక పదార్థములు, ఎరువులు వ్యాపారస్థులకు, గనుల యజమానులకు లాభము. 25, 26, 27 కార్యభారము, ఆటంకములు. 28, 1, 2 సోదరసహాయము, కార్యలాభము. 3 న ప్రమాదసూచన.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీకు యోగకాలము. బంధు సహాయము, అధికారుల సహాయము కలుగుట చేత ఆటంకములు గడచి కార్యసిద్ధి పొందుతారు. ఆదాయము వృద్ధి అవుతుంది. కవులు నూతన రచనలు చేస్తారు. బంధువుల క్షేమ వార్త తెలిసి సంతోషిస్తారు. విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలు కాలము.

* ఆరుద్ర [కూ, ఘ, ఙ, ఛ] *

ఈవారము మీకు మంచి భాగ్యయోగము. అనుకున్న డబ్బు చేతికివస్తుంది. ఇబ్బందులు తీరుతాయి. దావాలలో గెలుపు పొందుతారు పిల్లల బాగుకొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. న్యాయస్థాన ఉద్యోగులకు, న్యాయవాదులకు, పండితులకు, ఉపాధ్యాయులకు. మేలుకాలము.

* పునర్వసు [కే. కో. హా. హీ] *

ఈ వారము మీకు యోగదాయకము. ధనయోగము వుంటుంది. సంగీత సభలు, కవితా గోష్ఠివంటి వినోదాలలో పాల్గొని మృష్టాన్న భోజనము వెండిపాత్రలలో చేస్తారు. శుభ కార్యాలలో పాల్గొంటారు. నూలు, బట్టలు, బియ్యము, వెండివర్తకులకు లాభము. విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా యుంటుంది.

* పుష్యమి [హూ. హే. హో. డా.] *

ఈ వారము యోగదాయకముగా వుంటుంది. అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభకరముగా ముగుస్తవి. శుభ, పుణ్య కార్యాలలో పాల్గొంటారు. నూతన గృహ నిర్మాణమునకు ప్రయత్నిస్తారు. ఉద్యోగస్థుల హోదా పెరుగుతుంది. వర్తకులకు విలువగల వస్తువుల క్రయ విక్రయములలో ఎక్కువలాభము. వారమంతా శుభయోగములతో కూడియున్నా కుటుంబకలహముచే ఆందోళన కలుగుతుంది. వారాంతమున స్త్రీలతోనూ, మిత్రులతోనూ విందూ, వినోదము.

* ఆశ్లేష [డీ. డూ. డే. డో] *

ఈ వారము రాబడి ఎక్కువ. కార్యభారము ఎక్కువ. గృహోపద్రవములు తీరక స్పర్ధలు వసవి అనారోగ్య సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడము, రవికి శాంతిచేయడం మంచిది. ఉద్యోగస్థులకు క్రొత్త సమస్యలు, వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. వారమంతా ఆందోళనలతో కూడివున్నా పితృవర్గమునుండి సహాయము, కార్యలాభము కలుగుతవి.

* మఖ [మా మీ మూ మే] *

ఈవారము మొదట్లో నిరాశగాయున్నా మిత్ర సహాయమువల్ల కార్య లాభము అవుతుంది. ధనలోపమువల్ల ఆందోళన, యింటిలో వున్నవారి అనారోగ్యమువల్ల అశాంతి కల్గుతుంది. ఉద్యోగస్థులకు స్వల్ప అనుకూలత వర్తకులకు వారాంతమున లాభము. వారమంతా ఉద్రేకములో ఉంటుంది. విదేశీయుల పరిచయము, అపురూపవస్తు సంపాదన కలుగుతవి. 25, 26, 27 తేదీలలో అధిక ఖర్చులు, మనోవ్యధ.

ధరలు:

నూలు వస్త్రములు: మార్పు లేదు.
నూనెగింజలు: సమస్థాయిలో వుండును.
ఆహారధాన్యములు: మందముగా వుండును.
బెల్లము, పంచదార: స్వల్ప తేడాలో వుండును.
చింతపండు: తగ్గుదలలో వుండును.
పప్పుదినుసులు: మార్పు లేదు.
వెండి, బంగారము: స్వల్ప తేడాలో వుండును.

* * *

జన్మనక్షత్రమునుబట్టిగాని, జన్మ నక్షత్రము తెలియనివారు నామ నక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, వ్యాఘ్రుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అను పేర్లకు పూర్వాషాఢయున్నూ చూచుకొనునది.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
(మో, టా, టీ, టూ)

ఈ వారము తలంచిన సహాయము లభించక, అవసరములు తీరక, ఆందోళన కలుగుతుంది. అయినప్పటికీ దైవానుగ్రహమువల్ల కష్టములు గడచి కార్యసిద్ధి పొందుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ, వర్తకులకు చాంచల్యము దుర్వ్యసనపరుల సాంగత్యము వలన మనోవికారము కలుగుతుంది. వారమంతా అశాంతిగా యున్నా నవ ద్రవ్య లాభము పొందుతారు. 3 న అధిక ఖర్చులు.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

ఈ వారము అనుకూలతకన్నా ప్రతికూలత ఎక్కువ యిచ్చిపుచ్చుకొనేపట్లవివాదములువచ్చి, మనోవ్యధ కలుగుతుంది. కోర్టు వ్యవహారాలు అనుకూలించినా, అమిత ఖర్చుల వల్ల సంతోషముండదు. భార్యకు అనారోగ్యము కలిగే సూచనలున్నవి. మినుములు, కొర్రలు, రాగులు, ఉప్పు, నూవులు, నూనె, వ్యాపారస్థులకు లాభయోగము ఇతర జాతుల వల్ల గౌరవము కలుగుతుంది. 3 న బంధువుల రాక, అధిక ఖర్చులు.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము ఎంత ప్రయత్నించినా యత్నకార్యాలకు ఆటంకము కలుగుతునే వుంటుంది అయినప్పటికి పెద్దలవల్ల కార్య లాభము పొందుతారు. సోదరసహోదరులతో ఒడిదుడుకులు సర్దుకుంటాయి. దెబ్బలు తగిలే ప్రమాదములు జాగ్రత్తవల్ల తప్పవచ్చు. గనుల యజమానులకు లోహ, ఖనిజ, వ్యాపారస్తులకు, భూస్వాములకు, కష్టముతో గూడిన లాభము. పోలీసుశాఖ ఉద్యోగస్తులకు మేలుకాలము. 3 న ప్రమాద సూచన.

చిత్త [పే, పో, రా, రి]

ఈ వారము మీకు యోగదాయకము. ప్రయత్నించిన పనులు నెరవేరుతవి. ధన లాభము కలుగుతుంది. ఈశాన్య దిక్కునుండి క్షేమ సమాచారము తెలుస్తుంది శుభకార్యాలలో పాల్గొంటారు. బంధుదర్శనము, గణిత జ్యోతిష శాస్త్రచర్చలు జరుగుతాయి. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, ఇత్తడి, కంచువర్తకులకు లాభదాయకము. కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము. 3 న అధిక ఖర్చులు.

* స్వాతి [రూ, రే, రో, తా]*

ఈ వారము మీకు శుభయోగము. ఆశించిన డబ్బు చేతికి వస్తుంది. ఇంటో శుభకార్యాలు జరుగుతవి. పుణ్యకార్యాచరణ, ప్రభుత్వ సన్మానము, వైద్య జ్యోతిష శాస్త్రముల వంటి ప్రసంగాలు జరుగుతవి. విద్యార్థులు నూతనాంశాలు నేర్చుకుంటారు. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలుగావున్నా కొంత ఆందోళనకూడా వుంటుంది. పిల్లల అభివృద్ధికి కొన్ని యేర్పాటు చేస్తారు.

* విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము మీరు తలపెటిన కార్యములలో జయము పొందుతారు వెండి పాత్రలలో మృష్టాన్న భోజనము బంధుమిత్రులతో చేస్తారు. వినోదములలో పాల్గొంటారు. విద్యార్థులకు చదువు ఉత్సాహముగా సాగుతుంది. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి బియ్యము, పంచదార జనిత వస్తువులు— క్రయవిక్రయములలో వర్తకులకు లాభదాయకము. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. 3 న అధిక ఖర్చులు.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకు యోగప్రదము. ధన, ధాన్య వృద్ధి కలుగుతుంది. వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు. ఇష్ట వస్తు లాభము. పరోపకారమువల్ల కీర్తి కలుగుతుంది. విద్యార్థులకు చాలా చురుకుగా సాగుతుంది. ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులు అమితలాభము పొందుతారు. వాహనయోగములు కలుగుతుంది. కవులకు గాయకులకు, కళాకారులకు నటీనటులకు యోగకాలము 3,న కుటుంబ కలహము

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము కార్యభారము ఎక్కువ. వింతమాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ప్రయాణము, ధనలాభము వుండును. అకాల భోజనమువల అనారోగ్య సూచనలు కనబడగానే జాగ్రత్తపడుట మంచిది. ఉద్యోగస్తులకు స్వల్పఅనుకూలత. విద్యార్థులకు చదువు సరిగాసాగదు రాజకీయ నాగు

★ నక్షత్రఫలితాలు ★

లకు వారమంతా అలజడితో పాటు అనుకూలత. 8 న అనారోగ్యము.

*మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము తలపెట్టిన పనులు నెరవేరవు. అలక్ష్యము కలుగుతుంది. వర్తకులకు లాభము తక్కువ. ఆత్మీయుల ఆరోగ్యము చికాకు కలిగిస్తుంది. ఉద్యోగస్తులకు వనపర్వత ప్రాంతములకు బదిలీఅయ్యే సూచనలున్నవి. రహస్యములను కనిపెట్టుటకు నియోగింపబడుతారు. వారమంతా చికాకుగావున్నా వారాంతములో మిత్రసహాయము, విదేశీయుల పరిచయము, కార్యసిద్ధి జరుగును.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢా]

ఈ వారము ఫలాభావము ఎక్కువ. ఎవరి సహాయమువల్ల కార్యసాధన చేదామనుకుంటారో వారివల్లనే ఆటంకములు కలుగుతవి. అయినా దైవబలమువల్ల క్రమేణా కార్యానుకూలత అవుతుంది. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుండదు. ఉద్యోగస్తులకు ఒత్తిడి వర్తకులకు నిరాశ. విద్యార్థులకు మంచిరోజులు కావు. వారమంతా ఎంత ఆందోళనవున్నా, సాధుసజ్జన సాంగత్యము, పుణ్యక్షేత్ర సంచారము దేవతా దర్శనము, వింతలను చూచుట, వస్త్రద్రవ్య లాభము కలుగుతవి.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్నకార్యములు శ్రమాధిక్యముతో ఫలిస్తవి. కొందరు వాదాలు అనుకూలిస్తవి. పరోపకారానికి యత్నపడి పాగక నిందలు పొందుతారు. భార్య ఆరోగ్యము సరిగా యుండదు. ఇచ్చిపుచ్చుకొనేపట్ల వివాదములు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి వున్నా, తోటి వారి సహకారము లభిస్తుంది. వర్తకులకు వారమంతా నిరాశ. వారాంతమున లాభము. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* శ్రవణము [జూ, జే, జో, ఘా]*

ఈ వారము ఎన్ని అంతరములు వచ్చినా పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభము పొందుతారు. ఆశించిన ధనం సమయానికందక అప్పుచేస్తారు. ఆత్మీయులవల్ల నిందలపాలవుతారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, భూస్వాములకు, ఇంజనీరింగు శాఖ ఉద్యోగులకు, రంగులు, లోహపు సామానుల వ్యాపారస్తులకు, కష్టముతో కూడిన లాభము. శివ ప్రమాదభయం.

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈ వారము మీకు యోగప్రదము. బంధువుల సహాయముతోను, అధికారుల సహాయముతోను, ఆటంకములు గడిచి, ఫలం పొందుతారు. ఆదాయము వృద్ధి అవుతుంది. వైద్య జ్యోతిషశాస్త్ర ప్రసంగాలు చేస్తారు. ఈశాన్య దిక్కునుండి క్షేమము తెలుస్తుంది. విద్యార్థులకు మంచికాలము. కవులకు, శిల్పులకు, గణిత శాస్త్రజ్ఞులకు, నటీనటులకు యోగ కాలము. 28, 1, 2 తేదిలలో ధన లాభము, కార్యసిద్ధి.

* శతభిషం [గో, సా, సీ, సూ]*

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. ఆశించిన సొమ్ము చేతికి వస్తుంది. నూతన కార్యములు ప్రారంభిస్తారు. కోర్టు దావాలలో కొంత అనుకూలత వుంటుంది. పండితగోష్ఠి జరిపి నూతన విషయాలు తెలుసుకుంటారు. వారమంతా శుభయోగములున్నా కొంత ఆందోళనతో కూడివుంటుంది. 28, 1, 2 ధనలాభము. పుత్రుల అభివృద్ధి, కార్యసిద్ధి. 3-న అధిక ఖర్చులు. విద్యార్థులకు చదువు బాగాసాగుతుంది. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు పండితులకు, ఉపాధ్యాయులకు మేలుకాలము.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈ వారము వినోదములలో పాల్గొనుట, దధి, క్షీర మధురపదార్థయుక్త భోజనము రజతపాత్రలలో భుజించుట, తలచిన కార్యములలో జయము, నీటిమీద ప్రయాణము. తెలని వస్త్రములు కొనుట మొదలగుయోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము, ద్రవపదార్థాల క్రయవిక్రయములలో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు నటీనటులకు మేలుకాలము. వారాంతమున అధిక ఆందోళన.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా]

ఈ వారము ధన ధాన్యాభివృద్ధి, పశువృద్ధి, కృషిమూలకముగా లాభము, వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తు లాభము. పరోపకారముచేత కీర్తివంటి రాజయోగములుకలుగును. విద్యార్థులువినోదములలో పాల్గొన్నా చదువుబాగా సాగుతుంది విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు రెట్టింపు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. స్త్రీలతోనూ, ఆప్తులతోనూ విందు, వినోదము. 3 న కుటుంబ కలహం.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము మీకు కార్యభారము యెక్కువ. రాబడి తక్కువ. గృహోపకరణములు తీరక కలతలు. ఆరోగ్యము సరిగా లేని సూచనలు కనబడగానే వైద్యచికిత్స పొందడమే కాకుండా, గ్రహరాజైన రవికి శాంతి చేయించుటమేలు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు, వర్తకులకు ఆందోళన, విద్యార్థులకు చదువు సరిగాసాగదు. 28, 1 న పితృవర్గ సహాయము, కార్యలాభము. 3 న ఆరోగ్య భంగము, అధిక ఖర్చులు రాజకీయవాదులకు ఆలోచన. ★

★ జీవనలీల ★

(19 వ పేజీ తరువాయి)

ఎంత వ్యాకులపాటు అతడిమాటల్లో! ఆమాటలెంత జాలిగా వున్నాయి. కుసుమతో ఏనాటికైనా తానిలా మాట్లాడవలసి వస్తుందని ఏం తెలుసు? అవి వింటూంటే ఎక్కడలేని ఆశ్చర్యమూ కలిగింది కుసుమకి. ఒంట్లో బాగాలేదని ఆమె ముఖం చూస్తూనే తెలుస్తోంది. ఏమంటారు చినబాబూ? నాకై మీమనస్సు దుఃఖిస్తుందా?"

"చాలా దుఃఖిస్తుంది కుసుమా! అలా అయితే జీవితంలో ఎప్పుడూ సుఖించలేను నేను.

"అలా జరుగుతుందా ఎన్నడైనా! మీ రెక్కడ? నేనెక్కడ? నేను చాలా అల్పురాల్ని. నా మూలంగా మీకు జీవితంలో సుఖమనేది లేకుండా పోతుందా? రెండురోజులు పోయాక జ్ఞాపకం కూడా ఉండను నేను!" అన్నది కుసుమ వ్యాకులపడుతూ.

"ఇన్నాళ్లనుంచీ నన్ను నీ మనస్సుతో కట్టివేసుకున్నావు. రెండు రోజుల్లో మరిచిపోతానా నిన్ను? ఇదా నువ్వు అనుకుంటున్నది?" చివరికి కుసుమ—"మిమ్మల్ని కట్టివేసుకోవటం నాకు సాధ్యమా చినబాబూ?" అన్నది.

శశి కళవళపడుతూ—"ఆ విషయాలన్నీ ఇవాళ ఇహ అలా ఉంచు కుసుమా! ఇవాళ శుష్కప్రియాలతో గడిపి వెయ్యగల సైర్యం లేదు నాకు. నే నేమవుతాను అన్న సంగతి కూడా వద్దు. ఇన్నాళ్ళనుంచి నా కోసమని ఇలు వదిలి పెట్టకుండా ఉన్నదానివి హఠాత్తుగా ఇప్పుడిలా ఎందుకు మారిపోయావో స్పష్టంగా చెప్పు కుసుమా!" అన్నాడు.

"దానివల్ల కలతలొస్తాయి చినబాబూ! వెళ్లిపోయేముందు కలతలు పెట్టుకోవటం మంచిదా?"

"ఏమీ రావులే, చెప్పు?"

కుసుమ చిన్నబోయిన ముఖంతో—"మీకు ఏం చెప్పను చినబాబూ ఇంత తెలిసినవారికి! ఎర్రగా కాలి ఉన్న ఉక్కు ముక్కను అలా వదిలేసి ఉంచితే క్రమ క్రమంగా అదే చల్లారిపోతుంది. పోదూ? నాకేం పెద ఆశలు, ఆశయాలూ లేవు. నా సౌఖ్యాన్ని కూడా నే నేం కోరుకోవటం లేదు. మిగిలిన జీవితమంతా ఇంట్లో వాళ్ళకింత వండిపెడుతూ, వాళ్ళకి ఉపచారాలు చేస్తూ గడుపుదామనుకుంటున్నాను. అంతకంటె నాకు వేరే కోరికలేం లేవు. అంతా స్పష్టంగా తయారైంది చినబాబూ! 'మనసు విరిగింది' అనుకోవడం వింటూ ఉండేదాన్ని. అది యేమిటో ఇన్నాళ్ళకి అర్థమయింది. ఎవర్ని పిలుస్తున్నది మీరు చిన బాబూ! ఎవరు వచ్చేది మీకో? కుసుమ ఇంకా బ్రతికి ఉందా! చచ్చిపోయింది!..." అన్నది.

కుసుమ చచ్చిపోయింది చపలచిత్త, విలక్షణ స్వభావురాలు—సగంబాలిక, సగం ప్రౌఢ అయిన కుసుమ. శశి ఇంక ఏమీ ఎందుకు మాట్లాడలేదో అది దురూహ్యమే. ఆలోచించుకునేందుకు వ్యవధి తీసుకోవటమేమో ఆ మాటాడకపోవటం. కుసుమ ఇవాళ రేపు ఇక్కడే ఉంటుంది. మాటాడవలసిందేమయినా ఉన్నదా లేదా అన్నది ముందు ఆలోచించుకోవటం అవసరం.

ఒకటి రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచాక. ఇంటివైపుకి నడవబోయేముందు, "మీరు దేవుళ్లాంటివారు చినబాబూ!" అని మాత్రం అన్నది కుసుమ.

"మానవులు ముఖ్యమైన లక్ష్యం కోసం తప్ప మామూలుగా ఎక్కలేనన్ని అంతస్తులుంటాయి ఊహాసౌధానికి" – అన్న సంగతి శశి ఇంటికివచ్చాక అనుభవంలోకి వచ్చింది. ఒక్కొక్క సంఘటనే మనస్సులోని ద్వారాన్ని తెరుస్తూ ఉంటుంది. అన్ని ద్వారాలుంటాయని కూడా మానవుడు గ్రహించలేడదివరకు...శశిలోని ఇన్ని ఇన్ని ఊహలు, ఇన్ని కోరికలు–చిన్ననాటి ఊహలు యౌవనంలో అయినట్లు అన్నీ క్షణంలో ఎందుకూ కొరగాకుండా పోతున్నట్లున్నాయి. రబ్బరు చక్రాలుండే తోపుడు బండి ఎక్కాలని చిన్నప్పుడు ఎంత ఏడ్చాడతడు. ఇప్పుడు దానికి బదులు కలకత్తాలో కారెక్కి తిరగాలనే వాంఛ మిగిలింది. ఊరువదిలి ఎక్కడికివెడతాడు శశి? అతడి మనస్సును ఆకర్షించగలిగింది ఇతరత్రా ఏముంది? ఓ పెద్ద జడపదార్థం పృథివి. ముక్కూ మొహం ఎరగని మనుషులు.

అక్కడందరూ. శశికి అక్కడ ఏమిటి లభించేది? కుసుమ మాటల్లో గర్భితమై ఉన్న అర్థాన్ని శశి క్రమంగా పూర్తిగా గ్రహించాడు. ఒకరోజు–రెండురోజులు కాదు–ఎన్నో సంవత్సరాలు కుసుమ తనకోసమై పిచ్చిదై ఉంది. చివరికి క్రమక్రమంగా ఆమె వెర్రిప్రేమ నిర్జీవమైపోయింది. బహుశా చచ్చిపోయిందేమోకూడా: ఎవరు చెప్పగలరు? ఇవాళ ఈ సంఘటన శశికెంత భయంకరంగానైనా ఉండొచ్చు. కాని ఇదే సహజమైన పరిణామం. పల్లెటూరి సంసారి స్త్రీ కుసుమ.

మనస్సులోని కోరికలు అలతప్పి పోతూండటంతో రోజు రోజూ తనని శశికి నివేదించుకుంటూ వచ్చింది. ఇంతటి భయంకరమైన కుసుమ తుబ్బ్రేమ ఇన్నాళ్ళూ సజీవంగా ఉంటూ వచ్చింది. కనుక నే ఊహించలేనంత ఆశ్చర్యకరమైనది—అన్న సంగతి శశి ఇప్పుడు తెలుసుకోగలిగాడు. స్వతహాగా పుట్టుకొచ్చిన ప్రేమ సహజంగానే మళ్లీ చల్లారిపోయింది శశిని చూడకుండానే గడుస్తాయి ఇహరోజులు కుసుమకి...శశి లేకుండానే గడిచిపోతుంది. కుసుమ జీవితం...

కుసుమలోని పరివర్తన శశికి ఆశ్చర్యం కలిగించలేదు. ఇలు అంటుకున్నదంటే—బయటినిప్పు లోపలి నిప్పుకూడా ఆరిపోతుంది. కుసుమ మనస్సులోని జ్వాలమాత్రం ఎందుకు ఆరిపోకుండా ఉంటుంది? అతడి ఆందోళన అతణ్ణే ఆశ్చర్యపోయేట్లు చేసింది. ఇంక చెయ్యగలిగింది ఏమీ లేదని తోచినప్పుడు—జీవితంలో ఎంత అసంభవమనుకున్నదైనా సంభవం కానీయ్–కుసుమ మాత్రం ఇంకెన్నడూ—తనని ప్రేమించదు అన్న బాధ శశిని సతమతంచేస్తోంది. గాలిబుడగ ఉబ్బిఉబ్బి పగిలిపోయింది. కుసుమ చచ్చిపోయింది—ప్రత్యక్షంగా తన కళ్లయెదుటే తన పరధ్యానముందే!...ఎంత పని తనపుధ్యాసలోపడి తానిదంతా జరగనిచ్చాడు!

కుర్ర తనపు వ్యవహారాలన్ని ఇప్పుడూ ఉన్నాయి. శశి ఆస్పత్రికి వెళ్ళాడు. రోగుల్ని పరీక్షించి మందులు వ్రాసి ఇచ్చాడు. శస్త్ర చికిత్సకూడా చేశాడు ఒకరికి. పాంత్ గాంవ్ రోగుల్ని చూడటానికి వెళ్లాడు. ఎన్నాళ్లనుంచో ఇవన్ని చేస్తున్న శశి ఒక్కరోజు యంత్రంలా చేసుకుపోలేదూ? ఏదోధ్యాసలోపడి, కుసుముని గురించి ఆలోచిస్తూ – రోగుల్ని పరీక్షించి మందు లివ్వాలంటే అతణ్ణి ఎవరూ వారించలేరు. శశికి ఎందుకింత చికాకు? చావుకి సిద్ధమై ఉన్న రోగులమీద ఇలా విసుక్కోవడం ఎందుకు? ఇవాళ శశి మనస్సు ఎంత విచారంగా ఉందో–ఎవరికీ తెలిసేదికాదని. పట్టుకోలేయి ఓ రకంగా మంచిపనే చేశాడు శశి. సంసారి అయిన స్త్రీ-వ్రతం చెడకుండా సంసారిగానే ఉండిపోయింది.

నీతి, ధర్మం చెడకుండా మిగిలాయి. నిజానికిది ఒక రకంగా మేలుగా తోచవలసింది శశికి. ఇలాంటి పాత సంస్కారాలన్నీ శశికి ఒంట పట్టలేకేం? అయినా ఒకప్పుడు తాను కుసుమ ఎన్నోవిధాల నచ్చచెప్పాలని ప్రయత్నించినవే మరోవిధంగా ఇప్పుడనుభవంలోకి వచ్చాయనిమాత్రం శశికి ఒక్కసారైనా తోచలేదు. ప్రశాంతంగా విని వెనకాముందు ఆలోచించుకుని, ఆత్మనిగ్రహం అవలంబించమని చెప్పిఉన్నాడు శశి. కాని కుసుమ అంత చెవిని పట్టించుకోకపోయినా సునాయాసంగా పాటించబోతోం దిప్పుడా మాటల్ని.

—ఇంకా వుంది]

ఉపకారికి అపకారము

ఒక్క యడవిలోన చెట్లు
మిక్కిలి స్నేహమ్ముతోడ
ఆపదలో నున్నవారి
నాదుకొనుట కలవడినవి.

ఆ యడవికి ఒక్కనాడు
కోయవాడు ఒక్కరుండు
చేరియుండి కనులనీరు
చిందుచుండ గుందుచుండె.

'ఎందుకోయి కోయవాడ
కుందుచుంటి' వనిన చెట్లు
బదులు చెప్పెనిట్లు కోయ
భూరుహాల చెంత నిలిచి:

"నాదు గండ్రగొడ్డలి 'పిడి'
లేదు-ఎచటో జారిపోయె.
గొడ్డలియే నా బ్రతుకును
ఒడ్డెక్కించు నుపాయము"

చెట్టులన్ని కోయవాని
నెట్టులైన దయనుజూడ
నిచ్చగించి వానితోడ
ముచ్చటించె నీ రీతిగ:

"చింతమాను మోయి కోయ
చింతకొయ్య యిదిగో మరి
'పిడి' గా నీ గొడ్డలికిడి
గడిపికొనుము అవసరమ్ము."

అనిన కోయ సంతసించి
వెనువెంటనె చింతకొయ్య
నడ్డముగా చీల్చి తనదు
గొడ్డలి 'పిడి'గా జేసెను.

ఇకపైనా కోయగుండె
నోకింతైన జాలిలేక
వరుస చెట్లనన్నింటిని
దురిమివైచు చుండెనపుడు.

చెట్టులన్ని తమను తాము
తిట్టుకొనెను తెలివిలేమి.
ఒక మామిడిగున్న మాత్ర
'మికనైన గ్రహింపుడ'నుచు

"వంన వేలునుపట్టి మనసె
కనుల బొడుచువారి కుపక
రింపరాదు అనెడు నీతి
రిత్తవోవునా" అనియెను.

కన్నసామి

★ స్వార్థబుద్ధి ★

తంగిరాల సుబ్బారావు

ఒక పల్లెటూరులో ఒక గుడిసె ఉంది. ఆ గుడిసెలో ఓ ముసలమ్మ కాపరంవుంది. హఠాత్తుగా ఓరోజున ఆమెకు చచ్చేంత జబ్బు చేసింది. మందు ఇచ్చే దిక్కెవ్వరూ లేరు. ఉన్న ఒక్క మనుమడూ ఊరికెళ్లాడు. రెండు రోజులలా జబ్బుతో తీసుకుని, మూడోనాడు రాత్రి చచ్చిపోయింది ముసలమ్మ. తక్కున యమభటులు దిగారు. ఆమె ప్రాణాలు మూటగట్టుకుని గిరుక్కున ఎగిరిపోయారు.

ముసలమ్మను (అంటే ముసలమ్మ జీవాత్మను) యమసభలో హాజరుపెట్టారు. చిత్రగుప్తుడు చిట్టా వర్జా తిరగవేశాడు. ఆమె ఎక్కౌంట్ కనబడింది. పైకి ఇలా చదివాడు: "ఎనభైఏళ్లు జీవించింది. ఒక్క పుణ్యకార్యం చెయ్యలేదు. చిన్నతనంలో తల్లిదండ్రులను ఏడిపించింది. కావలసింది ఇవ్వకపోతే తల్లిమీదపడి రక్కేది. తండ్రిదగ్గర మారాంచేసేది. బువ్వాలాటల్లో లక్కపిడతలు ఎత్తుకుపోయేది. ఎదుటిపిల్లల తాలూకు బొమ్మలు చింపి పోగులెట్టేది. బడిలోకెళ్లి, తోటిపిల్లల పలకలూ, బలపాలూ, పుస్తకాల్లోని నెమలికన్నులూ దొంగిలించేది. పెళ్లి అయ్యాక మొగుడు చెప్పినట్లు వినేదికాదు. ఎడ్డెమంటే తెడ్డెమనేది. ఆఖరికి మొగుడికి మందుకూడా పెట్టింది. దాన్తో వాడికి పిచ్చెక్కిపోయింది. ఇంకొకణ్ణి పెళ్లిచేసుకుని వెళ్లిపోయింది. కొడుక్కి పెళ్లిచేసి, కోడల్ని నానాబాధలూ పెట్టింది. రాచిరంపాన పెట్టింది. పాలలో నీళ్లు కలిపి, పొరుగూరుకెళ్లి అమ్ముకుని చాలాడబ్బు సంపాదించింది. కోర్టుకెళ్లి, ఎవరు ఎక్కువడబ్బిస్తే వాళ్లవైపు దొంగసాక్ష్యాలిచ్చింది. అన్నీ ఇలాంటి పాపాలే చేసింది. ఏపని చేసినా స్వార్థబుద్ధితో చేసింది...... కాబట్టి ఈమెని తప్పకుండా నరకంలోనే వుంచాలి. సలసలా క్రాగే చమురులో వేయించాలి. తల క్రిందులుగా కట్టి, క్రింద మంటలు వెయ్యాలి. నెత్తినిండా గుండుసూదులు గ్రుచ్చాలి......"

"గుండుసూదులు మనలోకంలో లేవండిసార్!" అన్నాడు యమబాధలు పెట్టే డిపార్టుమెంటులోని జాయింట్ సెక్రెటరీ. ఆయన భూలోకంలో వున్నప్పుడు పోలీసు డిపార్టుమెంట్‌లో పనిచేశాడు.

"లేకపోతే భూలోకంనుంచి అప్పుతీసుకురండోయ్. మనకు స్టాక్ వచ్చాక తిరిగి ఇచ్చేద్దాం!" అన్నాడు, సెక్రెటరీ జనరల్ చిత్రగుప్తుడు.

"అయితే ఈమెచేసిన పుణ్యకార్యం ఒక్కటి లేదంటారా?" అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు యమధర్మరాజు.

చిత్రగుప్తుడు బుర్రగోక్కుంటూ ముసలమ్మ చిట్టావర్జా అంతా మళ్లీ తిరగేశాడు. "ఆఁ! ఇది కొంచెం పుణ్యంలాగే కనబడుతోందండోయ్!" అన్నాడు ఆశ్చర్యంగా. "ఈమె ఓరోజున సంతకెళ్లింది. అరటిపళ్లు కొనుక్కుని ఇంటికి వస్తోంది. దారిలో రోడ్డుపక్కన ఓ ముష్టివాడు దీనంగా అరుస్తున్నాడు. ఈమె తన మనమడిచేత ఒక అరటిపండు వాడి గిన్నెలోకి విసిరించింది. ఇదీ ఈమె ఎనభైఏళ్ల జీవితంలో చెప్పుకోదగ్గ పుణ్యకార్యం. ఇంక తమరు తీర్పుచెప్పండి," అన్నాడు యమునివైపు చూసి.

యమధర్మరాజు కాసేపు ఆలోచించాడు. ముసలమ్మవైపు చూశాడు. ఏమి శిక్ష విధిస్తారోనని బిక్కు బిక్కుమంటూ చూస్తోంది ముసలమ్మ. "సరే! ఈమెచేసిన ఆ చిన్న పుణ్యకార్యమే ఈమెనిప్పుడు స్వర్గానికి తీసుకెడుతుంది," అన్నాడు యముడు.

పట్టిన ప్రతికేసూ ఓడిపోయే కొత్త ప్లీడరులా మొహం పెట్టాడు చిత్రగుప్తుడు. ముసలమ్మ మహాసంతోషంతో ఉక్కిరిబిక్కిరై పోయింది.

వెంటనే ఎక్కడినుంచి వచ్చిందో అరటిపండు, రివ్వునవచ్చి ముసలమ్మముందు గాలిలో

★ స్వార్థబుద్ధి ★

నుంచుంది. సగం మున్గింది, సగం మున్గలేదు. ఒకవైపున వాగుంది. మునికి వడిలిపోయి నల్లగా వుంది.

"ఊఁ! దాని మునికి పట్టుకో. తిన్నగా స్వర్గానికి తీసుకెడుతుంది" అన్నాడు యమధర్మరాజు.

మునలమ్మ ఆనందంతో అరటి పండు మునికి పట్టుకుంది. ఆశ్చర్యంగా అది రివ్వున స్వర్గంవైపు ఎగిరిపోతోంది. ఎనభైఏళ్లలో ఎప్పుడూ విమానం ఎక్కలేదేమో, మునలమ్మ సంతోషం ఇంతా అంతా అని చెప్పడానికి వీల్లేదు. సరిగ్గా ఆరోజు ముష్టివాడి గిన్నెలో వేసిన మాగిపోయిన అరటిపండే, ఈరోజు మహా మటుత్వంతో స్వర్గ ద్వారంవైపు 'బయ్యి'న ఎగిరి పోవడం మరీ ఆశ్చర్యంవేసింది మునలమ్మకి.

ఇంతలో, ఎంతో రమణీయంగా స్వర్గద్వారం కనబడింది. లోపలి నుంచి గంధర్వగానం సన్నగా వినబడుతోంది. పారిజాత పరిమళాలు ఘుమ్మమంటున్నాయి. మునలమ్మ గర్వంతో నవ్వుకుంది. తనకాలి చుట్టూ ఏదో, పాకుతున్నట్లై క్రిందకు చూసింది. తనకాలి బొటన వేలును పట్టుకుని వ్రేలాడుతున్నాడొకడు. మునలమ్మకి ఒళ్లు మండింది. "ఎవరునువ్వు?" అని గర్జించింది.

"నన్ను అప్పుడే మరిచి పోయావా 'మంగమ్మా'! నీకు ఆరోజు అరటిపళ్లు అమ్మిన వర్తకుణ్ణి నేను! హిహిహీ! నాకూ వుంది అందులో కొంత పుణ్యం." అన్నాడు మునలమ్మ బొటనవ్రేలు ఇంకా గట్టిగా పట్టుకుంటూ వర్తకుడు.

"నీ వెనకాలవాడెవడు?"


వర్తకుడి పిల్లగోచి పట్టుకుని వేలాడుతున్న వ్యక్తి మునలమ్మ వైపు చూస్తూ: "నేనా నన్ను నువ్వెరగవులే. వర్తకుడు బాగా ఎరుగును నన్ను. అందుకే అతని పిల్లగోచి పట్టుకుని స్వర్గానికి రాగలుగుతున్నాను. అసలు అరటితోట నాదేగా. నా పేరు 'చౌదరి'. చాలా పెద్ద అరిటితోట వేశానులే. అందులో గెల ఒకటి వర్తకుడికి అమ్మాను. అందులో అరిటిపళ్లు అతడు నీకు అమ్మాడు. నువ్వు అందులో ఒకపండు ధర్మంచేశావు. ఆ పుణ్యంలో వాటా నాకూవుంది!" అన్నాడు, చౌదరి. వర్తకుడి పిల్ల గోచి ఇంకా గట్టిగా పట్టుకుంటూ.

"నీ వెనకాల ఇంకోవెధవ వున్నట్టున్నాడే!" అంది చూరాచూరా చూస్తూ మునలమ్మ.

చౌదరి చొక్కా పట్టుకుని వ్రేలాడుతున్న నల్లటిమనిషి: "నేనాండీ? నాను చౌదరిగోరికి బాగా ఎరుకండి. అంటితోటకి అత్మానం నీలు పెట్టేవాణ్ణి నానేనండి. నా పేరు 'అప్పిగాడండి'." అన్నాడు.

వీళ్ల ముగ్గురి మాటలూ వినేసరికి మునలమ్మ అగ్గిమీద గుగ్గిలమై పోయింది. ఆమె హృదయం స్వార్థంతో కలుషితమైపోయింది. "నేను అష్టకష్టాలూ పడి కాస్త పుణ్యం సంపాదించుకుంటే, అందులో మీకు వాటాలా? దొంగ పీనుగుల్లారా! నేను నరకానికి పోతే పోతాను కాని మిమ్మల్ని పైకి రానివ్వను" అంటూ స్వర్గానికెడుతూంటే మీరుకూడా తయారయ్యారా వెధవల్లారా! పోండి! అవతలికి పోండి!" అని కాలు ఒక్కదులుపు దులిపింది. కాని ఎవ్వరూ క్రిందపడలేదు. హఠాత్తుగా ఆమె పట్టుకున్న అరిటిపండు మాత్రం మాయమైపోయింది. వెంటనే పట్టుతప్పిన మునలమ్మ, ఆమె వెనకాలనున్న ముగ్గురూ, తెగిపోయిన గాలిపటాలా ధఢీలున నరకంలో పడ్డారు.

"మునలిపీనుగా! స్వర్గానికెడుతున్నా నీ స్వార్థబుద్ధి పోలేదు.... ఒరేయ్! ఈమెని లాక్కెళ్ళి నూనె పెనంలో వెయ్యండిరా!" అన్నాడు చిత్రగుప్తుడు. ★



కందుకూరి
లింగరాజు

సమర్పణ

[గత వారం తరువాయి]

ప్రపంచయుద్ధం ప్రారంభమయ్యేసరికి దేశం వలమూలలా వున్న కాంగ్రెస్ వారిని ఇనప కటకటాలమధ్య బంధించివేయడం జరిగింది. యుద్ధవ్యతిరేక నినాదాలు కొనసాగకుండా కాంగ్రెస్ కంఠాన్ని ప్రభుత్వం బిగించివేసింది. అయితే ఒక విషయం. ఎన్ని ప్రయత్నాలు చేసి ఎంతగా ఉగ్రితాళ్ళు విరజిమ్మినా కాంగ్రెస్ అగుపుల్లోకి వచ్చే అవకాశం కనిపించకపోవడంతో కింక ర్తవ్యం అన్న స్థితిని ఎదుర్కోవలసివచ్చింది పాలకులకు.

అటువంటి అవకాశాలు ఎప్పుడువస్తాయా అని ఎదురుచూస్తున్న, ఆస్వాతివాన ఎప్పుడు కురుస్తుందా అని ముత్యపుచిప్పలవలె నోళ్ళు ఎప్పుడూ తెరుచుకకూర్చున్న నాయకులు రాజకీయరంగంలో లేకపోలేదు. అంతవరకూ నానాయాతనలు, అంతులు, శిక్షలు ఇదే ప్రభుత్వంవల్ల పొందినా, సమయానుకూలంగా తాళంవేసి పదవుల్లోకి రావాలనుకున్న కీరికండూతి కారణంగా 'ఫాసిస్టు వ్యతిరేక చైతన్యం', 'ప్రజాయుద్ధం', 'అభ్యుదయ పురోగమనం' అనే నినాదాలమధ్య ఓ వర్గం లేచింది. ప్రభుత్వానికి బాసటగా నిల్చి ఓ దారి కల్పించింది.

ఇటువంటి కోవలో చలపతిచేరి ఓ నాయకుడు అయిపోయేడు. దాంతో బలగమూ పెరిగింది.

ఈ పెరుగుదల, ప్రభుత్వపోషణ యెలావున్నా. మొదట్లో అంతవరకూ విప్లవబీజాలు నాటి దోహదంచేసి, బీజాంకురం సమయమాసన్నమైనపుడు దీన్ని ఒదులుకుని, ఒకళ్ళు చదును చేసిన దారిమీద నడవడం, రాజకీయ ద్రోహం అన్న వాదన వినుకలేకపోయేడు చలపతి. దీంతో ఎన్ని అంతఃకలహాలు వస్తాయో అని పెద్దలుకూడా అనుకున్నారు. కాని కాలం జరిగినకొద్దీ కలిగే అనుభవంవల్ల అవే సమసిపోతాయని ఓ కన్ను వేసి నిగా పెట్టారు. అల్లా మారనూ మారిపోయేడు చలపతి

అందరూ అనుకున్నట్లుగా అనుభవంవల్ల కాకుండా, ఇంకో వ్యక్తివల్ల చలపతిలో ఈ పరిణామం వచ్చిందన్నది మాత్రం నర్మగర్భంగా వుండిపోయింది;

ఇంటినుండి లేచివచ్చి, మధ్యలో కలుసుకుని, అంతవరకూ ఉప్పు పప్పు అమ్ముకుని తనను తాను పోషించుకుంటున్న సీతమ్మ. గురువుగారినే అడియేన్ దాసోహం అన్నంతవరకూ తీసుకువచ్చింది అంటే ఎవరూ నమ్మలేరు. నమ్మడామన్నా చలపతిలాంటి గడుగాయరకం, దానికి దాసోహం అని, దాని వయస్సుకు, రూపానికీ, శరీరపు బిగికీ దాసిన అయ్యేడన్నది నమ్మరాని విషయం! పైగా, అంతవరకూ బహిరంగంగానూ, అంతర్గతంగానూ ఏ స్త్రీలు చలపతి దినచర్యల్లో మసలేరు. ఒకళ్ళిద్దరూ కొంచెం ఎల్లాగ నా నాయకుడు, నైతికంగా పతనం చెందితే మనకి నయం అన్న పంథాలో ఏవేవో చెయ్యబోవడం, మొఖం బొప్పికట్టేట్లుగా చివాట్లు తిని, తిరిగి మొఖాలైనా చూపించలేనంతగా కుమిలిపోయి నిష్క్రమించడం జరిగింది. దాంతో ఎవరిదగ్గరేనా కొత్తలుగసాను కావచ్చు కాని ఆయన దగరమాత్రం మన ప్పపలుడకవు అన్న భయం ఏర్పడింది.

మొదట్లో అనుకున్నాడు చలపతి సీతమ్మ తనజీవితంమీద ఎక్కువపాలు పుచ్చుకుంటుందని. అది ప్రథమ సమాగమంలోని వేళా విశేషమో, లేక సమయ ఫలితమో తెలియదు. ఆనాటినుండి కనీసం రోజువిడిచి రోజన్నా వెళ్ళి కాస్సేపు మాట్లాడి వచ్చేవరకూ మనస్సు నిలిచేది కాదు. నెమ్మదిగా ఈ రాళ్ళల్లోవున్న సీతమ్మన్ని తను రత్నంగాఎంచేతి చెయ్యకూడదన్న పట్టుదలతో కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టేడు.

దాంతో చిన్న చిన్న పాఠాలన్నీ చెప్పి దానికి తెలియకుండానే రసాలో ప్రవేశపెట్టేడు. రోజులు నెలలు గడిచేసరికి, ఇంగ్లీషు వ్రాయడం, చదవడం. క్రమేణా వాగ్వివాదాల్లో ప్రవేశించడం, తర్జన భర్జనలు చేయగలిగిన శక్తిసంపాదించింది. సీతమ్మ పెకి వ్యాపారం అన్న తెరలోంచి మహిళా సంఘాలు పెట్టించడం, స్త్రీదళాలు స్థాపించడంద్వారా ఓ స్థానం ఆక్రమించేసింది దాంతో చలపతికి కుడిభుజమైపోయింది వెనువెంటనే కేంద్రంలో గుర్తింపు పొందనూ పొందింది.

ఒక్కొక్కప్పుడు చలపతికి అర్థంగాకపోయేది ఈ అవినాభావ సంబంధం. ఏమిటిది? ఎంతవరకూ వెళ్ళుతుంది? అనే సమయం సందిగ్ధం అయ్యింది. సగంభారంమోస్తున్నందుకు ఏర్పడ్డ కృతజ్ఞతా, అంగంగీయాలు సాధింపచేసినందుకు సంతోషమూ, ప్రేమా, వ్యామోహమూ, అన్న సంశయాల్లో సతమతమై పోయేవాడు.

ప్రభుత్వ బహిష్కరణ ఏరోజు నుండి పార్టీమీద తీసివేసేరో ఆనాటినుండి. 'ఇక మేనమామ గంగరాజు ఇంట్లోవుండడం, అనుచితం కాదనుకుని పార్టీ కార్యాలయంలో బస, తిండి పెట్టేసేడు. ఎప్పుడైనా వెళితే, అదైనా ఓ పది

నిముషాలు వెళ్ళడం, అత్తయ్యను పలకరించడం, కాంత క్షేమం అడగడం ముగించేసి వచ్చేవాడు.

మొదట్లో గంగరాజుకు చలపతి ఇలా విడిపోవడం, స్వతంత్రంగా వుండడం ఓ పెద్ద ఇవమే కాబట్టి వ్యాపారదృష్ట్యా ఆలోచించి కిమన్నాస్తి అన్నాడు. రామంతమ్మ రెండుమూడు పర్యాయాలు 'చలపతి చేతులారా దాటిపోతాడేమో' అని గగ్గోలు పెట్టింది. అల్లా దాటిపోతే, బొలి మచ్చ మోకాలిమీద వున్నది కప్పిపుచ్చి, ఏ మూడు నాలు వేలో ఎవరికో కట్నం ఇచ్చినా, కాపురానికి వెళ్ళినా మూడో రోజునే వదిలిపెట్టేస్తాడేమో అన్న భయం కలిగింది. చలపతైతే చిన్నప్పటినుండి దాన్ని చూచి, ఎత్తుకుని, చనువుగా తిరిగినవాడు, వాడే పుస్తిముడిస్తే ఆ భయం వుండదు. ఓ వేళ అల్లాంటి పనిచేసినా 'మేమేం దాచలేదు' అన్న బుకాయింపు చెయ్యవచ్చు అన్న ధైర్యంలో పడింది. కాంతానే మేనకు గిలాబా వేసింది.

చలపతి, మొదట్లో గోష్పాదమంత పిలకతో వచ్చినవాడు కాడు. పెద్ద పేరు వుంది అనకోవడంలో, వేసిన గిలాబా చవుడు ఓడిపోతుందా అన్న బెరుకు కలిగింది. ఉండబట్టలేక ఆరోజు భర్తతో "ఏమండీ! కాంత పెళ్లి మాట, అన్నగారికి వాని అమీ తూమీ తేల్చుకోకూడదా?" అంది.

"ఏమంత తొందరవచ్చిందే?"

"మీకు ఎప్పుడూ రాదు. లోపల్లోపల నేను కుమిలిచస్తుంటే, అది ఎప్పుడు కూర్చుంటుందో అన్న బెంగతో!"

"రజస్వల అయితే పోయిందేమే?"

"ఎవరేనా వింటే ఉరేసుకోవాలి! ఎక్కడ విడూరం! రజస్వలైందని తెలిస్తే, ఎవరేనా గడపత్రొక్కుతారండీ. అంత బరితెగించి పోతే ఎల్లా?"

"చలపతి ఎల్లాగూ చేసుకుంటాడు."

ఎగిరి గంతేసినటు "మీతో చెప్పేదా?"

"చెప్పాలా ఏమిటి వెర్రి ముఖమా! దాన్ని చూడకుండా వుండలేకపోవడం వల్లే కాదె అడపా తడపా వచ్చి కాస్సేపువుండి వెళ్తుంట! పైగా వాడికి మాత్రం మన ఆస్తికి..."

"అంతే నంటారా" సెమిలి అయిపోయింది. క్షణం, ఆ పెళ్లయిన మొదటి రోజుల్లో, కాపురానికి వెళ్ళకపోయినా, వచ్చినప్పుడల్లా, లోపల పెద్దవాళ్లందరూ ముక్కుమీద వ్రేలు వేసుకుంటూవుంటే. ఘంటల తరబడి ఎదురుగా కూర్చోపెట్టి మాట్లాడేవారు. మొదట్లో వచ్చినంత సిగ్గు వేసేది. ఆ తాదాత్మ్యంలోనే చలపతీ, కాంతా మాట్లాడుకోవడం గుర్తుకువస్తే చిరు

సమర్పణ

నవ్వు ఒలకబోస్తూ "మేనమామల గుణాలు ఎక్కడపోతాయి!" అంది.

పూలచెండుతో కొట్టినట్లయ్యింది గంగరాజుకు. శరీరం ఓసారి గగుర్పాటు పొందగా:

"ఏమేవ్! ఇలా దగరగా కాస్సేపు కూర్చోందూ!" అనేసేడు చిలిపిగా.

"తలలు నెరుస్తుంటే నడసాలట!" అంటూనే చిన్నలఘుదపేటిక ఇచ్చి లోపల్కి తుర్రుమంది రామలక్ష్మమ్మ.

నవ్వుతూనే గంగరాజు బీడీ వెలిగించేడు. మొదటి దమ్ములో ఘాటున వసాళం అంటి



పట్టుకోగా తక్కువ తనూ బియ్యపు వ్యాపారంచేసే ఏం పోయింది, యుద్ధం రోజులు కదా!" అన్న ఆలోచన, దానిమీద చీకటి బజారులోని రత్నరాసులు గుర్తుకు వచ్చేయి. అటూ ఇటూ ఆలోచిస్తే. అది మంచిదే అన్నట్లు తటేంది. చలపతి ఉన్నాడుగా ఏదైనా ఒస్తే చూచుకోడానికి అన్న ధైర్యంతో, సంబరపడిపోయి తనలో తానే మురిసిపోయేడు. దాంతో శరీరం వణవణలాడిపోయినట్లే మర్చిపోయేడు తన్మయత్వంలో.

"మావయ్యా!" అంటూ పిలుస్తూ చలపతి లోపల్కి వచ్చేడు. ఉలిక్కిపడ్డట్లు లేచి "రా చలపతీ" అంటూ ఉయ్యాల బల్ల దగ్గరకు నడిచేడు.

"నేను ఒక్కణ్ణే రాలేదు. తహసీల్దారుగారు, వాళ్ళూకూడా వచ్చేరు."

ఖంగారుగానే సావిట్లోకివచ్చి మర్యాదలు చేసేసేడు. ఆ మాటలు ఈ మాటలు సాగేయి. వచ్చిందెందుకో అర్థమూ అయ్యింది. తనకు క్షణం క్రితం తట్టిన వ్యాపారంకోసం పిల్లికి బిచ్చం పెట్టని గంగరాజు ఐదువందలు యుద్ధనిధిక్రింద ఇచ్చివాళ్ల వల వంగి వంగిన అభివందనాలు పొందుతూ గడపదాటించేడు.

చెప్పులు వేసుకుంటూ "మావయ్యా! సాయంత్రం ఓసారి అలా వస్తావా?" అన్నాడు చలపతి కొంత వెనుకబడి.

"ఏమిటి విశేషం?"

"చూస్తావుగా!"

"అలాగే" అన్నాడు కాని ఎందుకు పిల్చేడో అర్థంకాలేదు. ఒకవేళ ఇవాళ తను చేసిన త్యాగాన్ని చూచి, 'మామయ్య ఎంతగా మారిపోయేడన్న దృక్పథంలో, సహాయం చెయ్యడానికేమో' అని అనుకున్నాడు. దాంతో ప్రాణాలు అలుకుని, ఏవేవో భావాలు కళ్లముందు మెరిసేయి.

ఆ సాయంత్రం హంగామాలేమీ లేనే లేవు. ఓపదిమంది ముఖ్యులైన పార్టీసభ్యులు, రెండు పూలదండలు ఓజంట భాజాపరచి అమరినట్లే వుండిపోయింది ఆ చిన్నగదిలో.

భాజాలు లేవు; భజంత్రీలను అసలే పిల్వలేదు. పురోహితుడు లేనేలేడు. అసలు ఖర్చే లేదు.

ఒకళ్ళ ప్రక్కగా ఒకళ్ళు కూర్చున్న చలపతి, సీతమ్మ కూడా ఒకళ్ళమెడల్లో ఒకళ్ళు పూలదండలు వేసుకున్నారు అతిథులు తలోకాసినపూలు వాళ్ళమీద జల్లేరు ఆశీర్వచనంగా పెళ్ళి అయిపోయింది!

ముందుగానే వెళ్ళాలనుకున్న గంగరాజు కాతిలో నయ్యపు రెడ్డి వీరాస్వామి అడ్డుతగలడంవల్ల అలస్యం అయిపోయి అతిథులంతా గుమ్మం దిగుతున్నపుడే మెట్లు ఎక్కడానికి సిద్ధమయ్యేడు.

'రా! మామయ్యా!' అంటూ దూరం నుంచి చూచిన చలపతి ఆహ్వానం పంపేడు అంతమంది లోనూ, గౌరవంగా పిల్చి ఆహ్వానించడంతో గంగరాజు సంబరపడ్డాడు.

కూర్చున్న తర్వాతనే "ఇంతకంటే ముందుగా వస్తాననుకున్నా మామయ్యా, దీవించు"అంటూ పాదాభివందనం చేసేడు. వెను వెంటనే సీతమ్మ నమస్కరించింది.

తెల్లబోయేడు. నోటమాటరాక కళ్ళప్పగించేడు గంగరాజు!

"మేం ఇద్దరం పెళ్ళి చేసుకున్నాం. మామయ్యా!"

"ఆ" అన్న ముక్క గొంతుకలోనే ఇరుక్కుపోయింది.

"సీతమ్మ ఎవరో కాదు. మునసబు చినరెడ్డి కూతురు. మా పార్టీలోనే పని చేస్తోంది."

పడిపోనుగలాగే లేచేడు—మెల్లిగా అడుగులు బయటకు వేసేడు. నడుస్తూ వుంటే ఆ అడుగుల్లో శాంతి, రామలక్ష్మమ్మ తన ఐదువందల ధర్మం, బియ్యపు వ్యాపారలు, వీరాస్వామితో చేసుకున్న బందబస్తాలు ప్లాను బియ్యం, పర్మిటు సంపాదించాలన్న ఆశ—అన్నీ నుప్పు కూలినట్టే అయ్యేయి. దుఃఖం వచ్చింది, ఈవిలువు దోపిడికి.

కళ్ళు తుండువాలో దాచుకుని గంగరాజు ఇల్లు చేరేడు.

—ఇంకా వుంది]

★ శ్రీ. సౌ. చి ★

(35-వ పేజీ తరువాయి)

సామ్రాజ్యమ్మ ప్రశ్నకు తొందరపడిన శేషగిరికి ఆ జోక్ కేవలం పీచుమిఠాయిలా అనిపించింది.

"ఏమండీ డాక్టరుగారూ! సరోజకు ఏమీ కాదుగద?"

"అబ్బే, ఏమీ భయంలేదండీ..."

"అది చాల బలహీనం మనిషండీ...!"

"అందుకనేగా మూడో నెలనుండీ... విటమిన్లూ, లివర్ ఎక్స్ట్రాక్ట్లూ బాగా ఇచ్చింది"

"ఏమిటోనండి...అపశకునమనీ...అవనీ..."

"అవన్నీ ఏమీ వుండవండి. సరోజ ప్రసవం చాల 'స్మూద్'గా జరిగిపోతుంది!"

"మీరిలాగే అంటారులెండి. సరోజ ఇంతకు ముందప్పుడూ—"

"—ప్రసవించ లేదంటారు." అని నీళ్ళ గ్లాసులో థర్మామీటరు పడేట్టు నవ్వింది డాక్టరు భువనేశ్వరి. "మిస్టర్. శేషగిరీ! నేనుండడం-అందుకేగా! సరోజ ప్రసవం సుఖంగా జరిపించే పూచీనాది! మీరు అనవసరం నాకు వదిలేసి నిశ్చింతగా వుండండీ!"

"థాంక్స్" అన్న శేషగిరి మనసు— భువనేశ్వరి అంటే సామ్రాజ్యమ్మ పిన్ని తర్వాత అవిడవంటిది అని అంచనా వేసుకుంది. అవలామె నుదుటిమీద ముడతలవెనక ఎంత విజ్ఞానమూ, ఎంత అనుభవమూ దాగివున్నాయో! భువనేశ్వరి శుభపరిణామం చూస్తుంటేనే ఒకవిధమయిన మనోధైర్యం కలుగుతుందని కూడా శేషగిరి అనుకున్నాడు!

ఇల్లు చేరారు.

—గడియారం ఆరుకొట్టింది. శేషగిరి హాలులోనుండి వసారాలూ అక్కడనుండి గుమ్మందగ్గరకూ...మళ్ళీ వసారా ద్వారా హాల్లోకి తిరుగుతున్నాడు. ఈ తిరగడంలో కొత్త ఎదురుకొక్కు వయిన వసారా గుమ్మం ఒకటికి రెండుసార్లు పలకరించింది; కాని శేషగిరి వినిపించుకోలేదు. హాల్లో తన గదిలో.. సరోజ..."అమ్మా... అబ్బా... అమ్మయ్యా.. అయ్యో...వ్...అబ్బా—" అని పెడుతున్న కేకలు శేషగిరికి ముక్కలు ముక్కలుగా చీలుస్తున్నాయి. తను ప్రక్కనవుండీ తన సరోజకి ఏమీ చేయలేకపోతున్నానే అన్న స్వయం కల్పిత ఆలోచనాగ్ని అతణ్ణి దహించసాగింది... "ఈసారి ఇది అయిపోతే...ఇక నెప్పుడూ ప్రసవాలూ అవీ లేకుండా చూడాలి! తన సరోజ వుంటే చాలు అనుకుంటున్న శేషగిరి చెవిన్ని కళ్ళని వంటింట్లోకి వెడుతున్న సామ్రాజ్యమ్మను చూసి ఆమె ప్రక్కకు చేరాడు.

"పిన్నిగారూ! పిన్నిగారూ! సరోజ కెలావుంది?"

"అంతా ఇంకోగంట!"

"నాకేమో దిగులుగా వుందండీ!"

"సామ్రాజ్యమ్మ పిన్ని—గాజులున్న తన లావుపాటి హస్తాన్ని శేషగిరి వీపుమీద వుంచి—"ఏమీ భయంలేదబ్బాయి! సరోజ కేమీ భయంలేదు. డాక్టరుండి-చేస్తున్నారు" అంటుంటే శేషగిరి కళ్ళలోకి నీళ్ళు రమ్మంటావా వద్దంటావా అంటున్నాయి.

"అసలు నీవిక్కడ వుండి బాధపడడం ఎందుకు? అలా బయటికి వెళ్ళి ఇంత కాఫీ అదీ ముగించుకుని నెమ్మదిగా ఇంకో గంటలో రా... వెళ్ళు"

"సరే..."

"అన్నట్టు—ఇంత కలకండా అదీ పట్టుకురా అబ్బాయి... తర్వాత అందరికీ పంచిపెట్టాలి."

"సరోజ కేదయినా—"

"పిచ్చివాడా! ఇపుడు సరోజకేమీ అక్కర్లేదు. నీవెళ్ళరా!"

—అలా తిరిగి ఒక యుగం తర్వాత శేషగిరి వెనక్కి వచ్చాడు. ఇంటో గడియారం అరఘంట మాత్రమే ముందుకు నడిచిందని చూడగల పరిస్థితిలో లేడతడు. కాఫీలాటిదేదో తాగినట్లు కాలిపోయిన అతడి నాలుక చెబుతోంది. మళ్ళీ వసారా నుండా గుమ్మానికి హాలుకి తిరగసాగాడు. అతడి కాలికేదయినా మీటరుంటే కనీసం అయిదారు మైళ్ళు చూపించేది.

"కెవ్"—మన్న శబ్దం వినిపించింది. గుళ్ళలో ప్రసాదం పంచిపెట్టేవారిలా సామ్రాజ్యమ్మ నాలుగయిదు బట్టల్ని చేతులలో వత్తి పట్టుకు దొడ్డివక్క వెళ్తుంటే ఒక్క దూకులో శేషగిరి ఆమె పక్కకు చేరాడు. ఆ బట్టల్లోకి తొంగిచూశాడు.

గభుక్కున ఆ బట్టలను అతడి దృష్టి నుండి తప్పించేసి—"అప్పుడే వచ్చేశావేమిటా! అంతా ఇంకో పావుగంట...!—అన్నట్టు కలకండ ఏదీ?" అని అడుగుతూ సమాధానానికక్కడ ఆగకుండా సామ్రాజ్యమ్మ ఆమునీయదులో వెళ్ళిపోతుంటే-కలకండ మరిచానని చెప్పడానికి మరిచిన శేషగిరి—ఆమెను దేవదూతలా చూశాడు... గుమ్మం దగ్గరకు చేరాడు... వీధిలోకి చూశాడు.

ఎదురింటి గుమ్మంలో? ఇల్లాలు ముగ్గు పెడుతోంది. అవిడ కొంగు నడుముకుని మూడేళ్ళబ్బాయి, ఇందాకటి కవ్వస్వరంతో ఏడుస్తున్నాడు. వాళ్ళమ్మ వేస్తున్న ముగ్గుమొత్తం పూర్తయ్యేకొద్దీ అబ్బాయి ఏడుపు తగ్గుతోంది. ఇంతలోకే ఒక అత్త అలా వచ్చింది. ఆమె తటాలున అబ్బాయిని చేరి చుట్టులోకి తీసుకుంది.

"మిస్టర్ శేషగిరీ—" శేషగిరి ఒక్క దూకులో హాలుచేరాడు. "—కంగ్రాచ్యులేషన్స్! సరోజా ఓకే! బాయ్ డెలివర్ !!" అని టెలిగ్రాఫ్ ఇంగ్లీషులో, నవ్వుతో చేతులు తుడ్డుకుంటున్న డాక్టరు భువనేశ్వరి అంటుంటే వంటింట్లోకి గ్లాసుతో వెడుతున్న సామ్రాజ్యమ్మ శేషగిరిని చూసింది.

"చిన్ని కృష్ణయ్య పుట్టాడు! చిన్ని కృష్ణయ్య!" అంటున్న సామ్రాజ్యమ్మను తోసుకుని సరోజవున్న గది గుమ్మందగ్గరకు పరుగెత్తాడు శేషగిరి.

అతడిలోని—'తండ్రి'ని చూసి భువనేశ్వరి విజ్ఞానమూ, సామ్రాజ్యమ్మ అనుభవమూ, నవ్వుకున్నాయి.

గుమ్మందాటి లోపలి కడుగు పెట్టాడు శేషగిరి. నెమ్మదిగా సరోజ మంచం ప్రక్కకెళ్ళి నిల్చున్నాడు.

సరోజ ఎక్కడో దూరంనుంచి చూసినట్టు చూసింది. ఆమె కళ్ళలో—హిమాలయాలూ, నయాగరాలూ, ఇంద్రధనుస్సులూ, నందనవనాలూ—తొణికించాయి. పాలల్లో పంచదారలాటి లేత దరహాసం ఆమె పెదవులమీద—విరిసింది. ఆమె తన చూపుతో శేషగిరి చూపును మళ్ళించింది.

తెల్లటి గుడ్డలమధ్య, రాగి చెంబులాటి తలతో నీలరత్నాలమీద ఉలిపొరలాటి చర్మంతో, ఇటూ అటూ కదుల్తూ, కండ్లను తెరుస్తూ, మూస్తూ, బుల్లి చేతులనూ బుల్లి కాళ్ళనూ విసురుతూ, నెమ్మదిగా ఏడుస్తూ కనిపించాడు. వరలా శేషగిరుల పుత్రుడు—చిరంజీవి!

"మహేశ్వర్!" అన్నాయి శేషగిరి పెదవులు అతి నెమ్మదిగా. ఏదో రహస్యం తెలిసిపోయిన సంతోషం సరోజకళ్ళలో ప్రతిఫలించింది.

"అబ్బాయ్! ముందటవెళ్ళి—ఆ డాక్టరమ్మను పంపించూ...తర్వాతా...నామకరణం అదీ రాయించడానికి సిద్ధాంతులవారిని పిలుచుకురా! దారిలోనే మీ నాన్నగారికీ, మామయ్యకూ 'టెలిగ్రాఫు' ఇప్పించేసెయ్! మరి మంగళవాళ్ళూ...కొత్త..." అని ఏకరువు పెడుతున్న సామ్రాజ్యమ్మ—

శ్రీ. శేషగిరి
సౌ సరోజ
చి. మహేశ్వర్—ల లోకంలోకి రాలేకపోయింది. ★



వనితాలోకం

కొన్ని ఆచారాలు, అలవాట్లు చూస్తున్నంత వరకు చాలా సులభంగా కనుపిస్తాంటాయి. అందుకే వాటిని ఇల్లా ఆచరించాలని పెద్దలు పిన్నలకు చెప్పటము కానీ, పిల్లలు పెద్దల్ని అడిగి తెలుసుకోటము కానీ జరుగదు. ఆడపిల్లేనా, మొగపిల్లాడైనా పెళ్లి కానంతవరకు చిన్నపిల్లలుగానే పరిగణింపబడతారు. అప్పట్లో వారినీ ఆచారాలు, అలవాట్లు అంతగా బాధించవు. అదే పెళ్లయి సంసారంలో అడుగుపెట్టగానే అనేక బాధ్యతలతోపాటు, ఆచారాలు అని పిలువబడే ఈ గృహకర్మాలు కూడా మీద పడతాయి. వాటి ఆచరణలో ఏపాటి అశ్రద్ధ చూపినా నలుగురిలో నగుబాటు కావాల్సి వస్తుంది.

రాజు, దేముడు, వృద్ధులు, బాలురువంటి వారిదగ్గరకు రిక్త హస్తాలతో పోరాదనే సూక్తి పెద్దవాళ్లకే. నాటినుంచి మనము చదివినదే. ఆచరణ కొచ్చేసరికి అదే మరచి పోయివూరుకుంటాం. నేను గృహిణినై అప్పటికి నాలుగు మాసాలయింది. ఆరోజు ఒక ముత్తైదువరోజు పేరంటానికి వెళ్ళాను. ఆపిల్లాడికి రెండవఏడు వెళ్ళి మూడవఏడు వస్తూంది. వచ్చీరాని ముద్దులమాటలతో పిల్లాడు చూడ ముచ్చటగావున్నాడు. వాడిని మాటాడిద్దామనిపించింది నాకు. నేనెన్ని విధాల పలకరించినా పలకలేదా కుర్రాడు. అప్పుడే పేరంటానికి వచ్చిన ఒక పెద్దముత్తైదువు, పిల్లాడిచేతులో ఒక మిఠాయిపొట్లము పెట్టి బుగ్గలుపుణికి "బాబూ నీ పేరేమిట్రా" అంది. అంతవరకు నేపలక్కరించినా పలకని వాడు "లాంబాబు" అంటూ ముద్దుగా చెప్పేసరికి నాకు ఆశ్చర్యమే కాకుండా వాస్తవంకూడా తెలిసి వచ్చింది.

ఏ చిన్నపిలల పేరంటమొచ్చినా, ఆ పిల్లచేతిలో ఆ పిలల నానందింపజేసేవేమీ పెట్టకపోయినా నెత్తిమీద ఓ అక్షింత గింజపడేసాము. ఆ అక్షింతలు పెద్ద దృష్టిలో విలువ గలిగినవైతే కావచ్చు కానీ పిల్లల దృష్టిని మాత్రము ఆకర్షించలేవు. మా చిన్నతనము కళ్లకుకట్టినట్లు గుర్తుకొస్తోంది. అప్పట్లో మా యింట్లో కొత్తపెద్దవాళ్లయిన మా అక్కయ్యలు _ కాకుండా నా యిద్దరన్నయ్యలు, నేను మా చెల్లాయివుండే వాళ్ళము చిన్నపిల్లలము. మేము చుట్టాలను అల్లంత దూరాన చూడగానే వీధి గుమ్మంలో కాపేసే వాళము. ఆ వచ్చినవాళ్లు మాచేతులో తలో పొట్లమూ పెట్టి లోపలకు వెళ్ళేవారు. ఒకొకరు మాకు పువ్వులు, మా చెల్లాయికి ఆటవస్తువు కూడా యిచ్చేవారు. అప్పటి మా సంతోషము అంతాయింతా కాదు. బొమ్మ ఎవరిచ్చిందీ వేలితో చూపిస్తూ మనిషి మనిషికీ చెప్తూ. ఇల్లంతా చుట్టబెట్టేది. చిట్టి చెల్లాయి.

అనుభవం నాకు నేర్పిన పాఠాలు

నేను చిన్నతనంలో పేచీ పెట్టకుండా జడవేయించుకున్న రోజేమైనా వుందా అంటే అది పువ్వులు తెచ్చిన రోజు నేనని ఈ నాటికీ అమ్మ చెప్తూంటుంది. ఆనాడు వచ్చిన చుట్టాల్ని కూడా పరామర్శించనివ్వకుండా అమ్మని నాకు జడవెయ్యమని పేచీ పెట్టేదాన్నిట. నాకు మాత్రము ఈ నాటికీ గుర్తున్నదేమంటే పట్టె మిఠాయిపొట్లము యిచ్చిన వారికన్నా పువ్వులిచ్చిన వారు మిన్నగా కన్పించేవారు.

లోపలకొచ్చిన వారిని మా మానే "ద్వారపాలకులకు (అంటే మాకు) లంచము పెట్టి వచ్చారా" అని నవ్వుతూ పలక్కరించేది మా అమ్మ. మామూలు కుశల ప్రశ్నలైన తర్వాత వాళ్లు మా బామ్మచేతిలో కూడా పటిక బెల్లమో ఖర్జూరప్పండో పెట్టేవాళ్లు. అవి తీసుకున్న బామ్మ వాళ్ళ వంశం వర్ధిల్లి పొందలవ్వాలనీ వాళ్ళు నూరేళ్ళు బ్రతకాలనీ దీవించేది.

మేము అలా దీవించకపోయినా ఒక విశేషమైన కృతజ్ఞతాభావంతో మా మనస్సు నిండి పోయి వారికే విధమైన ప్రత్యుపకారము చెయ్యగలమా అని తహతహలాడేవాళ్లం. ఇదంతా జ్ఞప్తికిరాగానే పేరంటం రోజున ఆ పిల్లవాడి దృష్టిలో నేనెంత చులకనయ్యానో తెలుసుకుని మరింత కృంగిపోయా. ఆనాటి సంఘటనలో నన్ను తిట్టినవారు దెప్పినవారు ఎవరూ లేకపోయినా, ఆ పిల్లవాడి మౌనము నాకు తగిన గుణపాఠము నేర్పి ఈ నాటికీ మనస్సులో శిలాక్షరముగా నిల్చిపోయింది.

* * *

ఇది జరిగిన తర్వాత చాలా రోజులవరకు చెప్పుకోతగ్గ సంఘటనలేవీ జరగలేదు. కాని ఒక పొరపాటు మాత్రము జరిగి పోయింది. ఆ పొరపాటే బంధువులదృష్టిలో మమ్మల్ని అక్కరమాలినవారుగా పరిగణింపజేసింది. మా పెళ్ళయిన నాలుగు సంవత్సరాలలో మా బంధువుల యిళ్లల్లో చాలా అక్కరలు జరిగాయి. కానీ ఒక్కదానికీ మేము పోజాలకోలేదు. మాకు వంట్లో బాగుండక ఒకసారీ, దూరప్రయాణముకదా, వెళ్ళిపోతే ఏమని ఒకసారీ, ఇవి పాతకాలపు ఆచారాలు పాటించేదేమిటని మరోకసారీ ఇలా రకరకాల ఆలోచనలతో కాలము గడిపేశాము. అప్పటికి మా పెత్తల్లి కొడుకు పోయి ఆర్నెల్లయింది. మరి కొద్దికాలానికి పినతల్లి, కూతురుకూడా పోయారు. అప్పటికీ మేము ఎవరిని పలక్కరించేందుకూ వెళ్లలేదు. అసలే కోపంతో వుడికిపోతున్న మా బంధు హృదయాల్ని మా యీ నిర్లక్ష్యము మరింత

(51-వ పేజీ చూడండి)

బి. ఎస్. లక్ష్మి
(కాకినాడ.)

భర్తలను పొగడే భార్యలు

కర్లపాలెం రాజ్యలక్ష్మి
[వేటపాలెం]

పదిమందిలో భర్తలను గూర్చి చెప్పుకోవడం భార్యలకు సరదా. తన భర్త గొప్పతనమే తన గొప్పతనంగా భావించుకుంటుంది భార్య. మరి అర్ధాంగిగా. కాని కొందరు లేని గొప్పలు చెప్పుకోవడం ఎబ్బెట్టుగా ఉంటుంది. వాటిని సమర్ధించుకోలేక కష్టపడడం చూస్తే జాలివేస్తుంది. నవ్వూవస్తుంది.

అసలు ఆడవారిలో కొన్ని తెగలవారున్నారు. అందులో మొదటిరకంవారు తమ భర్తలనుగూర్చి లేని గొప్పలు చెప్పుకొనేవారు. వీరు పదిమంది కలసి పిచ్చాపాటీ మాట్లాడుకునేటప్పుడు తమ భర్తల సంగతి అనవసర ప్రసంగాలద్వారా ఎత్తుతారు. ప్రస్తుతానికి గొప్పలు చెప్పుకుంటారుగాని తిరువాత వాటిని సమర్ధించుకోలేక బాధపడతారు.

ఒకనాడు ఒక స్నేహితురాలు తన భర్తను గురించి చెప్పుకుంటూ 'మా ఆయన జీతానికి రెట్టింపు సిగరెట్లు తాగుతారమ్మా! అవేమోగాని ఒక్కొక్క సిగరెట్ 1-8-0 ట" అన్నది సిగరెట్లు గొప్పవారు తప్ప తాగరనే ఉద్దేశ్యంతో. మరునాడు మాటల్లో "మా ఆయన జీతం 250 రు. అని చెప్పింది వెంటనే నేను "అంటే మీ ఆయన 500 రూపాయిల సిగరెట్లు తాగుతాడన్నమాట" అన్నాను. "కాదమ్మా, తమాషాకన్నాను. అన్నిమాటలు అంత గట్టిగా పట్టుకుంటే ఎలా" అని చల్లగా ఇంటికి పోయింది.

వీరు ఎవరూ అడగకముందే ఏవో ప్రస్తావనద్వారా తమ భర్తలసంగతి ఎత్తి గడగడా చెప్పేస్తారు. ఇటువంటి వారిని చూస్తే మనకు విసుగే కాకుండా, విపరీతమైన కోపం కూడా వస్తుంది. ఒక్కొక్కసారి అందరూ పనిచేసుకుంటుంనే సమయంలో ఏ అప్పడాల కర్రో కావాలనే వంకన వస్తారు. తరువాత తమ భర్తలకప్పడా లిష్టమనీ, దానికోసం ముప్పైలూ, నలభైలూ ఖర్చుచేస్తాడని మూడు గంటలసేపు ఉపన్యాసాన్ని దంచేస్తారు. ఆ ఉపన్యాసాన్ని వినేవాళ్లుకూడా అటువంటి వారైతే కష్టం లేదు. కారణం, ఎవరి భర్తలను గూర్చి వారు పొగడుకుంటారు కాబట్టి......

ఇక రెండోరకంవారు: తమభర్తలను గూర్చి, ఉన్న గొప్పలుమాత్రం చెప్పుకొనేవారు. [లోపములను వదిలి.] వీరిమీద కూడా చిరాకు వేస్తుంది. కాని మొదటివారి కంటె నయం అనిపిస్తారు. తమ తమ లోపముల తామే చెప్పుకోవడం మానవసహజం గాదు గాబట్టి వీరిని మంచివారి క్రిందే జమకట్టవచ్చు.


వీరిలోనే మరొక భాగంవారు మానప్రియులు. వారు తమ భర్తల సంగతి ఇతరులు ప్రశ్న వేస్తేగాని చెప్పరు. చెప్పినా ముక్తసరిగా చెబుతారు. కారణం వారి భర్తల గొప్పతనం! లోపము అందరికీ తెలుసూనే వుంటుంది గనుక. వీరు మన సమాజంలో చాలా అరుదుగా వుంటారు. వీరే సంఘంలో ఎక్కువమందిచేత మెచ్చుకొనబడతారు కూడా. [కాని ఇటువంటివారిని సహితం కొందరు మెచ్చుకోరనుకోండి.]

(54 వ పేజీ చూడండి)

లంగా బార్డరుకు

ఎం. బి. కాంచనమాల
(హైదరాబాద్)

డిజైనులు



బేబీ ఫ్రాకు మాలలుకు



పంకి చేలుకు

అనుభవం నాకు నేర్పిన పాఠాలు

(48 వ పేజీ తరువాయి)

గాయపరచింది. దానితో మా క్షేమము తెలుసుకునే బంధువుల దగ్గరనుండి ఉత్తరాలు తగ్గిపోయి, ఆగిపోయాయి. కొన్నాళ్ళ పాటు నేనేమీ బాధ చెందలేదు మా బంధువుల గురించి, ఇల్లా వుండగా మా వారికి చాలా జబ్బు చేసింది. ఇరుగుపొరుగులు తప్ప, నా అని పలకరించే ఆత్మీయులెవ్వరు నాకు అప్పుడు కన్పించలేదు. ఇల్లా మా వారికి జబ్బుగా వుందనీ, ఒకసారి వచ్చి చూసి పొమ్మని అందరికీ తలొక ఉత్తరము రాశాను. కొంతమంది జవాబే రాయలేదు. మరికొంతమంది తమకు దూరపు ప్రయాణము చెయ్యటము అలవాటు లేదని ఒకరూ, వూపిరి సల్పని పనులవల్ల తీరటము లేదని మరొకరూ రాసి మావారి క్షేమసమాచారము తెల్పమంటూ రాశారు. అప్పటికే వారి జబ్బువల్ల మనస్సు చెడిపోయిన నాకు, ఈ ఉత్తరాలు మరింత భయము పుట్టించాయి. అప్పట్లో నా దుఃఖములో పాలుపంచుకోగలిగిన ఆత్మీయులు నాకు కావాలి. అప్పటికి కానీ నాకు ధైర్యము చిక్కదు.

అక్కర సమయాలకు ఆప్తులు హాజరవాలన్న అగత్యమేమిటో యీ నాటికి నాకు తెలిసిందనీ, చిన్నతనమువల్ల లోటు జరిగినప్పటికి వాటిని క్షమించి నువ్వైనా ఒకసారి వచ్చిపోవలసిందనీ ఉత్తరము రాశాను అన్నయ్యకు. నా ఉత్తరం అందినవెంటనే ఆరువందల మైళ్ళ దూరంలో వున్న అన్నయ్య పరుగెత్తుకు వచ్చాడు. ఆ నాడు అన్నయ్యను చూసేసరికి దుఃఖం పొంగివచ్చేసింది మనసారా. మనసు తేలికపడేంతవరకు ఏడ్చేశాను. వారికి నయమయ్యేంతవరకు తాను వుంటానని మాటిచ్చాడు అన్నయ్య. తర్వాత కొద్దిరోజులకే వారికి పథ్యం పెట్టాము. ప్రయాణమై తిరిగి వెడుతూన్న అన్నయ్య, "అక్కరకు రాని చుట్టము అనే సుమతీశతకములో పద్యాన్ని అప్పుడప్పుడు మరచిపోకుండా కాస్త మననము చెయ్యటము మంచిది మీ దంపతులు" అన్నాడు.

* * *

కాలప్రవాహంలో మరికొన్ని రోజులు గడిచిపోయాయి. మా చిన్నన్నయ్య పెళ్లికి రమ్మని శుభలేఖ వచ్చింది మాకు. అనుభవము నేర్పిన గుణపాఠములవల్ల తనకు శెలవు దొరకకపోయినా నన్ను పంపేందుకు ఒప్పుకున్నారు మా వారు. పెళ్లి పేరంటాల విషయంలో ఏమేమి కట్నాలు చదివించాలో (ఎక్కడికి వెళ్లనివాళ్లము కావటముచేత) తెలియక తికమక పడ్డాము. తాను రావటము లేదు కాబట్టి బహుశా కట్నము చదివించాల్సిన అవసరముండదు అని మొండిచెయ్యి చూపారు మా వారు. (ఎంత ఖర్చు చేసినా వారు చెయ్యాల్సిందే మిగతా వారు చేసింది అనవసరము అని వారి వూహ) పెళ్లికెళుతున్నానంటే వట్టిచే పంపరనే వూహతో నా దగ్గరవున్న డబ్బు గాజులకు వూసలకు ఖర్చు పెట్టేశాను. తీరా వారిలా అన్నారు. అప్పుడు పోనీ మానేద్దామా అంటే యిదివరకే అక్కరకు రానివాళ్లమనే అపోహ మా మీద ప్రబలిపోయింది. పైగా రైలులో కూర్చున్నాక తిరిగి ఏమి వెళ్తాను. ధైర్యము చేసుకువెళ్లాను. కొత్త బంధువులు పాత బంధువులు అందరు కనపడ్డారు. ఒకళ్లను ఒకళ్లు చూసుకుని ఎన్నాళ్ళయిందో లెక్కలు వేసుకున్నాము. సరే పెళ్లి కూడా అయింది. చదివింపుల టైము వచ్చింది. అంతా చదివిస్తూన్న లిస్టులో మా పేరు ఎక్కడా వినిపించకపోయేసరికి అందరూ తలో చురుకు విసరటము మొదలు పెట్టారు. అయితే ఆ బహుమతులన్నీ వారికే ముట్టాయి. పెళ్లికి వారు రాలేదు కనుక ఆ బహుమతుల సారాంశం వారివరకు పోలేదనుకోండి.

మరొక ఏడాది కనుకుంటూ, మా చిన్నన్నయ్యా వదినా స్వంత కాపురము పెట్టారు వుద్యోగపువూళ్ళో. ఒకసారి వాళ్లను చూసివద్దామని వెళ్ళాను. అప్పటికి మా చిన్నవదినకు మూడవమాసం. నేవున్న నాలుగు రోజులూ కులాసాగానే గడచిపోయింది. నే వెళ్ళిపోయే ముందర నాకు పసుపుబొట్టు పెట్టి ఒక జాకెట్టుగుడ్డ చేతులో పెట్టింది మా చిన్నవదిన. అది చూసిన నాకు చాలా కోపమే వచ్చింది. కాని మనస్సులోనే అణిచేసుకున్నా. ఏమంటే, "ఆడబడుచుని, తొలిసారి వెడుతున్నాను గదా తప్పకుండా చీర పెడుతుంది అనుకుంటే ఓరవికలగుడ్డా నాకు పెట్టేది" అనిపించింది. ఏమైనా మా వదిన దగ్గిర మాత్రము ఏమీ తేలలేదు. అమ్మ కనిపించినప్పుడు అమ్మతోనే అన్నా నీమాట.

"నువ్వు వెళ్ళేసరికి మీ వదిన నీళ్ళుపోసుకుంది కదా! నువ్వేమి నూడిదిచ్చావేమీ వదినకూ" అంది అమ్మ.

"నూడిది వ్వాలని నాకు తెలియదే అమ్మా ఏమీ యివ్వలేదు" అన్నాను నేను.

"అనుభవమునూ వయస్సులోనూ కూడా దానికన్నా ఏడెనిమిదేళ్లు పెద్దదానివిగదా! నీళ్ళుపోసుకున్న వదినగారికి నూడిద లివ్వాలని నీకే తెలియనప్పుడు నిన్న మొన్న కాపరానికొచ్చిన మీ వదిన నిన్ను సరిగా మర్యాద చెయ్యలేదని ఎల్లా అనుకున్నావే" అంటూ అమ్మ సన్నసన్నగా వేసిన చివాట్లు తిన్నాక, 'తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు' అన్న వేమనగారి సూక్తి జ్ఞాపకమొచ్చి అజ్ఞానంగా ఆడబడుచుతనము వెలిగించబోయినందుకు లోలో నేనే కించపడ్డాను.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకే మా అత్తయ్య కూతుర్ని పురిటికి తీసుకవచ్చింది. చుట్టుపట్ల ఆడవాళ్ళంతా మా అత్తయ్య వియ్యాలారు పెట్టిన చీర చూపమన్నారు. తనకే చీరమీ పెట్టలేదని చెప్పింది. మా వియ్యంకుడు మా వియ్యపురాలి మాట సాగనిచ్చేరకము కాదు. అల్లాంటప్పుడు ఆవిడేమి చెయ్యగలదు అంది అత్తయ్య. అయినా అత్తయ వియ్యపురాలికి మహిళామండలిచేత మంగళహారతులు తప్పలేదు.

ఒకసారి మా చుట్టాలింటికి పెళ్ళికి వెళ్ళాను. పెళ్ళికొడుకు పినతండ్రి పెళ్ళికొడుకుకేమీ చదివించలేదు. ఈ విడూరము గురించి అంతా వింతగా చర్చించుకున్నారు. ఆయన మాకు బాగా తెలిసిన వ్యక్తే. కారణము లేకుండానే అన్నపిల్లలకు చీరలు, సారెలు, డబ్బు, అది 'ఇప్పుడెందుకండీ పెట్టటము' అని భార్య అంటున్నా వినిపించుకోకుండా పెడుతుండేవాడు. బహుశా యిప్పుడు చేతిలో డబ్బు సర్దుబాటు కాక కట్నము తీసుకరాలేదేమో? దానికింత రాద్ధాంతము కావాలా అనిపించింది నాకు. ఆయన స్వభావము తెలిసిన ఏ కొద్దిమంది వ్యక్తులో తప్ప మిగతా వారంతా ఆయనను లోభి క్రింద జమకట్టినవారే. సమయమెరిగిన ఖర్చు మగవారికీ వేళ నెరిగిన పని ఆడవాళ్ళకూ రాణింపుకు వస్తాయని అంటారు అనుకున్నా.

ఇదంతా ఆలోచిస్తూన్న నాకు-సంసార బాధ్యతలు పైన వేసుకోకుండా అత్తచాటు కోడలుగా మంచి చెడులన్నీ అమ్మపైన వేసి ఆషామాషీగా తిరిగే వదినమీదా, నాన్న ఆజ్ఞాపించిన మేరకు ఆచరిస్తూ, ఏమన్నా లోపమొస్తే, తండ్రిచాటు బిడ్డ నాదేమి చేస్తాడని లోపల సానుభూతి పొందగలుగుతూన్న అన్నయ్యమీదా ఒక్కొక్కప్పుడు అకారణంగా ఈర్ష కలుగుతూంటుంది.

ప్రతి మనిషీ తన గురించి మంచిగా చెప్పుకోవాలనుకోటము సహజము. అనాది నుంచి వస్తున్న ఆచారాలు, అలవాట్లు చిన్నవైనా, పెద్దవైనా వాటిని ఆచరించినవాడే సంఘములో గౌరవము పొందగలుతాము. ★

వనితా వాణి



కుటుంబనియంత్రణ అవలంబించటం చాల చాల మంచిదే అయితే ప్రభుత్వము చెపుతున్నట్లుగా కుటుంబనియంత్రణ ఆచరణలో పెట్టటానికి సౌకర్యాలు ఏమాత్రం కలుగ చేస్తున్నది అనేది ఆలోచన చేయవలసిన విషయము.

ఇది ప్రణాళికా యుగం. దేశసౌభాగ్యానికి పంచవర్ష ప్రణాళికలు ఎంత అవసరమని గుర్తించామో కుటుంబ సక్రమ నిర్వహణకు కుటుంబ నియంత్రణ అంత అవసరం అని అంగీకరించాలి. ధనవంతుల విదంజగత్ అన్నట్లు డబ్బువుంటేనే కాని ఏపనీ కాదు. కుటుంబ నియంత్రణ ఆచరణలో పెట్టేందుకు ప్రభుత్వ సహాయం - ప్రచారం సలహాలు మటుకే కాక ఆర్థిక సహాయం కావలసి వస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో—ఆర్థిక దుస్థితి దేశాన్ని పట్టి పీడిస్తున్న యీ రోజుల్లో చాలీచాలని సంపాదనలతో డబ్బు వ్యయం చేసి గర్భ నిరోధక శస్త్ర చికిత్స చేయించుకునేందుకు సిద్ధమయ్యే పరిస్థితి ప్రజల్లో లేదు. పరిస్థితుల్లో ఆర్థిక సహాయం కలుగ చేయటానికి ప్రభుత్వం పూనుకుంటే ఎంతో మంచిది.

ప్రభుత్వోద్యోగుల సంగతి చూద్దాం ప్రతి రాష్ట్రము కేంద్రము ఉద్యోగులకు వైద్య ఖర్చులు భరిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన శాసనాలు ఏనాడో తయారు చేయటంవల్లనూ, మళ్ళా పరిశీలించి తగు మార్పులు చేయకపోవటం వలనూ కొన్ని లోపాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు వైద్య ఖర్చులు భరిస్తున్న ప్రభుత్వం కుటుంబ నియంత్రణ విషయంలో అవసరమయిన శస్త్ర చికిత్స"కు డబ్బు యివ్వదు ఇలాంటి లోపాన్ని ఇప్పటికైనా సరిదిద్దటం ఎంతైనా అవసరం అలా సరిదిద్దటంలో వృథా కాలయాపన చేసినట్లయితే ఉద్దేశించిన ఫలితాలు (ప్రణాళిక ద్వారా) సాధించ లేమేమోనని సందేహం. ఇలా చేయటంవల ప్రభుత్వం చెప్తున్న మాటలకు చేతలకు సమన్వయం వున్నటవుతుంది.

ఒక్క ప్రభుత్వో ద్యోగులకే కాదు, యావన్మందికి—ముఖ్యంగా సామాన్య ప్రజలకు వీలుగా సదుపాయలు చెయ్యాలి. అనాడే దేశం అనుకున్న ఫలితాలు సాధించ గలుగుతుంది.

జి. ఆర్. వై. ప్రగడ (పూనా)

* * *

పసని నిర్మలప్రభావతిగారు వ్రాసిన వ్యాసము చాలాబాగుంది. ధన్యవాదాలు. ఆవిడ చెప్పినట్లు కొందరు డాక్టర్ల సలహాలను పాటించరు.

ధరణీప్రగడ కామేశ్వరి, (విజయవాడ).

* * *

వ్యాసం చాలా బాగున్నది. ప్రభావతి గారు ప్రతి స్త్రీకి అర్థమయ్యేట్లు వ్రాశారు.

బి. రాజ్యలక్ష్మి, (విజయనగరం).

* * *

"ఎంతమంది పిల్లలు మీకు" అను వ్యాసము చాలా బాగున్నది. ఇప్పటి కుటుంబములలో పిల్లలతో కష్టపడువారు చాలామంది ఉన్నారు. వారు ఆ వ్యాసాన్ని చక్కగా అర్థము చేసుకొనగలిగినచో వారు సుఖపడుటయేగాక దేశమునకు మేలుచేసినవారగుదురు.

పి. రమాదేవి (విజయపురి నార్త్).

* * *

శ్రీమతి పసని నిర్మలప్రభావతిగారు వ్రాసిన "ఎంతమంది పిల్లలు మీకు?" అన్న వ్యాసం హృదయంగమంగ ఉన్నది. ఈమధ్య చాలమంది ఫామిలీ ప్లానింగ్ కు వ్యతిరేకంగా వ్రాశారు. అట్టివారి కిటువంటి వ్యాసాలు కనువిప్పు కలిగిస్తాయని ఆశిస్తాను.

వేదాన్తం శ్రీనివాసాచార్యులు, పామఱ్ఱు.

* * *

★ మహిళా సంఘాలు ★


బిలాస్‌పూర్ (మధ్యప్రదేశ్) రైల్వే ఉద్యోగుల సంఘానికి ఇటీవల ఒక ఉపసంఘం వంటిది ఏర్పడింది. ఉద్యోగుల భార్యలంతా సమాలోచించుకొని నవంబరు 14-న జవహర్ లాల్ నెహ్రూ జన్మదినోత్సవ సభ జరిపారు. ఆరోజునే లలితా మహిళా మండలి నెలకొల్పడం జరిగింది. స్థానిక ఆంధ్ర మహిళలంతా ఇందులో చేరి ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ప్రతిశని వారం ఒక సమావేశంజరిపి చర్చలు, ఇతర కార్యకలాపాలూ సాగిస్తున్నారు.

జనవరి 26 న రిపబ్లిక్ ఉత్సవాన్ని పెద్ద ఎత్తున జరిపారు. శ్రీమతి విమలా వెంకటరామయ్యగారు అధ్యక్షత వహించారు. అంతకుముందు జరిపిన పోటీలలో నెగ్గిన వారికి బహుమతులు ఇచ్చారు. గానసభ, బాలికలచే నృత్యప్రదర్శనం జరిగాయి. అందరికీ మిఠాయి పంచిపెట్టారు.

కట్రి కమలమ్మ,
(లలితా మహిళామండలి కార్యదర్శిని.)

నిజామాబాద్ జిల్లాలోని బన్సువాడా మహిళా మండలివారు కమ్యూనిటీ హాలులో సమావేశమై రిపబ్లిక్ ఉత్సవాలు జరిపారు. తహశీల్ దారు శ్రీ జి. నారాయణరావు అధ్యక్షత వహించారు. శ్రీమతి డి. సరోజినీదేవి స్వాగతం చెప్పారు. శ్రీ శ్రీనివాసరెడ్డి శ్రీ నార హనుమాన శేఠ్ గారలు మహిళా మండలికి ఒక కుట్టుయంత్రము, కారమ్స్ బోర్డు, బంతులు బ్యాట్‌లు బాలసంఘానికి ఆటవస్తువులు బహూకరించారు. తరువాత స్త్రీల చేతిపనుల ప్రదర్శనానికి హనుమాన్ శేఠ్ గారు ప్రారంభోత్సవం జరిపారు. బన్సువాడ తాలూకాలోని చాలా గ్రామాల నుండి మహిళలువచ్చి వారు తయారుచేసిన వస్తువులు-లేసులు, ఎంబ్రాయిడరీ డిజైన్‌లు మొదలయినవి ప్రదర్శించారు. తరువాత విందు జరిగింది. సాయంత్రం సంగీత, నృత్య నాటక కార్యక్రమాలు జరిగాయి. చేతిపనులలో నైపుణ్యం చూపిన మహిళలకు, నృత్యాలుచేసిన బాలికలకు బహుమతులు ఇచ్చారు. రాత్రి విందుజరిగింది.

మ॥ సుజాత,
(మహిళామండలి కార్యదర్శిని బన్సువాడ.)



మధ్యప్రదేశ్‌లో లభ్యమైన 11 వ శతాబ్దపు జైన దేవత శిలావిగ్రహం. దీన్ని అమెరికాలోని ఫిలడెల్ఫియా పురావస్తుప్రదర్శనశాలలో భద్రపరిచారు. అనుదినం అనేకమంది ఆ శిల్పమూర్తిని సందర్శిస్తుంటారు.

"కుటుంబ నియంత్రణంలో పెద్దవాళ్ళ ప్రతిబంధకాలు" అను వ్యాసమును నేను చదివినాను. ఆ వ్యాసము చాలా బాగున్నది.

రాచంశెట్టి పార్వతీశం, పేరాల.

* * *

ఈ స్పుత్నిక్ యుగంలో కూడా కొన్ని దురాచారాలు మూఢ విశ్వాసాలు (యివి సమాజానికి యేమాత్రం వుపయోగించేవి కావు పైపెచ్చు అపకారం మాత్రమే) యింకా పోలేదు. ఆ కారణంగా దేశ సౌభాగ్యం కోసం అవలంబించవలసిన కుటుంబ నియంత్రణం వంటి సమాజక్షేమ కార్యాలు జయప్రదంగా సాగకుండా ప్రతిబంధకాలు కల్గుతున్నవి.

నా చిన్నతనంలో టీకాలు వేయడానికి ఎవరో వచ్చి టీకాలు వేయించుకుంటే 'అమ్మవారికి అపచారం చేసినటని' టీకాలు వేయించుకోకుండా ఎన్నో కష్టాలు పడేవారు. ఏమండీ మీపిల్లలేరి అని టీకాలు వేసే వారడిగితే, తలీపిలలు కలసి వారి అమ్మమ్మగారింటికి (యింట్లో పిల్లల్ని దాచి) వెళ్లారనో ఏదో సాకు చెప్పి తప్పించుకొనేవారు. కాని నేడు ప్రతివారు టీకాలు వలన కలిగే లాభాన్ని గుర్తించగలిగారు. తమ మూఢ విశ్వాసము తప్పనిగ్రహించి టీకాలు వేయించుకొనకుండా తప్పించుకొనడానికి అష్టకష్టాలుపడే ఆ తలిదండ్రులు నేడు దగ్గరుండి కుటుంబం మొత్తానికి టీకాలు వేయించుకొంటున్నారు.

ఈమధ్య కుటుంబ నియంత్రణం గురించి నేనొక స్నేహితునితో చర్చిస్తుండగా "సంఘ సంస్కారం అంటూ విధవా వివాహాలు జరుగుతుంటే జనాభా పెరగక ఏమవుతుంది. వెనుకటోళ్ళు ఆలోచించకే పూర్వాచారాలను కాదన్నారే చూశారా

★ వనితావాణి ★

ఫలితం. అందుకేగా పూర్వులు వితంతు వివాహాలు కూడదు అన్నారూ" అన్నాడు.

ఒక్క విషయంమాత్రం మనం మరచిపోకూడదు. సంస్కరణలన్నా అభ్యుదయ పురోగమనమన్నా గిటని నా 'స్నేహితుని' లాటి వరం యింకా దేశంలో ఉన్నది.

వీరివల్ల సంస్కర్తలంతా ఎన్నో బాధలు పడ్డారు. ఈనాడు మనం గురజాడ, కందుకూరివంటి పెద్దల జీవితాలనుండి కావలసిన మార్గాలను అన్వేషించి వారినే ఆదర్శంగా పెట్టుకొని యీ కుటుంబ నియంత్రణాన్ని కూడా జయప్రదం చేయవచ్చుని నమ్ముతున్నాను.

జాలూరు ఆదిశేషు, మైలవరం (కృష్ణాజిల్లా)

* * *

సోదరి హేమలతగారి వ్యాసంమీద జరిగిన, చర్చ నన్ను ఆశ్చర్య చకితుని చేసింది. "ఒక్కగానొక్క" పిల్లలున్న చోట, గారాబంచేత, పిలలు చెడిపోవడానికిగల అవకాశాలని ముఖ్యంగా తెలుగు కుటుంబాలలో వున్న పరిసితులను వివరించారు హేమలతగారు. అంతమాత్రంచేత, అందరూ అలాగే వుంటారని కాని, అందరుపిల్లలూ అలాగే చెడిపోతారనిగాని, ఆవిడ అనలేదు, ఎవరూ అనలేరు.

అతి గారాబంచేత పిల్లలు ఎలా చెడిపోతారో, ఒక్కసారి మనకుటుంబాలని, కలియచూసే ఎన్నో వందల సంఘటనలు కనిపిస్తాయి. ముఖ్యంగా 'ఒక్కగానొక్క' పిల్లలున్నప్పుడు, వారు ఆడపిల లయినాసరే, మొగపిల్లలయినా సరే—యీ అవకాశాలు ఎక్కువగా వుంటాయని అందరూ ఒప్పుకుంటారనుకుంటాను. హేమలతగారు చెప్పినవన్నీ ఒకేకుటుంబంలో జరగకపోవచ్చును. అదివేరే విషయం. అతి ముద్దుతోనూ, గారాబంతోనూ, ప్రేమతోనూ పిలలని పెంచితే, సంఘానికి ఎందుకూ కొరగానివారు అవుతారని, హెచ్చరించటమే హేమలతగారి ఉద్దేశ్యం. అంతమాత్రంచేత, ఎవరూ బుజాలు తడుముకోనవసరంలేదు.

ఎమ్. వి. చయనులు. (న్యూఢిల్లీ)

* * *

హేమలతగారు వ్రాసిన "ఒక్కగానొక్కపిల్ల" వ్యాసంలో తప్పుపట్టవలసిన అవసరం ఏమీ కన్పించటంలేదు. కొంతమంది వనితలు ఆ వ్యాసాన్ని అపార్థం చేసుకున్నారనడంలో సందేహంలేదు. హేమలతగారి వ్యాసంలో నూటికి నూరుపాళ్ళు సత్యంవున్నా — ఉదాహరణలకు కొన్ని సంగతులు తెలియబరచారు. అంతమాత్రం చేత రచయిత్రిగారు ఏదో సినిమాలో "ముద్దులకూతురి పాత్ర"చూచి ఏదో కొంత ఊహించి, కల్పించి చిత్రించినారనుకోవడం...హాస్యాస్పదం.

ఎం. కె. గంటి (సంగారెడ్డి)

* * * *

వేటపాలెంనుంచి శ్రీమతి లీలావతిగారు 4 2-59 వారపత్రికలో వ్రాసిన చిలకడదుంపలతో కొన్ని వంటలు చదివాను. బాగావున్నాయి. కాని చివరిలో లీలావతిగారు నిమ్మకాయరసం పప్పులో పిండేటప్పుడు నూనెపోపు వేయకూడదని వ్రాశారు. వేసే కూర చేదెక్కి పోతుందని వ్రాశారు. ఏకూరలోనైనా నిమ్మకాయరసం పిండితే నూనెపోపుకూడదనే వారి అభిప్రాయమా ? లేక ప్రత్యేకంగా ఆకూరకే తగదా? అరటికాయ మొదలైన కూరలను నిమ్మరసం వేసేటప్పుడు నేను నూనెపోపే వేస్తాను. మరి చేదెక్కకుండా బాగావుంటున్నాయి. ఆ కూరకే నూనెపోపు పెటకూడదేమో ? మిగతా వాటికి పెట్టవచ్చునేమో ? లీలావతి నా సందేహం తీరుస్తారని ఆశిసున్నాను. ఇది నేను కేవలం తెలుసుకోవాలనే అభిలాషతో నేను వ్రాస్తున్నానేకాని విమర్శ నా దృష్టితో కాదని సోదరి గ్రహిస్తారుకదూ ?

అదే పత్రికలో శ్రీమతి బి. ఇందిరారాజ్ (కర్నూలునుంచి) వ్రాసిన కుటుంబ నియంత్రణ శీర్షికలో 'పెద్దవాళ్ళు, ప్రతిబంధకాలూ' చాలాబాగుంది. నా ధన్యవాదాలు.

బి. దుర్గ. (జమేదార్‌పల్లి, ఒరిస్సా) ★

సమాధానాలు

1. కళా వెంకటరావు.
2. మొసలికంటి తిరుమలరావు.



కుమారి మెట్లపల్లి కృష్ణకుమారి

ఈమె బుద్ధవరం నివాసిని: ఇటీవల కలకత్తాలో ప్రఖ్యాతి సితార్ వాద్య నిపుణుడు రవిశంకర్‌తోపాటు నాట్యప్రదర్శన లిచ్చి ప్రశంస లందుకున్నది.

భర్తలను పొగడే భార్యలు

(49-వ పేజీ తరువాయి)

ఇక మూడవరకంవారు: వీరు భర్తలను మెచ్చుకోనకపోగా లేని లోపాలను తెచ్చిపెడతారు. ఇది వారి భర్తలపై ద్వేషభావంచేతనో మరెలగునో అర్థంగాదు. ఇటువంటివారు ఇంటోవారిని, అష్టకష్టాలుపెట్టి, కూడు చెఱువుల నీరు తాగించడమేగాక, బయటకు వచ్చి అందరి యెదుటా తమ భర్తలను హీనంగా మాటాడుకొంటారు. నిజంగా వీరు తమ భర్త, తన భర్తే తనకు భార్య అయినటు మాట్లాడతారు. ఇటువంటివారిని చూస్తే అందరికీ ద్వేషభావం కలుగుతుంది ఇతరులు వీరిని నీచపురుషులుగా చూస్తారు. వీరికంటె మొదటి రకం వారిని చాలా తెలుగొప్పవారిగా, మంచివారిగా లెఖ్ఖగడతారు. ఈ మూడోరకంవారు అట్లా జెప్పుకోనడం గొప్పనుకుంటారుగాని, దానికి వ్యతిరేకమని భావించరు.

ఈ మూడోరకం వారిలో ఇంకో గుణంవుంది. వీరు మొదటివారి[illegible] దూషిస్తారు. "అబ్బ ఆమెకే గనుక వున్నాడు లేకపోతే ఒక మొగుడు. ఎప్పుడూ అతన్ని పొగుడుకోటంతో కాలం పరిపోతుంది." [తనలాగా భర్తలను తిట్టుకోరని.] ★

★ న్యూఢిల్లీ లేఖ ★

(7-వ పేజీ తరువాయి)

మాన్యంలో కార్మికులుకూడా పాల్గొనాలని ఆయన యాజమాన్యానున్న సంస్థ నివేదికలు ప్రకటించింది.

ఇలాంటి పరిస్థితులలో ఆయన డైరెక్టరుగా ఉన్న సంస్థ రెండు వేలమందిని తొలగించటానికి ఎలా నిశ్చయించిందో, అందులో సమర్థులైన వారిని మళ్ళీ స్వీకరించటానికి ఎలా నిశ్చయించిందో దురూహ్యం.

అయితే, ఇలాగే ఒక పత్రిక డైరెక్టరు తన ఉద్దేశంలో అసమర్థులైన వాళ్ళని తొలగించటంకూడా సబబేనా? కలకత్తాలో జరిగిన ఒక సంగతి నాకు జ్ఞాపకం వస్తోంది. ఒక కంపెనీ తన ఉద్యోగస్థుల్లో కొందరిని బ్రాంచీలలో నియమించింది. దీనిమీద రిట్రెంచ్ మెంట్ పరిహారం ఇవ్వాలని లేబర్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది.

భారతీయ గణాంక సంస్థ ఆర్థిక వ్యవహారాలను బాగా అవలోడనం చేయవలసిన అవసరం ఉన్నది. అకౌంట్ గాని, ఆడిట్ గాని చెయ్యనక్కరలేకుండా ఈ సంస్థకి భారత సమష్టినిధినుంచి చాలా పెద్దపెద్ద మొత్తాలను మంజూరుచేస్తూ వచ్చారు. మంజూరుచేసేది పార్లమెంటే. కాని పార్లమెంటుకు దాని మీద ఏమీ అధికారం లేదు. ఆ సంస్థ వ్యవహారాలను క్రమబద్ధంచేసి, దానిపై పార్లమెంటుకు అజమాయిషీ అధికారాన్ని ఏర్పాటుచేందుకు మూడేళ్ళకిందట అందరి అనుమతి మీదా ఒక బిలును లోక్ సభలో ప్రవేశపెట్టారు. కాని సంస్థ అధికారులు ఇంతలో అభ్యంతరాలు చెప్పటంవలన నెమ్మదిగా ఆ బిల్లు మూలపడిపోయింది. అజమాయిషీ లేకుండా అడిగినంత డబ్బూ వస్తుంటే, సంస్థవారు అజమాయిషీకి ఎందుకు ఒప్పుకుంటారు?


* * *

ప్రచారానికీ, సమాచారానికీ కొంత తేడా ఉన్నది. ఈ మధ్య ప్రభుత్వం ప్రకటించే సమాచారం ప్రచారంగా తయారవుతోంది.

ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజీల ద్వారా ప్రభుత్వం ఉద్యోగాలివ్వటంగూర్చి మొన్న నొకసారి వెలువడింది. "ఖాళీఅయిన ఉద్యోగాల్లోకి, ముఖ్యంగా గుమాస్తా ఉద్యోగాల్లోకి ఎక్స్ఛేంజీలద్వారా మనుష్యులను తీసుకోని ప్రభుత్వశాఖల్లో ముఖ్యమైనది ఆడిటర్ జనరల్ ఆధ్వర్యంలో ఉన్న శాఖ," అని. దీనితో ఒక ముఖ్యమైన ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ప్రభుత్వోద్యోగాల్లోకి అర్హతనిబట్టి మనుష్యుల్ని తీసుకోవాలా, లేక ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజీలలో ఎవరుముందు పేరు నమోదుచేయించుకుంటే వారిని తీసుకోవాలా అని ప్రశ్న. స్నేహభావంతో ప్రవర్తించాలనే విధానం వలన పనిచేసే అలవాటూ తప్పింది. పనిలో సమర్థతా తగ్గింది. ఎంప్లాయ్ మెంట్ ఎక్స్ఛేంజీలమూలాన తరువాయి ఏమున్నా ఉంటే అది కూడా నాశనమవుతుంది. ★

గమనిక

. సచిత్ర వారపత్రిక 11.2.'59 తేదీ సంచికలో ప్రచురించిన "దొంగ సైకిల్" రచయిత అల్లూరి బసవరాజు కాదనీ అల్లూరి వెంకటనరసింహరాజు అనీ పాఠకులు గమనించ ప్రార్థన.



సినిమా

జరుగుతున్న వ్యవహారాలలో తగాయిదాలతో, జరగవల్సిన వాటికి వాయిదాలతో సతమతం కావడం పరిపాటిగా సాగుతున్న ఫిలిం పరిశ్రమ శ్రమ ఫలించబోతుందని ఇటీవలి స్థితిగతులు సూచిస్తున్నాయి.

ముడిఫిలిం కోటాను వాటాలు వేసే వ్యవహారాల ఎన్నికల వ్యవహారం సర్దుకు నిమిత్త పడింది. కేంద్ర సలహాసంఘం ప్రాంతీయ సలహామండలులు ఏర్పాటు అయ్యాయి. కార్యక్రమం స్థూలంగా రూపొందింది.

మంచి రోజులు

పోతే చలనచిత్ర కళలో శిక్షణ ఇవ్వటానికి నెలకొనవలసిన ఫిలిం ఇన్‌స్టిట్యూట్ స్థాపన వ్యవహారం మాటల స్థాయినుండి పెరిగి ఆచరణలోకి వస్తోంది. దీనికి ప్రణాళిక రూపొందించడానికి ఫిలింస్ డివిజన్‌లో అసిస్టెంట్ చీఫ్ ప్రొడ్యూసర్ కె. ఎల్. ఖాండ్‌పూర్ అనే ఆయనను ప్రత్యేకోద్యోగిగా నియోగించారు.

చాలకాలంగా చర్చలలో నానుతున్న ముడిఫిలిం ఫాక్టరీ సమస్యకూడా ఘనీభవించే ప్రమాదం దగ్గరపడింది. ఇది జరిగితే కోటాల సమస్యలు పోతాయని అందరికీ ఆశగా ఉంది; అయితే ఈసారిమటుకు మళ్ళీ మన చిత్రాల నడివి పొడుగుసాగదని దురాశగా ఉంది.

ఫాక్టరీ ఊటీలోనే నెలకొనడం ఖరారని

దీప్ అండ్ ప్రదీప్ వారి హిందీచిత్రం 'ఏక్ షోలా'లో ప్రదీప్‌కుమార్, మాలాసిన్హా.



మద్రాసు పరిశ్రమల మంత్రి ఆర్. వెంకటరామన్ ఇటీవల శాసనసభలో సూచించారు. ఈ నిర్మాణంలో సహాకరించవలసి ఉన్న తూర్పు జర్మన్ ప్రవీణుల బృందం కూడా ఇది అన్నివిధాలా యోగ్యమైన కేంద్రమని భావిస్తున్నారట.

ఊటీ బగులుగానో, దాని తిరవాతి మెట్టుగానో మెట్టుపాళెయంలో మరో ఫాక్టరీ నిర్మించవచ్చునని ఊహాగానం ఒకటి ఉంది. అది కేవలం అపోహాగానమని ఈమధ్య ఒక పుకారు షికారు తిరిగింది. గతవారం కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి మద్రాసు వాణిజ్య మండలిలో మాట్లాడుతూ అలాంటి ఆందోళన చెందవలసిన అవసరంలేదని అన్నారు. "మనదేశం అవసరాలనుబట్టి ఒక టేకాదు; ఇంకా ఒక టో రెండో ఫాకరీలు నిర్మించవలసి ఉంటుంది" అని ఆయన అన్నారు.

క్రొత్త కేటాయింపుల సంఘం

ముడిఫిలిం కోటాలో వాటాలు చేసి మంజూరుకు అర్హులను నిర్ణయించే కేంద్ర సంఘం ఏనముండుగురితో ఏర్పాటు అయింది. ఎగుమతి దిగుమతి వ్యవహారాల చీఫ్ కంట్రోలర్ ఎస్. ఎన్. బిల్‌గ్రామి అధ్యక్షులు.


మద్రాసు పరిశ్రమ ప్రతినిధులు: బి నాగిరెడ్డి. ఎ. రామయ్య. బొంబాయి తరపున మహబూబ్‌ఖాన్, జె బి. యాంగ్‌టా, కలకత్తా ప్రతినిధులుగా బి. ఎన్. సర్కార్, ప్రభత్‌కుమార్ ముఖర్జీ వ్యవహరిస్తారు. అఖిల భారత ఫిలిం ఫెడరేషన్ తరపున దాని అధ్యక్షుడు ఎం బి. బిలిమోరియా ఉంటారు.

మద్రాసు ప్రాంతీయ సంఘంలో ఎం. జి. రామచంద్రన్, ఎ. ఎల్. శ్రీనివాసన్, సి. వి. సుబ్బరామన్, సుందర్‌లాల్ నహతా, పి. ఎస్. రామకృష్ణరావు ఉన్నారు. కేంద్ర సంఘంలో ప్రాంతీయ ప్రతినిధులు కూడా ఈ ప్రాంతీయ మండలిలో సభ్యులుగా ఉంటారు.

ఇంతకుముందు వివాదాస్పదం అయిన ప్రయారిటీ సిస్టం - పాత పెద్ద నిర్మాతలకు మొదట కోటాలివ్వాలన్న పద్ధతిని విరమించి, అందరికీ న్యాయం చేకూరే విధానాన్ని అనుసరించడం వీరికి ప్రాతిపదిక, ఈ సంఘం ఇచ్చే సలహాల ప్రకారం ఎగుమతి దిగుమతి వ్యవహారాల శాఖవారు కోటాలు మంజూరు చేస్తారు.

బహుమతి నిర్ణాయక సంఘాలు

కొత్త సంవత్సరానికి ఉత్తమ చిత్రాలను ఎన్నిక చేసి బహుమతులకు సిఫార్సు చేసే కేంద్ర ప్రాంతీయ సంఘాలు ఒకరిద్దరి సమ్మతి మినహాగా ఏర్పాటు పూర్తిఅయింది.



సుధాకర్ ఫిలింస్‌వారి తొలికానుక "వచ్చినకోడలు నచ్చింది" లో రామారావు, జమున.

కేంద్ర సంఘానికి ఎస్. కె. సిద్ధాంతి అధ్యక్షులు. డి. ఆర్. ఖన్నా కార్యదర్శి. సభ్యులు: మోటూరి సత్యనారాయణ. బి. నాగిరెడ్డి, డా|| కె బి. బరూచా, రేణూ ముఖర్జీ, అమ్మూ స్వామినాథన్, బీగంజైదీ, ఆర్. డి. సిన్హాదివకర్, డా|| డబ్ల్యు. ఎస్. బార్లింగే, కె. ఎల్. చటర్జీ సభ్యులు. మరొకరిని నియోగించవలసి ఉంది.

మద్రాసు ప్రాంతీయ సంఘానికి అధ్యక్షుడు మోటూరు సత్యనారాయణ. కార్యదర్శి, సెన్సారుబోర్డు అధ్యక్షులైన జి.టి. శాస్త్రి. సభ్యులు: బి ఎన్. రెడ్డి, కె. చక్రవర్తి, కూ సి వెంకటేశ అయ్యంగార్, బి. సి. సుబ్బారామన్, బి. శ్రీనివాస్, ఎస్. మంజుభాషిణి, సౌందరం కైలాసం.

డాక్యుమెంటరీ చిత్రాల సలహా సంఘానికి కృష్ణా కృపలానీ అధ్యక్షులు. శాంతిలాల్ కార్యదర్శి. ★



మన నటులు: పెరుమాళ్లు

‘రోజులు మారాయి’ చిత్రం విడుదల అయిన కొంతకాలం తరువాత ఫిలింఫాన్స్ సంఘానికి చెందిన తెలుగు,తమిళ యువకులిద్దరు మాంబళంలో ఒక యింటికి వెళ్ళి సావిట్లో కుర్చున్నాయనను చూసి “అయ్యా పెరుమాళ్లు గారు ఇంట్లో ఉన్నారాండీ” అన్నారు.

“నన్నే పెరుమాళ్లంటారు. రండి కూర్చోండి” అన్నాడు పెరుమాళ్లు.

బొత్తిగా పరిచయం లేని పెద్దమనిషి తమతో ఇలా పరాచికం ఆడతాడేమో అని వారు కొంచెం తెలబోయినా మర్యాదకి నవ్వేసి, ‘వారితో కొంచెం పనుంది. దయచేసి పిలవండి’ అన్నారు.

ఎదటి మనిషే పెరుమాళ్లు అనీ ఆయన పరాచికాలాడటం లేదనీ పది నిముషాల తరువాత తేలింది.

* * *

ముసలివాళ్ళ వేషాలూ, సంసార సాగరంలో ఈది అలసిపోయి జలుబుపట్టి, జబ్బుచేసి దగిదగ్గి సినిమాటిక్ గా చనిపోయేవాళ్ళ వేషాలూ ధరించి, (వాటి రూపకల్పన, చిత్రణలలో దర్శకులు ఎంత పాతమూసలో పోసినా) ప్రాణంప్రతిష్ఠించి నిలిపి నడిపి ప్రేక్షకుల చేరుమాళ్లు తడిపించగల యువనటుడు పెరుమాళ్లు ప్రతిభకు పై సన్నివేశం చిన్న దాఖలా.

ఇలాటి దాఖలాలు ఆయన, ‘రోజులు మారాయి’ తరవాత కొన్ని చిత్రాలలో చూపెంచి, అచిరకాలంలోనే మంచి నటుడుగా మంచిపేరు తెచ్చుకున్నాడు.

దేశం మొత్తంమీద ఎవరికీ తీసిపోరనీ, అనేకులకన్న అనేక విధాల గొప్పవారనీ పేరు తెచ్చుకొన్న తెలుగునటులు కొందరి చలనచిత్ర ప్రగతిని పరిశీలిస్తే వర్తమాన పరిస్థితుల దృష్ట్యా “మంచినటుడికి మంచిరోజులు కావు.” అని అనుకోన మన సౌతుందీనాడు. ఒక చిత్రంలో ఒక తరహా పాత్రను సమర్థంగా నటించడం ఒక విధంగా అపరాధం కాబోలు అనిపించే రోజులు ఇవి. సూర్యకాంతం, రమణారెడ్డి, వంగర వగైరలలాగే ఈయన శక్తిసామర్థ్యాలకూ ఒక్కచోట ఆనకట్టగట్టి ఒక కాలవలోకి మళ్ళించారు. ఏలూరు కాలవలా అది అలా సూటిగా పోతోంది. అంతే.

ఈనాడు పెరుమాళ్ళు ఒక చిత్రంలో ఉన్నాడన్న వార్త. కథ అంతా ఊహించుకోటానికి ‘క్యూ’గా తయారయింది. ఆ పాత్రకు నేటి మేటి దర్శక రచయితలు చేస్తున్న రూపకల్పన, దాని ప్రభావం క్రింద పెరుమాళ్లు నటనా కూడా ఆయా పాత్రల దైన్యంపట్ల సానుభూతిబదులు, చిరాకు కలిగిస్తున్నాయి. రసానుభూతి బదులు నీరసానుభూతి కలిగిస్తున్నాయి. తెరమీద పెరుమాళ్లు వణుకుతూ మాట్లాడినా కంబళీ కప్పుకున్నా, దగ్గినా ప్రేక్షకులు కొందరు నవ్వుతుంటున్నారు.

సమర్థుడైన నటుడిని ఇలా దుర్వినియోగం చేసుకుంటున్న పరిశ్రమ, శరీరంలోనూ, సామర్థ్యంలో కూడా దార్ఢ్యంగల ఈ వ్యక్తిని కేవలం పేటెంటు ముసలి వేషాలకే కాక ఇతర విధాల సద్వినియోగం చేసుకునే మార్గం ఆలోచించడం న్యాయ్యం. ఈ తరహా నటుల పాత్రల తరహాలను మార్చితే తెలుగు సినిమా తరహావే మారి మరింత మెరుగవుతుందని ఒక సినీమనిషి అతిశయోక్తి.

ఇలా ఈ పాటికే జరగాల్సింది. ఎందుకు జరగలేదూ అంటే ఏఒకరినీ బాధ్యులనలేము. లోగుట్టు పెరుమాళ్ళకెరుక అని ఊరుకోడం కూడా భావ్యం కాదేమో.

వార్తాపరిణాం

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి సాంఘిక చిత్రం 'ఇల్లరికం' గతవారం సెన్సారు అయింది. నాగేశ్వరరావు, జమున జంటలో ముఖ్యపాత్రధారులు రేలంగి, సి.ఎస్. ఆర్., ఆర్. నాగేశ్వరరావు, అల్లు రామలింగయ్య మొదలగువారు పాల్గొన్నారు. రచయిత ఆరుద్ర. సంగీతం చలపతిరావు. దర్శకుడు తాతినేని ప్రకాశరావు. నిర్మాత అనుమోలు సుబ్బారావు.

* * *

పొన్నలూరివారి 'దైవబలం' చురుకుగా తయారవుతోంది. ఎన్. టి. రామారావు, జయశ్రీ, రేలంగి, రమణారెడ్డి, ముక్కామల, గిరిజ, మాలతి మొదలగువారు నటిస్తున్నారు. మాటలు పరశురాం. పాటలు సముద్రాల అనిసెట్టి వ్రాస్తున్నారు. సంగీతం అశ్వత్థామ సమకూర్చారు. దర్శకుడు, నిర్మాత పి. వసంతకుమార రెడ్డి.

* * *

సుజనా ఫిలింస్‌వారి 'సతీతులసి' చిత్రనిర్మాణం పూర్తికి వచ్చింది. ఎస్. వరలక్ష్మి, కృష్ణకుమారి, గుమ్మడి, అమర్ నాథ్, చదలవాడ కుటుంబరావు పాల్గొంటున్నారు. సంగీతం పామర్తి. దర్శకత్వం మధుసూదనరావు.

* * *

బి. ఎస్. రంగా గారి క్రొత్తచిత్రం 'రాజా మలయసింహ' ఈ నెల ఆఖరువారంలో విడుదల అవుతోంది. రంజన్, రాజనాల, జానకి, పద్మనాభం నటించారు. రచయిత అనిసెట్టి. సంగీతం విశ్వనాథం, రామమూర్తి.

* * *

త్వరలో విడుదలకాగల మరో చిత్రం నవశక్తి ఫిలింస్‌వారు హైదరాబాద్ సారధి స్టుడియోలో నిర్మించిన 'మాయింటి మహాలక్ష్మి'. జమున, సూర్యకళ, హరనాథ్, గుమ్మడి, రమణారెడ్డి, కృష్ణారావు మొదలగువారు పాల్గొన్నారు. ఈ చిత్రానికి దర్శకుడు జి. రామినీడు.

* * *

స్వస్తిశ్రీ అండ్ విజయవారి జానపద చిత్రం 'రేచుక్క పగటిచుక్క' చాలవరకు పూర్తిఅయింది. ఏప్రిల్ లో విడుదల కావచ్చునని తెలుస్తూంది. ఎన్.టి. రామారావు, రంగారావు, సావిత్రి ముఖ్యనటులు. రచయిత సముద్రాల జూనియర్. సంగీతం టి. వి. రాజు. దర్శకుడు కమలాకర కామేశ్వరరావు. నిర్మాత ఎన్. త్రివిక్రమరావు.

'రాక్ ఎండ్ రోల్' తరవాత మళ్ళీ అంత చేటు చేటు తెచ్చిపెడుతుందని అమెరికాలోనూ, ఇతర దేశాలలోనుకూడా శాస్త్రజ్ఞతగల పెద్దల విమర్శలకు గురిఅయినది ఏదీ రాలేదు. అలా జడ్జీ కేకలూ జంకగొంతులు ఆర్చే లేకపోయినా, మొత్తంమీద సంసార పక్షం జనానికీ సెన్సారపక్షం వారికీ కూడా ఎబ్బెట్టుగా కనిపించగల మరోరకం డాన్సులాటిది ఒకటి దిగుమతి అయింది. దాని పేరు "హూలాహూప్" ఇది మొన్ననే బొంబాయి విక్టోరియా ఉన్నత స్కూల్లో చక్కర్ కొట్టి కన్యాసానం చిత్రసీమ చేరుకుంది. సినీ తొలి అవకాశమిచ్చిన దర్శకనిర్మాత ఐ. ఎస్. జోహార్. అతని సొంతచిత్రం బేవకూఫ్‌లో గతవారం మాలాసిన్హా, సినీగుమ్మగు ప్రాణ్ ఈ 'హూలాహూప్' కు నడుకట్టారు. నడిబిగించి. చేయాల్సిన డాన్సే ఇది. త్వరలోనే మిగతా చిత్రనిర్మాతలు కూడా వేలం వెర్రిగా ఇది ప్రవేశపెట్టరని మా మిత్రుడితో వాదించి పందెంకడితే ఓటమి మాదే అవుతుంది.



దీప్ అండ్ ప్రదీప్‌వారి హిందీ చిత్రం 'ఏక్ షోలా'లో శుభాఖోటే.



శారదా ఫిలింస్‌వారి 'జయభేరి' చిత్రంలో నాగేశ్వర రావు.

వార్తావరణం

అప్పుడే శోభన సమర్థ్ తన తనూజ తనూజను, రవీన్ మెహ్రా అనే యువనటుడికి ఈ విద్యలో శిక్షణ ఇప్పిస్తోంది. ఆమె కొత్త చిత్రంలో నాయికగా తనూజనూ, ఈ యువనటుడినీ పరిచయం చేయబోతోంది. మిగతా వాళ్ళు కూడా ఈ హాలీవుడ్ విద్యను హడావుడిగా నేర్చుకుంటున్నారు.

* * *

'హులాహూప్' డాన్సు శరీరం అంతటికీ శ్రమ కలిగించే మంచి పరిశ్రమ. దీనికి ఒంట్లో జవసత్వాలు ఉండాలి. కీళ్ళు సడలినా, వయసు మళ్ళినా ఇది చెయ్యడం దుస్సాధ్యం. అంతేకాక, ప్రబంధాలలో అతిశయోక్తులవలె, శరీరం బాగా లావు అయితేకూడా ఇది చాలా కష్టం. ఎందుకంటే, ఒక ఇనపరింగును-గజన్నర వ్యాసం గలదానిని మెడకి తగిలించుకుని ఒళ్ళు ఒడుపుగా ఊపడం ద్వారా ఈ చక్రాన్ని తిప్పుతూ మెల్లిగా మెడనుండి కాళ్ళదాకా దింపుకురావాలి. కిందపడకుండా ఎంతసేపు నిలిపితే అంత గొప్ప.

ఎంతగా కళ్ళు చిట్లించుకు చూసినా, ఏవిధంగానూ సింహేంద్రమధ్యలు అనిపించుకోడానికి సదుపాయంలేని బొంబాయి హీరోయిన్లు ఈ గారడీని ఎలా చేస్తారో, ఊహాకి అందటంలేదని ఒకాయన భయపడ్డారు. లేదా క్రికెట్ ఆటలాగే పారడీచేసి కాలక్షేపం అనిపిస్తారేమోఅని సందేహపడుతున్నాడు.

* * *

మొత్తానికి 'హులాహూప్‌ని' 'బేవకూఫ్' మనకు పరిచయం చెయ్యడం జరుగుతుంది. ఇదికాక హెలికాప్టర్లతో బొంబాయిమీది విను వీధిలోనూ, ప్రజలు చను వీధిలోకూడా కలవరం కలిగించే సన్నివేశాలుకూడా ఇందులో ఉంటాయి. ఇవికాక కిషోర్‌కుమార్, ఐ. ఎస్. జోహార్‌ల అల్లరి ఉంది. జోహార్ హెలికాప్టర్ తోలుతూ ఉంటాడు. దానికి తాడుపోసి, ఆ చివర కిశోర్‌కుమార్ వ్రేలాడుతూ ఉంటాడు. ఇలా వాళ్ళిద్దరూ బొంబాయి నగరంమీద, బాగా కిందుగా షికారు చేస్తారు. కిందని వీధులలో ప్రాణ్, కారుమీద వాళ్ళని తరుముతూ ఉంటాడట.

ఈ చిత్రానికి సచిన్‌దేవ్ బర్మన్ సంగీత దర్శకుడు.

* * *

రూప్‌మాయా ఫిలింస్ వారు 'హం రహీ' అనే చిత్రం తీస్తున్నారు. శ్రామిక పారిశ్రామిక సంబంధాలూ, సమ్మెల మంచి చెడ్డలూ ఇందులో చర్చిస్తారట. చర్చతో ఆగక కార్మిక సమస్యలని పరిష్కరించి పారేసే సంకల్పం ఉన్నట్టు వీరి ప్రకటనవల్ల పసిగట్టవచ్చు. ఇందులో దేవానంద్, నిమ్మీ, మాలా సిన్హా, జోహార్ పాల్గొంటున్నారు. సంగీతం శంకర్, జైకిషన్. దర్శకుడు కార్తిక్ చటర్జీ. ★

ఆరు తెరలమీద నెపోలియన్ కథ

మిగతావాళ్ళకన్న కొంతముందరగానే పుట్టి పెరగడంవల్ల నేకాక ప్రజ్ఞాప్రాభవాలవల్ల, సాహసోపేతమైన ప్రయత్నాలవల్ల ప్రయోగాలవల్ల గౌరవనీయుడు అనిపించుకొన్న చలనచిత్ర దర్శక నిర్మాతలలో అగ్రగణ్యుల శ్రేణికిచెందిన ఫ్రెంచి కళాకారుడు ధీశాలి, ప్రయోగశాలి అయిన ఏబెల్ గాన్స్ ఇపుడు చలచ్చిత్ర చరిత్రలో సరికొత్త అధ్యాయం సాధిస్తున్నాడు. ఇది ఆరు తెరలమీద చిత్రాన్ని ప్రదర్శించడం. ఈనాటి 'వైడ్‌స్క్రీన్'కు 30 ఏళ్ళక్రితం నాంది ప్రస్తావించి తొలిసారి పెద్దతెరమీద చిత్రంతీసి చూపిన మార్గదర్శకుడు ఈయనే. మూడు ప్రాజెక్టర్లతో చిత్రాలను ప్రసారం చేస్తు ఆనాడు ఆయన 'నెపోలియన్' చిత్రం ఆరంభించాడు. తేడా ఒకటేఉంది. ఇప్పటి 'సినేరమా'వలె మూడు ప్రాజెక్టర్ల తాలూకు చిత్రాలు ఒకచోట పడవు. ఇప్పటి పద్ధతి బొమ్మలో హద్దులు వెల్లువ కాక, దూరాన్ని (లోతును తెలుసు) స్ఫురింపచేస్తుంది. గాన్స్ అలాకాక తెరని మూడుభాగాలుగా వాడుకుని దానికి ప్రేక్షకుడి ఊహనుకూడా కలుపుకొని తమాషాలుచేసి ఆడుకున్నాడు. నెపోలియన్ చిత్రంలో నెపోలియన్ క్లోజప్ తెర మధ్యభాగంలో చూపి, ఎడాపెడా ఉన్న రెండు భాగాలలోనూ అతని యుద్ధనీతికి సాధనంఅయిన సేనావాహినిని లాంగ్‌షాట్‌లోనో, డిస్టెంట్ లాంగ్‌షాట్‌లోనో చూపించాడు. అలాగే కెమెరాతో కూడా ఇంకా అనేకరకాల ఆడుకున్నాడాయన. కథలో వ్యక్తి దృష్టిలోంచి పరిసరాలను చూపే శిల్పం—ఉత్తమ పురుష ప్రయోగంలో ఆయన ప్రవీణుడు. ఒక మంచుబంతి దొర్లుతున్నపుడు అందులోంచి చూస్తే లోకం ఎలా కనబడుతుందో చూపడానికి కెమెరానే నేలమీద దొర్లించి వేశాడు. 'నెపోలియన్' చిత్రంలో నే ఫ్రెంచి జాతీయగీతం 'మార్సెలెయిస్' పాటను చిత్రిస్తున్నపుడు కెమెరాను గాయకుడి మెడకు తగిలించి నడిపించాడు. దీనిద్వారా, ఆ పాట పాడేటపుడు గాయకుడి కదలికలలో ఆపాటకి భౌతిక అనువాదాన్ని వ్యాఖ్యాని స్ఫురింపచేయడం ఆయన లక్ష్యం. సినిమా అనేది కిరణసంగీతం అని గాన్స్ నమ్మిక. వెలుగు నీడలు, వాటి కదలికలు స్వరాలలా పలకాలి. ఎడిటింగ్ మాత్రా ఛందస్సులో పద్యంలాగా యతిశతాలతో ప్రాసక్రీడలతో దృశ్యాలను

నడిపి, లయ పలికించాలి. బొమ్మకి బొమ్మ కలపడంకాక, బొమ్మని బొమ్మతోనూ, ఊహతోనూ గుణించి కొత్త భావాలు కట్టాలి.

ఏబెల్ గాన్స్‌కి ఇపుడు 70 ఏళ్లు. ఎంతో పరిశోధనచేసి ఇప్పుడీ 'ఆరుతెరల' ప్రయోగం ఆరంభిస్తున్నారు. దీనిమీద ఆయన తిరిగి నెపోలియన్ కథనే చిత్రిస్తారట. కారణం 1927 లో ఆరంభమైన ఆ చిత్రం నాలుగేళ్లు సాగినా పూర్తికాలేదు. ఈసారి తిరిగి కథ మీద కూడా పరిశోధనలు జరిపి, దానిమీద రాలిన కాలచక్రపు ధూళి దులిపి, ఇంకా వాళ్ళూ వీళ్ళూ వేసిన రంగులు చెరిపి ఆ వ్యక్తి చరిత్రను సక్రమంగా చిత్రించ దలుచుకున్నట్టు ప్రకటించారు. ముఖ్యపాత్ర ఎవరు ధరించేది తేలలేదు.

ఎట్నించ ఎటొస్తుందో ఎందుకేనా మంచిదని దీన్ని సినిమాస్కోప్‌లో కూడా తీస్తారట. చిత్రం పేరు "ఫ్రమ్ ఆస్టర్లిట్జ్ టు సెయింట్ హెలీనా." ★

అస్పృశ్యతపై చిత్రం

అస్పృశ్యతా దురాచార నిర్మూలన కార్యక్రమం పేరిట, ఇది కథావస్తువుగా తీసుకొని ఉత్తమ చలన చిత్రం నిర్మించిన వారికి 25 వేల రూపాయలు బహుమతి ఇవ్వదలచినట్లు బొంబాయిరాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది బొంబాయిలో తీసే చిత్రాలకే నట. చిత్రం హిందీలో తీయడం వాంఛనీయమనికూడా ప్రభుత్వ ప్రకటన సూచించింది.

నిర్మాణంలోఉన్న చిత్రాలలో బిమల్‌రాయ్ తీస్తున్న 'సుజాత' ఈ కోవదని తెలుస్తూంది. మరి ఒకరిద్దరు కూడా ఇటుపై ఈ ప్రయత్నానికి ఉపక్రమించవచ్చు ననుకుంటున్నారు. ★

ఖర్గపూర్ నాటకకళాపరిషత్తు

[16-వ పేజీ తరువాయి]

చేరి, ఘనతంతులైన నటులెందరో వున్నారు."

పరిషత్ తరఫున కార్యదర్శి శ్రీ శశిభూషణ్ శాస్త్రి గారు నిర్వాహకుల నివేదికను చదివి వినిపించారు. ఆ నివేదికలో— "ఈనాడు మనం జరుపుకుంటున్న ఈ చిన్న నాటకోత్సవాలు పై ఏడాదికి పూవులు తొడిగి కాయలు కాచి మరింత ఫలప్రదమయేందుకు మీ సహాయ సహకారాలు ఎతైనా కావల్సి వుంటుంది. పారిశ్రామికంగా మన ఆంధ్ర దేశం ఎంతో వెనకబడివుండటంవల్ల తెనుగు ప్రజ బ్రతుకు తెరువుకోసం, పరరాష్ట్రాలకూ, పరదేశాలకూ వలసలుపోతున్నారు: అలా వలసలుపోయినవాళ్ళల్లో ఎందరో "గట్టివాళ్ళు" వున్నారు. వారికి చేయూతనిచ్చి, వాళ్ళల్లో అంతర్గతమైవున్న కళానిధిని సానపట్టి ప్రోత్సహించాలనే సదుద్దేశం "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" వారికి మూడేళ్ళక్రితమే కలిగింది. అది ఈ నాటికి ఫలించింది. ఈ రాష్ట్రేతర ప్రాంతంలో వుండికూడా, ఆధునిక లలితకళలకు ఆయువుపట్టయిన వంగదేశం నడిగడ్డమీద, తమ జాతి సంస్కృతిని, సాహిత్యాన్ని, కళనూ, వంగీయులకూ మిగతా జాతులవారికీ ప్రదర్శించి. మన ఆంధ్రమాత గొప్పదనాన్ని ప్రదర్శించుకు నే అవకాశం ఈ నాటికి కలిగింది. ఆంధ్ర ప్రభుత్వం వారూ ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీవారు కూడా ఈ ప్రవాసాంధ్రుల్లోని కళాకారులను తమతమ సంఘాల్లో సభ్యులుగా చేర్చుకుని, కొంత మంది ప్రవాసాంధ్రులకు న్యాయం చేకూర్చ గలరని ఆశిస్తున్నాం," అని వుంది.

తరువాత నాటికల పోటీలు ప్రారంభమయాయి. పోటీల్లో ఎనిమిది నాటికలు ఒక ప్రత్యేక ప్రదర్శన ప్రదర్శింపబడాయి.

ఉత్తమ ప్రదర్శన, ప్రథమ బహుమతి— "మానవుడు" నాటికను ప్రదర్శించిన ఆంధ్ర సమితివారికీ, ద్వితీయ బహుమతి "ఈ యిల్లు అమ్మబడును" ప్రదర్శించిన 'మిత్ర సమాఖ్య' వారికీ వచ్చినవి. ఉత్తమ నటుడు, ప్రథమబహుమతి "ఏమి జీవితాలు" లో నటించిన శ్రీ పి. జి. కాశ్యప్ గారికి; ద్వితీయ బహుమతి, "స్వప్న సీమ"లో నటించిన శ్రీ కె. వి. ఆర్. మూర్తి గారికి లభించినవి. ప్రథమ బహుమతి పొందిన శ్రీ కాశ్యప్ గారికి, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారు ఇచ్చిన రోలింగ్ కప్ కూడా బహూకరింపబడినది.

ఇవిగాక, ప్రత్యేక బహుమతులు నాగశ్రీ రచించిన 'కళకోసం'లో శరభలింగంగా నటించిన శ్రీ ప్రసాద్ గారికీ, కుమారి ప్రయాగ అన్నపూర్ణకూ, "ఈ యిల్లు అమ్మబడును" లో విశాలాంధ్రుడుగా నటించిన శ్రీ జె. వి. శ్రీరామమూర్తి గారికీ, "ఏమి జీవితాలు"లో ముగ్గేశం అయ్యర్ గా నటించిన శ్రీ చింతల అప్పారావుగారికీ లభించాయి.

ఉత్సవాలు ముగించేముందు "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" ప్రముఖసభ్యులైన శ్రీ ఆతి జగన్నాథం పంతులుగారు—రాష్ట్రేతరాంధ్రులు నాటకాలు వేస్తూ ఎదుర్కొనే చిక్కులను వివరించారు: "నాటకంలో ఒక స్త్రీ పాత్రవుంటే, ఆమెను ఏ రాజమండ్రినుంచో, విజయవాడనుంచో, కాకినాడనుంచో, తెప్పించుకోవల్సి వస్తుంది. ఇంతా ఆమెకింత రానూపోనూ రైలుఖర్చులు భరించి తీసుకువస్తే, ఆ అమ్మ వేషం వేసేందుకు కనీసం 40 రూపాయలనుంచి 60 రూపాయలవరకూ అడుగుతుంది. పైగా ఆవిడ ఒంటరిగా రాదు. ఆవచ్చిన శ్రీ మారికో, పక్కింటిగాడికో టిక్కెట్ కూడా మేమే పెట్టుకోవాలి. అలా ఆమెకిందే దాదాపు 150 రూపాయలు ఖర్చవుతుంది. హాలుకు ఒకరాత్రికి 60 రూపాయలు అద్దె. ఇవిగాక, కుర్చీలకు మరో 50 రూపాయలు. అంతాచేసి ఖర్చు రు. 350/-అవుతుంది. నష్టం నాటకం ఒకటికి రెండొందలు.

"ప్రోత్సాహిక నాటక సమాజాలవారు సాంఘిక నాటకాలాడుకుందామంటే ఇదీ గొడవ. కాని, అదే ఖర్గపూర్ లో ఏ 'చింతామణో' ఏ 'హరిశ్చంద్రో' ఏ 'రామాంజనేయ యుద్ధమో' లేక 'గయోపాఖ్యానమో', 'తులాభారమో' 'కురుక్షేత్రమో' ఆడితే మూడువేల రూపాయలు రాల్తున్నాయి. ఇదే కారణంగల డాక్టర్ రాజారావుగారి ట్రూప్ చేత "భయం" ఆడించాలంటే చాలా భయంగావుంది. డబ్బులురావు. అలాంటి విషమపరిస్థితుల్లో మేం ఇంత పెద పరిషత్తుని ఏర్పాటుచేయడం కేవలం ఉత్సాహంతోనే.

"మాకు ఏ ప్రభుత్వం అండదండలూ లేవు ధనవంతుల సహాయమూ లేదు. కేవలం ఉత్సాహంతో సాహసించి ఇంత పెద్ద కార్యభారాన్ని నెత్తిన వేసుకున్నాం" అని "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" సమాఖ్య సంగ్రహ చరిత్రను చెబుతూ అది 1955 నుండి సాధించిన ఘనకార్యాలను ఉద్ఘాటించారు. మొన్న 1958 అక్టోబరులో రాజమండ్రిలో జరిగిన నాటకోత్సవాలో శ్రీ యన్. ఆర్. నందిగారి "పుణ్యస్థలి" నాటికను ప్రదర్శించి, ప్రదర్శనకు ద్వితీయ బహుమతిని. రెండు ప్రశంసా పత్రాలను సంపాయించింది "ప్రవాసాంధ్ర ఆర్టిస్ట్స్" సమాఖ్య. ఆ ఘనత మాకేకాదు, ఖర్గపురాంధ్రు లందరికీ చెందుతుంది అన్నారు.

పోటీలో నటించిన వారికి, రసాయనిక శాస్త్రోపన్యాసకులైన డాక్టర్ యమ్ వరసింగరావుగారు (ఐ. ఐ. టి.) బహుమతులు పంచిపెటారు. ఈ నాటికలు చూచిన తరవాత స్త్రీలు తమతమ భర్తలు నాటకాల్లో వేషాలువేసి ఇంటిపట్టున ఉండటంలేదని మూతి ముడుచుకోకుండా వుంటారని భలోకీ విసిరి ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించారు.

పరిషత్ కార్యదర్శులైన శ్రీ శశిభూషణ్ శాస్త్రో, శ్రీ యన్. ఆర్. నందిగార్ల వందనసమర్పణతో నాటకోత్సవాలు జయప్రదంగా ముగిశాయి. ★

★ నాన్న వొద్దన్నాడు ★

(26-వ పేజీ తరువాయి)

'సినీమాలో చేరిపో!' అన్నాడు సూర్యం వొళ్ళుమండి.

'చేరడంమాటకేం గానీ, సినీమాకివెళదాం పదూ. దిక్కుమాల్ని ఇలు ఎంతసేపూ తిన్నా కూచోనూ తిన్నా కూచోనూ. చెక్క ఇదిగో వుంది!' అంటూ మిగిలిన తమ్ముణ్ణి కూడా వెంటబెట్టుకు వొచ్చింది.

మరో నాడు కంపెనీకి శెలవయితే సాయంకాలం పూట రోడ్డుమీద తిరుగుతుంటే కనిపించి 'అమ్మయ్య మీ ఆఫీసుకి శెలవని తెలియక అక్కడికెళ్ళాను!—ఇవాళ నువ్వు మా కాలేజీకి రావలిసిందే! మా కాలేజీలో ఫంక్షనుంది. నేను పాడుతాను చూద్దుగాని పద' అంటూ పట్టుకుంది. ఇద్దరు స్నేహితులు తనతో వున్నారని తనంటే 'వాళ్ళనికూడా రమ్మనూ! కాలేజీలో కుర్చీలు కరువా ఏం?' అంది.

కాంతం సినిమాపాటలు పాడింది. త్యాగరాజ కృతొకటి జయదేవుడి అష్టపదొకటీ సినీమాల్లో వొస్తే అది పాడింది. అవి పాడాక ప్రేక్షకుల్లోంచి 'నాకెందుకో గోలు' పాటలన్నా పాడమని చీటీలు వెళ్ళాయి. సూర్యం లేచొచ్చేడు.

సాయంకాలం ఆఫీసుకి వొచ్చేసి తోచకం లేదంటే తనే సినిమాకి తీసికెళ్ళాడు.

* * *

కాంతం ఇంట్లోవుంటే ఒకలా వుంటుంది.

రోడ్డుమీదా, సినిమాలోనూ ఇంకోలా వుంటుంది.

అదే సూర్యానికి అర్థమవలేదు.

రెండిట్నీ క్రోడీకరించలేక పోయాడతను.

ఇంట్లో వుంటే—

సింపిల్‌గా ముద్దుగా మొహమాటంగా వుంటుంది మరీ బలవంతంవొచ్చినప్పుడుగాని ఒళ్లు మండేటట్టు మాట్లాడదు

ఎంతసేపూ ఇల్లు నీటుగా వుంచడం గోడలకి మంచి బొమ్మలకేలండర్లూ గుమ్మాలకి రంగురంగుల లేసులతోలూ వేలాడగట్టడం, టేబిలు క్లాతుమీద ముడతలుపడకుండా సర్దడం—ఇవి మరిచిపోకుండా చేసేను.

బీరువాలో పుస్తకాలు అడ్డదిడ్డంగా వుండకూడదు. టేబిలుమీద పౌడరుడబ్బా స్నోసీసా, హేరాయిలు బాటిలూ వుండొచ్చు గాని వాటి వాడుక వల్ల ఏమాత్రం ధూళీ, ముద్దా మరకో ఏం వుండటానికి లేదు.

మంచినీళ్ళూ, కాఫీ, టిఫినూ ఇలాటి వెవరికయినా ఇస్తే చాలా ఒద్దికగా నీటుగా ముస్తాబుగా యివ్వడం.

ఇలాంటి గృహకృత్యాల్లో మెలకువలు చాలా యిష్టం సూర్యానికి. ఇంటిదగ్గిర అతనో అరగంట కూచుంటే ఆ అరగంటా అతను కాంతంలో యీ అలంకార ప్రియత్వం గమనించేవాడు.

వీధిలోకెళ్తే,—

తోచ పాడూగుదా వినయమనక, భయమనక వాగుతుంది.

కనపడినాళ్లినలా వెక్కిరిస్తుంది. వొంకర్లు పెడుతుంది.

సమయసందర్భానుసారంగా ఏవో చూపించి ఛలోక్తులు విసురుతుంది.

మొహమాటంలేకుండా అన్ని ప్రశ్నలూ అడుగుతుంది.

ఫ్రీగా కాఫీహోటళ్లకి వొచ్చేస్తుంది.

పలుగురూ ఏమనుకుంటారో అన్న బెదురు లేనట్టుంటుంది.

చూస్తే యీ రెండోకూడా సూర్యానికిష్టమే, అతనికో భయం వున్నప్పటికీనీ.

అతనందుకే భయపడాడు.

తనది కానివస్తువు కాంతం—రెండు రకాలుగా.

ఒకటి—వాళ్ళ నాన్న అలాటయిడియా పెట్టుగోవొద్దని పదిసార్లుమీద చెప్పడం.

రెండు—వాళ్లకి బావవుండడం, అతన్ని కాంతం ఓపక్క వెక్కిరించినా ఇవపడ గలగడల—(కాంతం ఎవర్నయినా వెక్కిరించగలదు, తనని కూడా...)

తనది కానటువంటి ఈ వస్తువు (!) నితను ఇవపడి ఎప్పటికీ ప్రయోజనం లేకపోగా ప్రమాదం—

కాని ఇష్టంతో సంబంధంలేనిది హిస్టరీ-

ఓసారి అతను కుర్చీలో కూచుని ఏదో చదువుతూ కాంతంతోటి మాటాడుతున్నాడు; వాళ్ళ నాన్న ఝామ్మని వీధిలోంచొచ్చి 'మాకావా! మీ బావ, రేపు ఇరవై వొకటిని వొస్తున్నాట. ఈసారి కాకినాడా వొస్తున్నాను మామయ్యా, కాంతం ఇంగిలీషు మాటాడకపోతే వొప్పుగోనంటూ ఈ తరం రాశాడు' అన్నాడు

కాంతం టేబిలుమీద ఫ్లవరువేజులో కొత్తరకం కాయితప్పూలు పెడుతూ, ఇటు తిరిగి 'ఇరవై వొకటా! ఇంకా పదిరోజులుందిగా?' అంది.

ఆయన వినిపించుకోకుండా 'రాజమండ్రీ నించి సోమశేఖరంగారనీ, లెక్చరరుగారు వాళ్ళబ్బాయిని తీసుకొని రేపు మధ్యాహ్నం మాడింటికి వొస్తారే!' అంటూ లోపుకి వెళ్ళాడు.

'వాళ్లెవరు?' అన్నాడు సూర్యం.

'ఏమో!'

'పెళ్ళివారనుకుంటానే?' అన్నాడు సూర్యం, ఓ నిముషం వుండి.

'ఇంతట్లో ఆయనొచ్చి 'ఆc. పెళ్ళివారే. సోమశేఖరంగారని, రాజమండ్రీ కాలేజీలో లెక్చరరుగారబ్బాయట; యూనివర్సిటీలో డాక్టరేటుకి చదువుతున్నాట్ట—' అన్నాడు ఉత్సాహంగా.

'చేసేయండి వేగిరం పెళ్ళి. ఇహ కాంతాన్నింట్లో వుంచకూడదు. ఒళ్ళూ మనసూ పూర్తిగా ఎదిగిపోయింది' అన్నాడు సూర్యం.

"నువ్వొకడివా ఏమిటి! మా నాన్నకి సాయం?" అంది కాంతం.

"ఏం పెద్ద కబుర్లెందుకు, పెళ్ళాడ మెప్పటికి తప్పదూ, ఆడపిల్లవి గనక! ఈడొచ్చింది గనక అసలే తప్పదూ. మంచి సంబంధం దొరికితే అంతకంటే తప్పదూ ఎన్నాళ్ళిలా అడివిలో సింగిలా సరదా తిరుగుదామనుకుంటున్నావ్?" అని సూర్యం నవ్వాడు.

'చాల్లెద్దూ' అని ఇంట్లోకి పోయింది కాంతం.

"మంచో చెడ్డో, చిన్నవాణ్ణి చెప్పేనను కోక, వోపదివేలు పోతే పోయింది. బాగా చదువుకున్న వాడికే ఇచ్చి చెయ్యండి, విధవ భూములున్నాయని చదువులేని వాడిచేతులో పెట్టక! భూముల్ని నమ్మి జమీందారుల మయ్యాము?" అన్నాడు సూర్యం.

'అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఇప్పుడు, నా మేనల్లుడైనా, ఇంటరు రాజమండ్రీలోనే పేసయ్యాడు. బియ్యేడి ఎప్లయి చేశాడు, సీటు ఎంతకీ రాకపోతే ఎందుకైనా మంచిదని వో అయిదువే లుచ్చుకుని మెడ్రాసు వెళ్ళేడు. మరి ఏ కారణంవల్లో, సీటు దొరికిందే గాదు. ఛస్, సీటు దొరకలేదంటూ ఇంటికేం వెడతానని అలా బెంగుళూరు వెళిపోయి అక్కడ ఏదో మెకానిక్స్ చదివి ఇప్పుడు బెంగుళూర్లోనే సెటిలయి పోయాడు. వాడికేనా ఏం తక్కువలేదు. టూఫిఫ్టీ డ్రా చేస్తాడు. రాజమండ్రీలో వాడిదుంది. పాతిక వేలు చేస్తుంది. వెనకా ముందూ ఇద్దరన్నదమ్ములున్నారనుకో—ఎవరుద్యోగాలు వాళ్ళు చేసుకుంటున్నారు'

'అయినా సరేనండీ—పిల్ల శుభ్రమైనదీ, తెలివయింది, చదివిందినూ. వెనకటి మాటలాగున్నా యిప్పుడు కులహీనమైనా సరే విద్యాహీన ముండకూడదు. అలాంటప్పుడు పెద్ద సమ్మంధమయినా సరే, ఆ యమ్మే పేసయి నతన్ని వొదలకండి. ఎప్పటికయినా. మా వారూ, ఇంటరింటరే, యమ్మే యమ్మేవే!'

'ఎంతమాటా! అందుకేగా, వాళ్లొస్తామంటే రమ్మని రాసి పడేశాను?'

* * *

సూర్యం తన్ని తాను సముదాయించుకో వలసి వచ్చింది.

మందలించుకోవలసీ వచ్చింది.

మనసా, నేన్నిక చాలా రోజుల్నుంచీ చెబుతున్న దేమిటీ, అని. వాళ్లు నిన్ను ఆ లెక్కలోంచి ఎప్పుడో తీసేశారు. ప్రత్యేకించి ఆయన ఆది సిషూరమూ అమ్మాయి ఏకవచన ప్రయోగమూ, నిర్మొగమాటమూ చూసైనా బోధపర్చుకోని నిన్ను ఏమనాలీ అని? అవును. వాళ్ళకి ఏంపొరపాటు లేదు. వాళ్ళేమీ తప్పుదారి తొక్కించ లేదు. అందులో అతను-తను తప్పుదారి పట్టబోతూ వుంటే మందలించాడు. కాని సూర్యానికి ఒక్కటి బోధపడలేదు.

తను అలా ఆలోచించి బోధపడ్డంలేదని బాధపడక్కర్లేదసలు. కాని అతను అలా వుండలేకున్నాడు.

తను ఆఅమ్మాయిని పెళ్లాడ్డానికి పనికి రాడా?

ఎందుకు పనికిరాడు?

తను బి. యస్సీ పాసయ్యాడు. నూట పాతికరూపాయలే ప్రస్తుతం కంపెనీ ఇస్తున్నా రేపు ఎక్కువివ్వడానికిచాన్సుంది ఈ ట్రాన్స్‌పోర్టు కంపెనీ గవర్నమెంటు తీసుకుంటే గవర్నమెంటుఉద్యోగమేఅయి పోతుంది తనది. కాకపోయినా కంపెనీ వుద్యోగాలు అంత చచ్చిపోయిలేవు.

ఆస్తిలేకపోయినా అప్పు లేదు. అన్నగారా, ఏదో లాయరు. తనకోకాణీ ఇవ్వ వలసినవాడేగాని తనదగ్గిర తీసుకోవలసిన వాడుకాడు. తనని పెద్దచదువేదైనా చదువు కోమనీ, విశాఖపట్నంలో వున్న ఇంటి తాలూకు సగం ఎప్పుడు కావలసే అప్పుడు ఎలాగకావలస్తే అలాగ ఇచ్చేస్తాననే అంటు న్నాడు.

వంశ సాంప్రదాయమా,-లచ్చయ్యగా రింగనే ఎరుగుదురు!

అలాటి తనని ఈ లచ్చయ్యగారు వరుల లిష్టులో ఎందుకు చేర్చలేదు?

ఏమో!

ఆయన చాలా ఆస్తిపరుడా?

మాటల సందర్భంలో తనకి డెబ్బయి అయిదువేలు నగదుందనీ పొలంమీద ఏడాదికి పది గరిశెలు వస్తాయనీ ఆయన సూచించాడు.

పోస్తే?

ఇద్దరాడపిల్లల పెళ్ళి శుభ్రంగా చేశాక ఇద్దరు మొగపిల్లలూ బాగా చదువుకొని పంచుకుంటే ఇదేమంత పెద్దాస్తింకాదు.

పైగా లచ్చయ్యగారూ లచ్చమ్మగారూ ముసిలయిపోలేదు.

అయినప్పుడాయన ఆస్తిపరుణ్ణని అనుకో డంలో ఏమంత చరిత్రారం లేదు.

తనకి తల్లీ అన్నగారూ వున్నారని లచ్చయ్యగారికీ తెలుసును.

సక్రమంగా వారిద్వారా తప్ప ఏవిధమైన సంబంధ బాంధవ్యాలూ కొరపనని ఆయన సూచించాడు. సూచించడమేమిటి, ప్రకటించాడు.

వాళ్ళని ఈయన అడగలేదు.

అడిగితే వాళ్ళు రాయానే రాద్దురు.

పోనీ, తనే, ఈయన్ని సంప్రదించమని వారికి రాసే?

అది వాళ్ళొప్పుకోరు.

అది కులాచారంకాదు.

మొగవాడు ప్రెయివేటుగా ఆడదాన్ని కాళ్ళా వేళ్ళా పడి నువ్వు నాకు కావాలి, నువ్వులేందే బతకలేనంటూ అడ్డమైన ప్రమాణాలూ చెయొచ్చును.

అది లోకాచారం.

కాని మావాడికి మీ పిల్ల నివ్వండంటూ పబ్లీకున అడగకూడదు.

అది కులాచారం కాదు.

ఎలాగ?

ఎవరో ఎదురుగుండావొస్తూ పలకరించి నట్టుంది.

తలెత్తి చూశాడు. వేణుగోపాలస్వామి ఆలయందాకా వొచ్చాడు.

చేతులు రెండూ తెలియకుండా నమస్కారం చేశాయి.

వారిద్దరూ సత్యనారాయణగారూ కామేశ్వరావుగారున్నూ-తండ్రిగారితో లా చదివేరట.

సత్యనారాయణగారందుకున్నారు."ఏమబ్బాయీ, కనిపించడం లేదూ. పని వొత్తిడిగా వుందా?" అని-

'ఛ్చె లేదండీ.'

'మీ అన్నయ్యనించి ఉత్తరాలొస్తున్నాయా?'

'ఒస్తున్నాయండీ-'

'నీకేదయినా పెళ్లిసమంధాలు చూస్తున్నాడా?'

'లేదండీ-'

'అందుకని-నువ్వే చూసుకుంటున్నావన్నమాట!' అని ఆయన నవ్వాడు. గుండె కలుక్కుమంది.

'ఏం మాట్లాడవేం-నువ్వు లాయీ చీల లచ్చయ్య కూతుర్ని చేసుకుంటావటగా!'

"లేదండీ-"

"ఏమిటిలేదండీ-ఇంకా పెళ్ళికాలేదనా దావర్దం?" అని చమత్కరించారు కామేశ్వరావుగారు.

'మొన్న మీరిద్దరూ కలిసి తిరుగుతూంటే పెళ్ళి అయిపోయిందనుకున్నాను. కాని ఇవాళ కబ్బులో తేలిసింది; ఇంకా పెళ్ళి కాలేదనీ, ఇంకా "వూయింగు" లోనే వుందని."

ఇంతవరకూ వొచ్చిందన్నమాట.

పొరపాటె—

కాకినాడంత సిటీలో ఒక్క మగాడూ ఒక్క ఆడదీ కలిసిన ఒక్క టెజంట. కలిసి తిరిగినే సముద్రంలో కాకిరెట్టలా గమనించే వారెవరని అనుకున్నాడు తను.

గమనించేవారు కాకినాడలోనేకాదు. కలకత్తాలోనూ గమనిస్తారు.

ఓహోరకంగా తిరిగాడా తను కాంతంతో! నెలా పదిహేనురోజుల్లో నాలుగు సినిమాలూ, ఒక నాటకం, ఒక కాలేజీలో ఫంక్షనూ ఎన్నోసార్లు హోటలుకి.

నిజంగా పెళ్లాడినవాళ్ళే అలా తిరగరు.

(నిజంగా పెళ్లాడినవాళ్ళు అలా తిరగరు)

అందులో ఆ కాంతం వుండే-దాన్నేం చేస్తే పాపం?

పబ్లీకు మెయిన్‌రోడుమీద సైకిలేసుకు పోతున్నా లత్యపెట్టక-'ఏయ్ సూర్యం, నిన్నే!' అని స్పష్టంగా పిలుస్తుంది. ఆగే వరకూ విడిచిపెటదు.

ఛా! ఇహ ఆపాలి.

* * *

మూడురోజులు సూర్యం గాంధీనగరం వెళ్ళలేదు.

నాలుగోనాడు కంపెనీకి శెలవు. ఇంట్లోనే వుండిపోయాడు.

సాయంకాలం అరింటికి పోస్టువొచ్చింది. అది ఎక్స్‌ప్రెస్ డెలివరీ-

విప్పిచూస్తే దాన్నిండా ఆశ్చర్యంవుంది.

తల్లిగారూ అన్నగారూ రాసిన ఉత్తరమది.

ఇక్కడ తను 'నడుపుతున్న నవప్రణయం' విశాఖపట్నం వెళ్ళింది.

జాగర్తగా వుండమని హెచ్చరిక.

ఈ లాయరు సత్యనారాయణగారే రాసి వుంటారు అన్నగారిక్కి-

ఈలాయరున్నారే, వీళ్లు...

ఊఁ-ఎందుకులే.

అన్నగారులాయరు;తండ్రిగారులాయరు,

కాయితం పెతుక్కుని వెంటనే జవాబు వ్రాశాడు. అదంతా వట్టిదే-అలాటి దేమీ నమ్మొద్దనీ-

చించేసి మళ్ళా రాశాడు. నిజమే గాని అదంతా ఒక ఫ్రెండ్లీ ఎఫయిర్ తప్ప అంత కుమించేమీ లేదనీ;ఎలాగయినా ఇహమీదట మానేస్తాననీ, ఇప్పటికే తగ్గించుకున్నాననీ-దీంట్లో సుమారుగా జరిగిందంతా రాశాడు. టూకీగా.

పెరట్లోకి బాత్‌రూమ్‌లోకి వెళ్ళొచ్చే సరికి కుర్చీలో కాంతం కూచొనుంది.

'అరే!' అన్నాడు సూర్యం.

కాంతం లేచి మంచందగ్గర కెళి కూచుంది సూర్యం తువాలుతో చేతులు తుడుచుకొని కూచున్నాడు కుర్చీలో.

'ఏం, ఇలా వొచ్చావు కాంతం!'

★ నాన్న వొద్దన్నాడు ★

'ఊరికనే. ఏం, రవసం మానేశావ్?'

బావుంది. నీకోసం పెళ్ళికొడుకులొస్తూ వుంటే నేనెందుకూ అక్కడికి? పెళ్ళి కొస్తా చెపడానికా! వనఃటికి ఓబావగారు మరిదిని ఆడిగారట నీకు జోరీగల జోగారావు తెలుసా అని; అఁ, నాకెందుకు తెలీదు, అక్కయ్య పెళ్ళయ్యేంతవరకూ అక్కయ్యను పెళ్ళాడుతానని రోజూ మనంటికొచ్చే వాడుకదా, అన్నాటమరిది.'

'ఓటిపెడుదూ, నీ ఇనపవిటూ—'

'ఓటిపెట్టాను. అసలు సంగతి చెప్పు. నువ్వెందుకొచ్చినట్టు చీకటడ్డాది. చాలా దూరం వెళ్ళాలి నువ్వు. వేగిరం బయలేరు. నేను దిగబెట్టాలంటే కష్టం మాళ్ళాను'

'పోనీ నువ్వంత దిగబెట్టఃపోతే రాత్రి కిక్కడేవుండి పొద్దుట వెళతానే'

'అబ్బో, అబ్బో, చాలా జోరుగావుందే కథ! అంత పనుందా?'

'అవును గానీ—'

'కానీ—'

'నీ టేబిలుమీద ఈ తీరం చూశాను'

సూర్యం రెండు మూడు నిమిషాలు మాట్లాడలేదు. అతను మళ్ళా ఈ తీరం తీసి చదువుకున్నాడు. నిజానికి అందులో కొంతం చూడకూడనిది ఏమీ లేదు.

'సరేలే—' అన్నాడు. 'అది ఒకందుకు మంచిదే. నేనిన్నితో చెప్పడం యెలాగా అని ఇదవుతున్నాను!'

'నిజంగా నీ వుద్దేశం అంతేనా?'

'నీతో నే నీ విషయం మాటాడలేను.'

'ఏం?'

'మనమిద్దరం ఈ సంగతి ఇంతకి ముందు అనుకోంగే?'

'నిజమే అనుకో—కానీ నువ్వు ఆలోచించకుండా ఈ విషయంలో మాట్లాడగలవని నాకూ తెలుసు. అంచేత దాచుకుమూతలు మానేయి. నేనీ సంగతి తేల్చుకోడానికే వొచ్చాను.'

'ఏమిటో నీ గొడవ. నన్నేమిటిలా వేపుకుతింటున్నావివాళ? మనం ఎప్పుడూ ఇలా కతుగా మాట్లాడుకోలేదు.'

'న్నా! నువ్వు అడ్డదిడ్డంగా మాట్లాడ్డం మానుతావా లేదా?'

ఈ మాటకి సూర్యానికి తెలివొచ్చింది.

'ఏమిటి కొంతమూ ఇవాళ అలా వున్నావూ?'

'ఏం లేదూ. నేను చెప్పలేకనే పోతున్నాను. నువ్వూ మాడ్ చెడగొట్టకొని ఇష్టానుసారం మాట్లాడుతావు. సరిగా చెప్పవు; సరిగా అడగనివ్వవు. అడుగుదామని రావడం నాకే తెలివితక్కువ. నీచేత అడిగించి నేనే ఇలా మాట్లాడితే?'

రెండు నిమిషాలు సూర్యం ఆలోచనలో పడ్డాడు.

అవును కొంతం తనని ఈ ముఖ్య విషయం అడుగుదామనుకొంది.

ఈన జవాబు తనకి వుందిగా.

'నువ్వు నన్ను పెళ్ళాడుదామనుకున్నావా సూర్యం?'

'నేనేం చెప్పగల్ను? కొన్ని పరిస్థితుల్లో అయితే అనుకుందునేమో. ఇప్పుడు అలా ఏం అనుకోడం లేదు.'

'ఏం?'

'ఏముంటే?—ఏం లేదన్నమాటే—మీ నాన్న నడిరోడ్డుమీద నిలబడి నాకూతుర్ని పెళ్ళాడే వుద్దేశం వుంటే మా యింటికే దావొద్దన్నాడు.—రెండోది ఏమిటండీ.'

'ఆగావేం?'

'—ఏముంది-నీకూ ఒక బావ వున్నాడనీ అతన్ని నీకూ నిన్ను అతనికీ జతచేసి అంటున్నారనీ, తెలిసిందిగా! ఇహ నేను కూడా నిన్ను పెళ్ళాడుదామనుకోడం ఎందుకూ? పైగా-ఇంకో విశేషం ఏమిటంటే నేనుఎదర తిరుగుతూ వుండీ మీ బావా వుండి మీ నాన్న పై సంబంధాలువెతకడం మానుకోడం లేదు; ఇహ నాకెందుకూ అనుమానం?'

'నాకివాళే తెలిసింది—మా నాన్న నిన్ను దగా చేశాడు. ఆయ నేమనుకున్నాడంటే—దిక్కుమాల్ని పాకులాట!—మనిద్దర్నీ ఫ్రీగా తిరగనిచ్చాడు. మనం ఎప్పుడూ అనుకోకపోయినా మనం బాగా నే స్నేహం చేసుకున్నాం. నీ అంతట నువ్వే మీ వాళ్ళ ద్వారా ప్రయత్నం చేస్తావనుకొని మొదట్లో చెప్పకుండా నిన్ను దగాచేశాడు!'

'హోఁ; నేనే ప్రయత్నంచేస్తే?'

'ఏముంది, మర్యాదగా కట్నం ఎక్కడ తాకూ!'

'ఓస్, ఇంతేగద! నాక సలు కట్నం పుచ్చుకోవాలని లేదు.'

'నీకు పుచ్చుకుందామని లేకపోతే సరా? నాకు తేదామనుంది. డబ్బు తెస్తే పనికిరాదని నువ్వూ అనవు.'

'లాభం లేదు. కటిపెట్టు. డబ్బుగురించి కూడా నీకు చాలా ఘోరమైన అయిడియాలున్నాయి ఈ పరిస్థితుల్లో మనం కనీసం డబ్బుగురించైనా ఇంతకంటే మాట్లాడక పోడం మంచిది.'

'మాట్లాడెయ్యటం అంతకంటే మంచిదీ. డబ్బు శాశ్వతమూ అనీ, ఇవాళవుంటే రేపు వుండదనీ, ఏదో చాలా తేలిగ్గా మాట్లాడతారుకొందరు. అలాటి ఘోరమైన అయిడియాలుమాస్తే నాకూ చిరాకేనూ. ఇంతకీ పదివేలు కట్నం నేతెస్తే ఎవర పదివేలూ పోసి నువ్వు నాకు బంగారం నగలు దిగేయ్యక్కరేదు, నేనలాటివి మెయ్యలేను. ఇహ లేకుండా వుంటేనమంటావా, డబ్బు లక్షా యాభైవేలు నాన్న దగ్గిర వుండిపోవడం నాకంత కంటే యిష్టం లేదు. తెలివున్న వాళ్ళెవరైనా యీ పరిస్థితుల్లో నాన్న డబ్బుని సక్రమంగా వుపయోగించుకుంటారు. నువ్వొమాత్రం ఎల్లా ఇలా కంపెనీలో గుమాస్తాగా వుండిపోదామని అనుకుంటున్నావో లేదో నాకు తెలీదూ? పదునైనమామగారో సీయంబిబిఎస్ చదువుతానని నువ్వు నాన్నతో అనలేదూ?'

'ఏమో, అదంతా నేననుకోలేదు. నిన్ను నాకు పెళ్లిచేసే వుద్దేశం లేదని మీ నాన్న ఢంకా మీద దెబ్బకొట్టి చెబితేనే!—అందుకేగా, నిన్ను గురించి నేను ఆలోచించడమే మానుకున్నానూ!'

'మానుకుంటే మళ్లీ జ్ఞాపకం తెచ్చుకో వచ్చుగానీ-నాన్న వుద్దేశం యిదీఅని ఇవాళ ఆయనే అమ్మతో చెబుతున్నారు. నా వుద్దేశం ఏమిటంటే, యిలా నిన్నూ నన్నూ ఫూల్స్ చేసి ఆయన తనకీ వుద్దేశం లేదంటూ నిన్ను దగాచేశాడే, యిది నీకేలా అనిపిస్తోందో అని. మా నాన్న చేసే అవకతవక పనులన్నిటికీ నేను జవాబుదారీ కాదుగానీ, ఇంతకంటే వీధిని పడటం నాకిష్టం లేదు. నువ్వొద్దూ అంటే ఆయన్ని రేపు నిశ పట్నం వెళ్ళొద్దనే చెపాను.'

'ఏమో ఇందులో దగా ఏమిటో నాకర్థం కాలేదు. ఓ విధంగా ఆయన మనకి ప్రేమించుకునే అవకాశం యిచ్చాడంటాన్నేను. మనం ఒకళ్లనొకళ్లు 'పెళ్లి' అనే బహుమానం లేకుండా ఏమాత్రం ఆదరించుకుంటామో చూదామనీ, అవసరమైతే ఆ బహుమానం అప్పుడే యివ్వొచ్చుని మీ నాన్న యీ పాను వేశాడు. మనం చాలా బాగా ఆకర్షించుకొని 'పెళ్లి' వుండదనుకొని ఎవళ్ళ లిమిట్సులో వాళ్ళున్నాం. ఫస్టుగావుంది నాకు నచ్చింది సుమా' అన్నాడు సూర్యం.

కొంతం తలొంచేస్తోంది' అప్పుడే.


సూర్యంలేచి మంచం దగ్గరకు వెళ్తూ 'ఇంతకీ' నీమాటే చెప్పావు కావు. నీకు మీ బావంటే ఇష్టమున్నావూ?' అన్నాడు.

'ఆఁ బావా లేదు, వాడెప్పుడో ఏ అరవదాన్నో కన్నడదాన్నో ఇద్దరు ముగ్గురు పిల్లల్తో తీసుకొస్తాడు. అంతవరకూ వస్తున్నాడని వదంతి - అయితేనే వెళ్తా శేషా? పోయిందిగా!'

'ఉండు రాత్రికి ఇక్కడే వుందామనొచ్చి నట్టున్నావ్!'

★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



శివుడు, పార్వతి

—ఫిలడెల్ఫియా మ్యూజియంలోని భారతీయ శిల్పం.]

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.